thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 281 కరీంనగర్ గురువారం, 18 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.

# ప్రక్షాళన దిశగా..

## కొత్త పాలనకు సీఎం రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్!




## 'కోడ్' ముగియగానే భారీ మార్పులు!!

హైదరాబాద్ : పరిపాలన మీద పూర్తి స్థాయిలో పట్టు బిగించేందుకు తెలంగాణ సీఎం కసరత్తు మొదలుపెట్టారా? పాత వాసనలు లేకుండా అడ్మినిస్ట్రేషన్‌ను గాడిలో పెట్టాలని డిసైడయ్యారా? అందు కోసం ఎక్స్‌ట్రా కేర్ తీసుకోబోతున్నారా? ఏంటా ప్రత్యేక జాగ్రత్తలు? ముఖ్యమంత్రి రేవంత్ ఏం చేయబోతున్నారు? తెలంగాణలో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈనెల 17న మూడో విడత పోలింగ్ ముగియగానే ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఆ వెంటనే పెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేసి%ౌ% పరిపాలనా ప్రక్షాళనకు సిద్ధమవుతున్నారట సీఎం రేవంత్ రెడ్డి. పదవి చేపట్టాక తొలినాళ్ళలో ఉండే బాలారిష్టాలను అధిగమించడం, తర్వాత వరుస ఎన్నికల్లాంటి వాటితో ఇన్నాళ్ళు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేదదని, ఇక మీదట ఆ సమస్య నుంచి బయటపడాలనుకుంటున్నట్టు సమాచారం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు పూర్తి స్థాయిలో అందాలంటే సమర్థులైన అధికారులు ఉండాలన్న లక్ష్యంతో ఐఏఎస్‌లను బదిలీ చేయాలనుకుంటున్నారట. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళయింది. ఇప్పటి వరకు చాలా శాఖల్లో ఉన్నతాధికారులను మార్చలేదు. ఇప్పటి వరకు ఫోకల్ పోస్టుల్లో ఉన్న ఐఏఎస్ లనే మారుస్తూ వచ్చిన ప్రభుత్వం, ఈసారి నాన్ ఫోకల్ పోస్టుల్లో ఉన్న వారికి కూడా స్థాన చలనం కల్పించేందుకు సిద్దమైనట్టు తెలుస్తోంది. ఇక నుంచి పాలనను పరుగులు పెట్టించాలని భావిస్తున్నారట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇప్పటి వరకు కొన్ని సర్దుబాట్లు చేసుకునేందుకు సమయం ఇచ్చారని,ఇకపై పాలనలో తన ముద్ర వేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టాలని అనుకుంటున్నట్టు చెబుతున్నాయి సచివాలయ వర్గాలు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి నుంచి కింది వరకు అందర్నీ మార్చాలని నిర్ణయించుకుని ఆయా శాఖల నుంచి నివేదికలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారట ముఖ్యమంత్రి. ఆయన బాధ్యతలు తీసుకున్నాక కొన్ని శాఖలపై రివ్యూ నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారులకు స్థాన చలనం కల్పించారు. అంతేగాక సీఎంవోలోకి కొంతమంది అధికారులను తీసుకుని వారితో పని చేస్తూ వస్తున్నారు. రెండేళ్లు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలపై ఉన్నతాధికారులు ప్రజల్లో నమ్మకం కల్పించకపోతున్నట్టు భావిస్తున్నారట ముఖ్యమంత్రి. దీంతో సెక్రటేరియట్‌లో కూడా కొంతమంది సీనియర్ ఐఏఎస్‌లకు స్థానచలనం తప్పదని తెలుస్తోంది. సీఎంవో కార్యదర్శులను సైతం మార్చే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. పలు విషయాల్లో ముఖ్యమంత్రిని తప్పుదారి పట్టించిన సీఎంవో అధికారిని సైతం బదిలీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఆ అధికారే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఇప్పటిదాకా కాంగ్రెస్ సర్కార్‌లో కూడా ఆయన మాటే ఫైనల్ అన్నట్టు నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో మరో సీనియర్ ఐఏఎస్‌ను సీఎంవోలోకి తీసుకుని కీలక భాద్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సీఎంవోలో తీసుకుంటున్న నిర్ణయాలు వెంటనే బయటకు తెలిసి పోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహంగా ఉన్నారట. లోపలి వాళ్ళే కొందరు బయటకు లీకులు ఇస్తున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించినట్లు సమాచారం. అలాగే... పలు జిల్లాల్లో వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్న కలెక్టర్లు, కేవలం క్యాంపు ఆఫీసులకే పరిమితం అయి ప్రజల మధ్యకు వెళ్లని వాళ్ళను కూడా మార్చబోతున్నారు. పనితీరు ఆధారంగా రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లకు గ్రేడింగ్, ర్యాకింగ్ ఇస్తున్నారు. ఈ క్రమంలో పర్ఫార్మెన్స్ బాగోలేని కలెక్టర్లను పక్కకు పంపే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వారం రోజుల క్రితమే కొద్ది మంది ఐఏఎస్ లను రహస్యంగా బదిలీ చేసింది ప్రభుత్వం. విషయం బయటకు పొక్కకుండా ట్రాన్స్ ఫర్ ఆర్డర్స్ నేరుగా సదరు అధికారులకు పంపించారు. మరోవైపు ఐఎఫ్ఎస్ అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రంలో డిప్యుటేషన్ పై పని చేస్తున్న ఐఆర్ఎస్ అధికారి, సింగరేణి సిఎండి బలరాం నాయక్ ను కూడా మార్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెలాఖరుతో ఆయన డిప్యుటేషన్ ముగిసిపోతుంది. రాబోయే మూడేళ్ళలో ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఫోకస్ చేయాలనుకుంటున్నారు ముఖ్యమంత్రి. అందుకోసం విజన్ ఉన్న అధికారులకు ప్రాధాన్యం ఇచ్చి పని చేయించాలనుకుంటున్నట్టు తెలుస్తోంది.

## లోక్‌సభలో 'ప్రియాంకం'.. అన్న లేని లోటు తీరుస్తూ..




న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ రాజకీయ ముఖచిత్రం ఆసక్తికరంగా మారింది. ప్రతిపక్ష నేత రాహుల్ విదేశీ పర్యటనలో ఉండగా.. ఆయన గైర్హాజరీపై విమర్శలు గుప్పించిన బీజేపీకి సభలో సీన్ రివర్స్ అయింది. తొలిసారి ఎంపీగా అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ వాద్రా.. కాంగ్రెస్‌కు సారథ్యం వహిస్తూ, అధికార పక్షంపై విరుచుకుపడుతున్నారు. ప్రియాంక తన వాగ్ధాటితో రాహుల్ లేని లోటును భర్తీ చేయడమే కాకుండా, విపక్షాలకు కొత్త ఊపిరి పోశారు. ముఖ్యంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ (ఉపాధి హామీ) స్థానంలో కేంద్రం తెచ్చిన 'జి రామ్ జి' బిల్లుపై ప్రియాంక పోరాటం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కొత్త బిల్లు పేదల ఉపాధి హక్కును హరిస్తుందని, గ్రామ సభల అధికారాలను బలహీనపరుస్తుందని ఆమె సభలో గట్టిగా వాదించారు. నిధుల కేటాయింపులో కేంద్రం పెత్తనాన్ని ప్రశ్నిస్తూ, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆమె చేసిన విమర్శలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పథకం పేరు నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. సభలో చర్చ జరుగుతున్న సమయంలో అధికార పక్షం 'కుటుంబం' పేరుతో చేసిన వ్యాఖ్యలకు ప్రియాంక ఇచ్చిన కౌంటర్ అందరినీ ఆకట్టుకుంది. 'గాంధీ మా కుటుంబ సభ్యుడు కాదు. కానీ ఆయన ఈ దేశానికి తండ్రి, మన అందరికీ కుటుంబ సభ్యునితో సమానం' అంటూ ఆమె ఇచ్చిన సమాధానం బీజేపీ నేతలను ఆత్మరక్షణలో పడేసింది. కేవలం పేరు మార్పుల కోసమే ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందని, చర్చ లేకుండా బిల్లులను ఏకపక్షంగా ఆమోదించడం ప్రజాస్వామ్యానికే చేటని ఆమె హెచ్చరించారు.



## ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం

ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం దక్కింది. ఇథియోపియా దేశ అత్యున్నత పౌర పురస్కారమైన ది గ్రేట్ హానర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియాను మోడీ అందుకున్నారు. అంతేకాకుండా పురస్కారం అందుకోవడంతో ప్రపంచంలోనే ఈ గౌరవం అందుకున్న తొలి ప్రపంచ దేశాధినేతగా మోడీ నిలిచారు. ఇక ప్రధాని మోడీ ప్రస్తుతం ఇథియోపియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. మూడు దేశాల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలో అడుగుపెట్టారు. విమానాశ్రయంలో ఆ దేశ ప్రధాని అబియ్ అహ్మద్ అలీ స్వయంగా ప్రధాని మోడీకి స్వాగతం పలికారు. అధికారిక ప్రోటోకాల్ పక్కన పెట్టి ప్రధాని తన కారులోనే మోడీని హోటల్ కు తీసుకువెళ్లారు. మార్గమధ్యలో ఓ సైన్స్ మ్యూజియంను, ఫ్రెండ్ షిప్ పార్కులను మోడీకి చూపించారు. మరోవైపు ఇథియోపియా చేరుకున్న వెంటనే మోడీ తన ఎక్స్ ఖాతాలో వివిధ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇథియోపియా నాయకత్వంతో చర్చించడానికి ఎదురుచూస్తున్నట్టు తెలిపారు.




## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది

హైదరాబాద్ : శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు హైదరాబాద్ కు చేరుకున్నారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. హకీంపే ట ఎయిర్‌పోర్టులో తెలంగాణ గవర్నర్ జిషుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు డిసెంబర్ 17 నుంచి 22 వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హకీంపేట, అల్వాల్, బొలారం, తిరుమలగిరి, కార్ఖానా ప్రాంతాల్లో వాహనాల డైవర్షన్ కొనసాగుతుంది. రాష్ట్రపతి పర్యటన ముగిసే వరకు డ్రోన్లు, పారా గ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఎగురవేతపై నిషేధం. 18న సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిలిమ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. పలు అభివృద్ధి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారు.

20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో ప్రముఖుల కోసం 'ఎట్ హోమ్', పౌరుల భేటీ లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి బయలుదేరుతారు.

# పార్టీ మారినట్లు ఆధారాల్లేవు..

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పీకర్ కీలక తీర్పు..




హైదరాబాద్, డిసెంబర్ 17: రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ లు తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారారని, వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు కంప్లైంట్ ఇచ్చారు. ఈ విషయంలో స్పీకర్ ఆలస్యం చేస్తుండటంతో.. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై పలు దఫాలుగా విచారించిన సుప్రీం ధర్మాసనం.. డిసెంబర్ 18వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్.. ఇవాళ(బుధవారం) ఐదుగురు ఎమ్మెల్యేల కేసులో తీర్పును వెలువరించారు.

ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్‌కు సంబంధించిన పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టమైన తీర్పునిచ్చారు. పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టేశారు. ఇక, మిగిలిన వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులో గురువారం నాడు తీర్పు వెలువరించనున్నారు స్పీకర్. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంకా విచారించాల్సి ఉంది. వీరికి స్పీకర్ నోటీసులు జారీ చేసినప్పటికీ.. ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. వీరి విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారింది.



# 112 కేజీల గంజాయి పట్టివేత.. ఒకరి అరెస్ట్

కృష్ణా జిల్లా, డిసెంబర్ 17: రాష్ట్రంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. పోలీసులు ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహించి గంజాయిని తరలించే ముఠాను అడ్డుకుని అరెస్ట్‌లు చేస్తున్నారు. తాజాగా గన్నవరంలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకుని భారీగా గంజాయిని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే... కృష్ణా జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. గన్నవరంలోని బీబీ గూడెం అండర్ పాస్ వద్ద పోలీసులు ఈరోజు (బుధవారం) వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వెంటనే అడ్డుకున్నారు. దాదాపు 112 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర పూణేకు చెందిన దీపక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు పూర్వాపరాలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరించారు. సాధారణ వాహన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నామని ఎస్పీ తెలిపారు. పెనమలూరులో కూడా గంజాయి ప్యాకెట్లు పార్శిల్ చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్ వెల్లడించారు.

# సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీ వాయిదా




తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ వాయిదా పడింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20వ తేదీన బాధ్యతలు స్వీకరించాల్సి ఉండింది. అయితే, ముహూర్తాల కారణంగా బాధ్యతల స్వీకరణ రెండు రోజులు ముందుకు జరిగింది. డిసెంబర్ 20వ తేదీన సరైన ముహూర్తాలు లేవని.. 22కు వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వారి విజ్ఞప్తులపై పంచాయతీరాజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీని 20 నుంచి 22వ తేదీకి మార్పు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రోజున నూతన సర్పంచులు, వార్డు సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు.

**ముగిసిన పంచాయతీ ఎన్నికలు..** నేటి(బుధవారం)తో మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. బుధవారం మూడవ విడతలో భాగంగా 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉండనుంది. సాయంత్రానికి ఫలితాలు రానున్నాయి. డిసెంబర్ 22వ తేదీన జరిగే మొదటి సమావేశంలో కొత్త పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేయనున్నాయి. 'గ్రామ పంచాయతీ సర్పంచినైన/సభ్యుడినైన ు (విజేత పేరు)ుఅను నేను శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత కలిగి ఉంటానని, నేను స్వీకరించబోతున్న విధిని నమ్మకంగా నిర్వహిస్తానని భగవంతుని పేర/సత్యనిష'తో ప్రమాణం చేస్తున్నాను' అని ప్రతిజ్ఞ చేయనున్నారు.

# స్పీకర్ తీర్పుపై న్యాయపోరాటం చేస్తాం: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిరయంపై హైకోర్టుకు వెళ్తామని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ తెలిపారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పు అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. "మా వాదనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. తీర్పు కాపీని అధ్యయనం చేసి హైకోర్టుకు వెళ్తాం. స్పీకర్.. సింగిల్ లైన్ స్టేట్‌మెంట్‌తో పిటిషన్లను తోసిపుచ్చటం సరికాదు. సమగ్ర విచారణ చేసి నిరయం తీసుకోవాల్సి ఉంటుంది. స్పీకర్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా వచ్చినట్లు భావిస్తున్నాం. సీఎం వ్యాఖ్యలను సమర్థిస్తూ ఆయన నిరయం తీసుకున్నట్టు అనిపిస్తోంది. పార్టీ మారిన వారు బాహటంగా కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. సుప్రీంకోర్టు కఠినంగా హెచ్చరించేంత వరకు స్పీకర్ నిర?యం తీసుకోలేదు. 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి. 10 నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. స్పీకర్ తీర్పుపై న్యాయపోరాటం చేస్తాం.. విజయం సాధిస్తాం.

# హైదరాబాద్‌లో మూడు రోడ్లు - ముప్పుతిప్పలు.. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జామ్.!

హైదరాబాద్ : నగరంలో ఐటీ ఉద్యోగుల విలువైన సమయం రోడ్ల పాలవుతోంది. ఐటీ కారిడార్‌కు వస్తున్న ఉద్యోగులు ట్రాఫిక్ జామ్‌లతో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కారిడార్‌కు చేరుకునే మూడు రోడ్లలోనూ సోమవారం నుంచి శుక్రవారం వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. దీంతో ఏ మార్గంలో వెళ్లాలన్నా ట్రాఫిక్ చిక్కులు తప్పట్లేదు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లోనే వాహనాలను నెట్టుకుంటూ ముందుకు వెళ్లాల్సి వస్తోంది. రహదారుల విస్తరణ జరగకపోవడం, ప్రత్యామ్నాయ మార్గాలుగా అంతర్గత రహదారులు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణమవుతోంది. నగరం నలుమూలల నుంచి ఐటీ కారిడార్‌కు వచ్చే ఉద్యోగుల సంఖ్య భారీగా ఉంటోంది. కారిడార్ మీదుగా వెళ్లే మూడు ప్రధాన రహదారులే వీరికి ఆధారం. గచ్చిబౌలి ఔటర్‌రింగు రోడ్డు చౌరస్తా నుంచి కొండాపూర్, కొత్తగూడ మీదుగా హఫీజ్‌పేట వరకు ఉన్న పాత ముంబయి హైవే, రాయదుర్గం బయోడైవర్సిటీ నుంచి మైండ్‌స్పేస్ జంక్షన్, సైబర్ టవర్స్, హైటెక్ సిటీ, శిల్పారామం మీదుగా కేపీహెచ్బీ-జేఎన్టీయూ వరకు, కొత్తగూడ-కొండాపూర్ చౌరస్తా నుంచి హైటెక్స్ కూడలి, సైబర్ టవర్స్ మీదుగా మాదాపూర్-జూబ్లీహిల్స్ వరకు ఉన్న ఈ రోడ్ల మీదే వీరు ప్రయాణించాల్సి వస్తోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐటీ కారిడార్‌లో రాకపోకలు సాగించే వారికి ట్రాఫిక్ నరకం అంటే ఏమిటో కళ్లముందు కనిపిస్తుంది. అడుగులో అడుగు వేసినట్లుగా కదిలే వాహనాలతో గంటల తరబడి రోడ్లమీదే గడపాల్సి వస్తోంది.

**రోడ్డు దాటడానికే ఫ్లైఓవర్లు!...** ఐటీ కారిడార్‌లో నిర్మించిన ఫ్లైఓవర్లు కొన్ని ఒక చౌరస్తా వద్ద రోడ్డు దాటడానికే అన్నట్లుగా మారాయి. గచ్చిబౌలి చౌరస్తాలో ఓఆర్ఆర్, కొండాపూర్ వైపు నిర్మించిన ఫ్లైఓవర్‌దీ అదే పరిస్థితి. ఈ ఫ్లైఓవర్ దిగగానే నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతోంది. దీన్ని పరిష్కరించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నవైపు నుంచి వచ్చే వాహనాలు వెళ్లేందుకు బారికేడ్లను ఏర్పాటుచేసి ఆపోజిట్ డైరెక్షన్ రోడ్డు మీదకు మళ్లిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులకు ఇదో పెద్ద టాస్క్‌గా మారింది. ఇదే పరిస్థితిని కొండాపూర్ నుంచి హఫీజ్‌పేట వెళ్లే ఫ్లైఓవర్ మీద కూడా కొనసాగిస్తున్నారు.

**అక్రమ పార్కింగ్‌లు..** ఐటీ కారిడార్లో కేవలం ఐటీ కంపెనీలు, నివాస ప్రాంతాలే కాకుండా రకరకాల వ్యాపార సంస్థలు పెద్దఎత్తున వెలిశాయి. ఇవన్నీ ప్రధాన రోడ్ల వెంటే ఏర్పాటుచేశారు. ఆయా వ్యాపార సంస్థలకు వచ్చే వాహనాలకు సరిపడా పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రోడ్లమీదే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలకు అక్రమ పార్కింగ్‌లు అడ్డంకిగా మారి ట్రాఫిక్ జామ్‌కు దారితీస్తోంది. ఆకాశహర్మ్యాల భవనాలతోనూ ట్రాఫిక్ పెరిగింది. ఇక్కడ 30 అంతస్థుల నుంచి 40, 50, 60 అంతస్థుల వరకు భవనాలు నిర్మించుకునేలా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఇస్తుండటంతో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతోంది.

**ప్రజారవాణా వ్యవస్థ లేకపోవడం..** పది లక్షలకుపైగా ఐటీ ఉద్యోగులు పనిచేసే ఐటీ కారిడార్‌కు మెరుగైన ప్రజారవాణా వ్యవస్థ అందుబాటులో లేదు. ఆర్టీసీ బస్సులూ అంతంత మాత్రంగా ఉండటంతో ఈ ప్రాంతానికి వచ్చే వారంతా ప్రైవేట్, సొంత వాహనాలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో రైలు సౌకర్యం ఉన్నా.. అది హైటెక్ సిటీ, మైండ్‌స్పేస్ జంక్షన్ వరకే ఉంది. దీంతో రాయదుర్గం, కొండాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, కోకాపేట, పుప్పాల్‌గూడ ప్రాంతాల్లో ఉన్న ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న వారు సొంత వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

**వర్క్ ఫ్రమ్ హోమ్‌తో కొంత పరిష్కారం..** ట్రాఫిక్ జామ్ సమస్యకు పరిష్కారంగా ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని రవాణారంగ నిపుణులు సూచిస్తున్నారు. కరోనా సమయంలో 90 శాతం మంది ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేశారు. ఆ సమయంలో ఈ స్థాయిలో ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తలేదు. ఆ తర్వాత కొన్ని మినహా మిగతా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎత్తివేస్తూ ఉద్యోగులు ఆఫీసులకు వచ్చి పనిచేయాలని నిర్ణయించడంతో ట్రాఫిక్ ఇక్కట్లు భారీగా పెరిగాయి. తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలని ఐటీ ఉద్యోగులు కోరుతున్నారు.







# పురుషుల ఖాతాల్లోకి రూ.10 వేలు.. రాబట్టేందుకు అధికారుల ఆపసోపాలు

బిహార్ ఎన్నికలకు ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పథకంలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రాష్ట్రంలోని 75 లక్షలమంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో కొంతమంది పురుషుల ఖాతాల్లోకి కూడా డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించిన అధికారులు వాటిని రాబట్టేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ ఎన్నికలకు ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పథకంలో భాగంగా అక్కడి ప్రభుత్వం మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలకు రూ.10 వేలు బదిలీ చేసింది. ఆ సమయంలో సాంకేతిక లోపం కారణంగా దర్భంగా జిల్లాలోని అహియారి గ్రామంలోని పలువురు పురుషుల ఖాతాల్లోకూ రూ.10వేలు బదిలీ అయ్యాయి. అనంతరం ఈ పొరపాటును గుర్తించిన జిల్లా అధికారులు ఖాతాల్లో జమ అయిన డబ్బును తిరిగి చెల్లించాల్సిందిగా గ్రామంలోని పలువురు పురుషులకు నోటీసులు జారీ చేశారు. అయితే ప్రభుత్వం తమ ఖాతాలలో వేసిన రూ.10వేలను ఖర్చు చేసినట్లు వారు చెబుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఆ డబ్బుతో బాతులు, మేకలు కొనుగోలు చేశామని.. ఇప్పుడు ఆ నగదు తిరిగివ్వడానికి కుదరదని వారు తేల్చిచెబుతున్నారన్నారు. దీంతో గ్రామంలోని పురుషుల నుంచి డబ్బు తిరిగి రాబట్టడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మరో వైపు తమ వద్ద అంత మొత్తంలో డబ్బు లేదని.. అధికారులు చేసిన తప్పిదం వల్ల ఇలా జరిగింది కాబట్టి.. తమ ఖాతాల్లో పడిన మొత్తం నగదును మాఫీ చేయాలని అహియారి గ్రామంలోని పురుషులు ముఖ్యమంత్రి నీతీశ్‌ను కోరుతున్నారు.




# మావో అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పిల్..

మావోయిస్టు అగ్ర నేత హిడ్మా మరణం ఒక సెన్సేషన్ గా మారిన విషయం తెలిసిందే. అయితే.. హిడ్మాతోపాటు ఇతరుల ఎన్‌కౌంటర్‌పై పీపుల్స్ యూనిటి ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల హై కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సిట్టింగ్ జడ్జితో లేదా ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జయ వింధ్యాల దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచారు. మెజిస్టీరియల్ విచారణపై పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జ్ లేదా మెజిస్ట్రేట్‌ని ఆశ్రయించాలని పేర్కొన్నారు. నేరుగా హై కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేయడం కంటే, కింది కోర్టులో ఫిర్యాదు చేసి విచారణ కోరడం సరైన ప్రక్రియ అని అయన అభిప్రాయపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చట్టబద్ధంగా జరగాల్సిన మెజిస్టీరియల్ విచారణ ఇప్పటికే మొదలైందని, దర్యాప్తు సంస్థలు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాయని ఏజీ కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే.. అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హై కోర్టు ధర్మాసనం, ఈ విషయంలో మరింత లోతుగా అధ్యాయనం చేయాలని పిటీషనర్ తరుపు న్యాయవాదిని ఆదేశించడం గమనార్హం.

# 16 మంది అరెస్టులపై మావోల సంచలన ప్రకటన



హైదరాబాద్, డిసెంబర్ 17: ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌లో 16 మంది మావోయిస్టుల అరెస్ట్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేశారు. టీజీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ రిలీజ్ అయ్యింది. కకర్ బుడ్డి , బాబ్జీ పేట్ గ్రామాల పరిసరాల్లో నిరాయుధంగా ఉన్న మావోయిస్టుల అరెస్ట్‌ను తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామిక వాతావరణానికి, ప్రజల అభీష్టానికి ఈ అరెస్టులు ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించింది. ఫాసిస్టు బీజేపీ రూపొందించిన కగార్ యుద్ధానికి మద్దతు ఇవ్వొదని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు, సంఘాలు తెలంగాణలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందు నుంచి కొనసాగుతున్న ప్రశాంత వాతావరణాన్ని కొనసాగేందుకు వీలుగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు వీలుగా ఉద్యమించాలని పిలుపునిస్తున్నామని లేఖలో పేర్కొంది. మావోయిస్టు ముక్త్ (దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలను, భావజాలాలను లేకుండా చేయడం) ప్రతిపక్ష ముక్త్ లక్ష్యంతో కగార్ యుద్ధాన్ని అమలు చేస్తోందని లేఖలో విమర్శించింది. ఏక్ భారత్, శ్రేష' భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ నినాదాలతో దేశంలోని అన్ని పార్టీలను నిర్వీర్యం, నిర్మూలన చేసే పథకం ప్రకారం ముందుకు పోతుందని విమర్శించింది. ఎలక్షన్ కమీషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ, ఇతర రాజ్యాంగ సంస్థలను, వ్యవస్థలను తన కంట్రోల్‌లో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పాతర వేసిందని.. దానికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణగా వెల్లడించింది. వారు కొనసాగిస్తున్న ఆర్థిక పాలసీలు కార్పొరేట్ల ప్రయోజనాలకు మాత్రమే అని.. వారు తెస్తున్న పాలసీలు, చట్టాలు దేశంలోని ప్రజలకు, పార్టీలకు, సంఘాలకు అన్ని వర్గాలకు ప్రమాదకరమే అని లేఖలో తెలిపింది. అందరూ ఏకమై ఆర్ఎస్ఎస్ – బీజేపీలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నామని తెలంగాణ రాష్ట్ర కమిటీ లేఖలో పేర్కొంది.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, డిసెంబర్ 17: రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు మెంబర్లను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ పార్టీ ఒకటి, రెండు మించి సర్పంచ్ స్థానాలను గెలవలేదన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు సింబల్ ఉంటే అధిక స్థానాలు కైవసం చేసుకునే వాళ్లమని చెప్పారు. గ్రామాలకు వచ్చే నిధులు ఎవ్వరు ఆపలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యే సరికి.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగారన్నారు. ఎమ్మెల్యేలు చెప్పే మాటలు అబద్ధమని పేర్కొన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లు గెలుపొందిన గ్రామాలకు నిధులు ఇవ్వకుండా ఆ ఊర్లోకి ఎమ్మెల్యేలు అడుగు పెట్టగలరా? అంటూ ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ సత్తా చాటాలంటూ ప్రజలకు ఈ సందరరేగా ఆయన పిలుపునిచ్చారు.

గెలిచే అభ్యర్థులను బరిలో నిలబెట్టి కలిసికట్టుగా పని చేద్దామని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ జిల్లాకు రెండేళ్లలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూ పెదవి విరిచారు. మన జిల్లాకు అన్నం పెట్టేది పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్ అని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టును నిలిపేశావరంటూ రేవంత్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు.

# ఢిల్లీ సరిహద్దుల్లోని 9 టోల్ ప్లాజాలను తీసేయండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్రస్థాయికి చేరుకుంటున్న వాయు కాలుష్య సమస్యపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సంక్షోభం వార్షిక లక్షణంగా మారిందని, దీన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని పేర్కొంది. కాలుష్యానికి వాహనాలు ప్రధాన కారణాల్లో ఒకటిగా గుర్తించిన న్యాయస్థానం, ఢిల్లీలోకి ప్రవేశించే సరిహద్దుల్లోని టోల్ ప్లాజాలు ట్రాఫిక్ ఆటంకాలు, క్యూలకు దారితీసి కాలుష్యాన్ని పెంచుతున్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ సరిహద్దుల్లోని 9 టోల్ ప్లాజాలను తాత్కాలికంగా మార్చాలని లేదా సస్పెండ్ చేయాలని ఆదేశించింది. పీక్ వింటర్ నెలల్లో (అక్టోబర్ 1 నుంచి జనవరి 31 వరకు) టోల్ సేకరణను నిలిపివేయాలని, జనవరి 31 వరకు టోల్ ప్లాజాలు లేకుండా చూడాలని కోర్టు సూచించింది. టోల్ ప్లాజాలను 50 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని, ఇది ట్రాఫిక్ డైవర్ట్ చేసి కాలుష్యాన్ని తగ్గిస్తుందని పేర్కొంది. అదనంగా, కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తమ దీర్ఘకాలిక చర్యల ప్రణాళికను పునఃసమీక్షించి, దశలవారీగా అమలు చేయాలని ఆదేశించింది. కాలుష్య సమస్యకు ఏకకాలిక కారణాలు లేవని, నిపుణులు మాత్రమే శాశ్వత పరిష్కారాలు సూచించగలరని న్యాయస్థానం అభిప్రాయపడింది.

చురకలు



# కవిత్వంతో ఉద్యమ చైతన్యాన్ని నింపిన గరిమెళ్ల


## - డిసెంబర్ 18... గరిమెళ్ళ సత్యనారాయణ వర్ధంతి



అయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. తన కవితలతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం పట్ల కార్యోన్ముఖులను చేసిన మార్గ దర్శకుడు. ఎందరికో మార్గదర్శకు డైన పోరాట యోధుడు. పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు. ఇంకెందరిలోనో చైతన్య దీపాలను వెలిగించి, సత్యాగ్రహ బాట పట్టించిన స్ఫూర్తి ప్రదాత. నీతికి నిజాయితీకి నిలువుటద్దం. దేశభక్తి గీతాలు రాసిన నేరానికి పలు మార్లు జైలు కెళ్ళినా, రాయడం మానని ధీరుడు. స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" ఎలా నినాదంగా, ఉత్ప్రేరకంగా పని చేసిందో ... అలాగే ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా మార్మోగింది. ఒక విప్లవ గీతమైంది. అలాంటి ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన కవి ప్రముఖుడు గరిమెళ్ళ. సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని కోరినప్పుడు, ఇంగ్లీష్ లోకి అనువదించి టంగుటూరి ప్రకాశం పంతులు "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించాడు. స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్ట, అగ్ర స్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు గరిమెళ్ళ. అయన గేయాలు జాతీయ వీరరసంతో తొణికిస లాడుతూ పాఠక జనాన్ని ఉద్రూత లూగించాయి. 29 ఏళ్ళకే గేయాలు, రచనలు చేశాడు. స్వాతంత్ర్య పోరాటకాలంలో గరిమెళ్ళ గేయాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయంలోకి శరవేగంగా చొచ్చుకు పోయాయి. స్వరాజ్య గీతాలు, గేయాలు, వ్యాసాలు పదునైన ఛలోక్తులకు ఆయనకు ఆయనే సాటి. గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తా నుండి, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకునిగా, ఆనంద వాణికి సంపాదకునిగా ఏ విధులు నిర్వర్తించినా, నిజాయితీకి నిర్భీతికి నీతికి ప్రతీకగా నిలిచాడు. అయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" .... " అలాగే "దండాలు దండాలు భారత మాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగ జేసింది. నిజాయితీకి, నిర్భీతికి గరిమెళ్ళ మారుపేరుగా నిలిచాడు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మారు మోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు. గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయ నగరం, మచిలీ పట్నం, రాజమహేంద్ర వరం మొదలైనచోట్ల ఉన్నత చదువులు చదివాడు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పని చేశాడు. ఆ తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశాడు. అయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేక పోయాడు. 1920 డిసెంబర్?లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానం అమోదించ బడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ "మా కొద్దీ తెల్లదొరతనం" పాటను రాశాడు. పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా ( 12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆనోటా- ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా అయినందున తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగా, గరెమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష తనకు రాకపోయి నప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్య పరచ గలదో నేను ఊగించగల నన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగర వేసుకుంటూ...మాకొద్దీ తెల్లదొరతనం- దేవ మాకొద్దీ తెల్లదొరతనం అంటూ ఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకో సాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు. గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నాడు. అంతటి దేశభక్తుడు ఆయన. జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేశారు. ఆయన జీవితంలో మధుర ఘట్టం ఇదొక్కటే. అప్పులు పెరగడంతో ఉన్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చాడు. ఉద్యోగం వదిలేశాక కొంతకాలం ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశాడు. శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేశాడు. అవి అమ్ముడు పోలేదు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, పట్టించు కోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. వాటి వల్ల కూడా కొంత నష్టం వచ్చింది. 1921లో గరిమెళ్ళ ' స్వరాజ్య గీతములు ' పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకున్నాడు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువ దించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన ' ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువ దించాడు. 1937లో చీనా-జపాన్ అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకున్నాడు. అక్కడ గృహలక్ష్మి పత్రిక సంపాదకుడుగా ఉద్యోగంలో చేరాడు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకుడుగా చేరాడు. కొద్ది రోజులతర్వాత ఆంధ్రప్రభలో చేరాడు. కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేశాడు. కొంతకాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడు. స్వాతంత్ర్యానంతరం పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకో తగిన సహాయం లభించలేదు. దాంతో కొంతమంది మిత్రులు గరిమెళ్ళను ' మాకొద్దీ నల్ల దొరతనం ' అనే గేయం రాయమని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట. గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డాడు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు ఆర్థిక సహాయం చేసేవాడు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో కొంతకాలం యాచన మీద బ్రతికాడు. జీవిత చరమాంక దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన స్వగ్రామంలో మరణించాడు. పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలి పోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పాత్రలలో మాధవపెద్ది స్వరం పరకాయ ప్రవేశం

## డిసెంబర్ 18.. మాధవపెద్ది సత్యం వర్ధంతి



"వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాల వారి విందు, ఒహ్హొహ్హొ నాకే ముందు" అనే అలనాటి మల్టీ స్టారర్ చిత్రరాజం మాయా బజార్ చిత్రంలోని పాటను వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదేమో. ఆ పాట గుర్తుకు రాగానే వెను వెంటనే కళ్ళ ముందు కదలాడతూనే రూపం ఎస్వీ రంగారావు ది. ఆ వెంటనే స్ఫురణకు వచ్చేది మాధవపెద్ది గాత్రమే. ఎస్వీఆర్ నటనకు జీవం పోసిన నేపథ్య గాయకుడు మాధవపెద్ది. అంతేకాదు, దుర్యోధనుడు, రావణుడు, ఘటోత్కచుడు ఇలా ప్రతినాయక పాత్రలకు నేపథ్య గానం ఆయనదే. ఎస్వీరంగారావు, రేలంగి, రమణారెడ్డి లాంటి నాయకేతర నటుల నటనలతో ఆయన గొంతు మమేకం అయింది. మాధవపెద్దిది సుస్వరం. వివాహ భోజనంబు' అని తినుబండారాల గురించి వర్ణించినా, సరదా సరదా సిగరెట్టు' అని ధూమపానం అనర్థాల గురించి హెచ్చరించినా, అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి వాపోయినా, భళి భళి భళి భళి' దేవా అంటూ తత్త్వాన్ని బోధించినా, భలేచాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తెలిపినా, మాధవపెద్ది సుస్పష్ట స్వరం చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని మాధవపెద్ది గురించి గాన గంధర్వుడు ఎస్పీ. బాలు అంటుండే వారు. మాధవపెద్ది సత్యం (మార్చి 11, 1922 - డిసెంబర్ 18, 2000) తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు. ఈయన తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7,000 పైగా పాటలు పాడి ప్రసిద్ధి చెందాడు. సత్యం 1922, మార్చి 11 న బాపట్ల సమీపాన బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య, సుందరమ్మ దంపతులకు జన్మించాడు. వృత్తిరీత్యా నటుడైన సత్యం చిన్నతనములో ఎనిమిదేళ్ల వయసునుండి రంగస్థల నాటకాలలో నటించేవాడు. తెలుగు రంగ స్థలముపై మల్లాది సూర్య నారాయణ నాటక బృందములో సభ్యునిగా హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుని పాత్రను అద్భుతము పోషిస్తూ పేరు తెచ్చుకున్నాడు. ఆయన ప్రతిభను గుర్తించిన చక్రపాణి మాధవపెద్దిని తనతోపాటు మద్రాసు తీసుకువెళ్లి, తను నాగిరెడ్డితో కలిసి అప్పడే కొత్తగా స్థాపించబడిన విజయా పిక్చర్స్ పతాకము కింద నిర్మిస్తున్న షావుకారు చిత్రములో నటించే అవకాశము కలుగ జేశాడు. ఈయన తొలిసారిగా వెండితెరపై హిందీ, తమిళ ద్విభాషాచిత్రం రామదాసులో కనిపించాడు. ఆ సినిమాకు రెండు భాషల్లోనూ తన పాత్రర పాటలు తనే స్వయంగా పాడాడు. మాధవపెద్ది సత్యం షావుకారు సినిమాతో తెలుగు సినిమా రంగములో అడుగు పెట్టాడు. ఈ సినిమాలో సత్యం ఒక గుడ్డివాని పాత్రపోషించి ఆ పాత్రకు ఉన్న మూడు పాటలు పాడాడు. కొన్ని తెలుగు చిత్రాలలో నటించినా మాధవపెద్ది సత్యం ప్రధానంగా గాయకుడే. ఆయన ఆనాటి ప్రసిద్ధ సంగీత దర్శకులైన సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు తదితరు లందరితో పనిచేశాడు. ఎస్వీ రంగారావు, రేలంగి వెంకట రాయయ్య పాటలన్నీ దాదాపు ఆయనే పాడాడు. పౌరాణిక చిత్రాలలో పద్యాలు పాడటములో పేరెన్నిక గన్నాడు. ముఖ్యంగా పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం జోడి కలిసి పాడిన పాటలు తెలుగు వారి నోళ్ళలో ఇప్పటికి నానుతూనే ఉన్నాయి. 75 ఏళ్ళ వయసులో కూడా కృష్ణవంశీ తీసిన సింధూరం సినిమాలో సంకురాతిరి పండగొచ్చెరో పాటపాడి పలువురి ప్రశంసలందు కున్నాడు. ఇలా ఎందరో నటులకు ఆయన కంఠం అమరి పోయింది. రంగస్థల అనుభవం ఆయన్ని తీర్చిదిద్దింది. పద్యం ఆయన గళంలో వయ్యారాలు ఒలికించు కుంది. పాట ఆయన గొంతులో ఒదిగి పోయింది. పాడుతున్నది పాత్రలేవో, పాత్రదారులేమో అనిపించేలా పాత్రలలో ఆయన స్వరం పరకాయ ప్రవేశం చేస్తుంది. ఆయన పద్యంలో భావం తొణికిస లాడుతుంది. ఆయన పాటలో రాగం అలవోకగా అమరి పోతుంది. ఆయన కంఠంలో గాంభీర్యం నాట్య మాడుతుంది. ఆయన కంఠంలో హాస్యం గిలిగింతలు పెడుతుంది. తనకు వచ్చిన గౌరవ పురస్కారాలను ఎప్పుడూ ప్రదర్శించు కోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. రైలులో సెకండ్ క్లాసులోనే ప్రయాణించే వాడు. మాయాబజార్లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించలేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు . ఆయన 78 సంవత్సరాల వయసులో 2000, డిసెంబర్ 18న చెన్నైలో అస్వస్థతతో మరణించాడు. ఆయన కుమారుడు, కూచిపూడి నృత్య కోవిదుడు మాధవపెద్ది మూర్తి తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం ' మాధవపెద్ది సత్యం అవార్డు, మాధవపెద్ది ప్రభావతి అవార్డును ' నెలకొల్పారు. ఆ పురస్కారం అందుకొన్న వారిలో ఎం. ఎస్. విశ్వనాథన్, పి. బి. శ్రీనివాస్ లాంటి ప్రముఖులున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**





అమరావతి: మనం ఏ పనిచేస్తున్నా వివరాలు సమగ్రంగా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. అనుకున్న సమయానికి లక్ష్యాలు నెరవేరేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. పలు అంశాలపై కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. "నిరంతరం నేర్చుకునే పనిలోనే ఉండాలి. మంచి ఆలోచన ఎవరు ఇచ్చినా స్వీకరిద్దాం. చేసే పనిలో బాధ్యత, జవాబుదారీతనం ఉండాలి. మెరుగైన ఫలితాలు వచ్చే వాటికి ప్రాధాన్యత ఇస్తున్నా. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఎలా పనిచేస్తున్నాం అనేది ముఖ్యం. మనం చేసే పని వల్ల ప్రజలు మనతో కలిసి వస్తున్నారా? లేదా? అనేది గమనించాలి. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా కోర్టు కేసులను దాటుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చాం. అంతకుముందు డీఎస్సీ పెట్టాం.. దానికి కూడా ఇలాగే గందరగోళం సృష్టించారు.

బాధ్యత కలిగిన ప్రభుత్వమంటే అధికారాలు దుర్వినియోగం కాదు.. సద్వినియోగం కావాలి. అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందించే ప్రయత్నం చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

# ఆ ఫలితాలపై పరీక్షలు రాసిన విద్యార్థిలా ఎదురు చూస్తా: సీఎం చంద్రబాబు



అమరావతి: వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్లలో సాధించిన త్రైమాసిక ఫలితాలపై తాను పరీక్షలు రాసిన విద్యార్థిలా ఎదురు చూస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈసారి వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నామని, మొత్తం 17 వర్టికల్స్‌లో ఫలితాలు సాధిస్తేనే జీఎస్డీపీ పెరుగుతుందని తెలిపారు. లైవ్ స్టాక్, మ్యానుఫ్యాక్చరింగ్, ఫిషింగ్ సహా వేర్వేరు రంగాల్లో ఈ ప్రగతిని సాధించాలన్నారు. జీఎస్డీపీ సాధనలో జిల్లా స్థాయిలో పక్కా ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. పశుగ్రాసం పెంచే అంశంపై డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేయాలని దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాల వల్ల ఏపీ.. దక్షిణ భారతదేశంలో చివరి స్థానానికి చేరిందన్న సీఎం.. దీనిని తిరిగి గేరప్ చేసి అగ్ర స్థానానికి చేర్చాలని అన్నారు. రూ.70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు ఉద్యాన పంటల రంగంలో రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆయా శాఖలకు చెందిన ప్రగతిపై ఉన్నతాధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు.




# స్వయంగా చెక్ ఇచ్చిన మంత్రి నారా లోకేష్

అమరావతి, డిసెంబర్ 17: మహిళా క్రికెటర్ శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందజేసింది. ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన శ్రీచరణిని ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. మంత్రి నారా లోకేష్ రూ.2.5 కోట్ల చెక్‌ను శ్రీచరణికి అందజేశారు. ఈరోజు (బుధవారం) ఉండవల్లి నివాసంలో క్రికెటర్ శ్రీచరణికి మంత్రి లోకేష్ స్వయంగా చెక్‌ను అందించారు. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సహకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.2.5 కోట్ల మేర నగదు ప్రోత్సాహంతో పాటు విశాఖలో 500 గజాల విస్తీర్ణం గల ఇంటి స్థలాన్ని సర్కార్ కేటాయించింది. అలాగే డిగ్రీ పూర్తయిన తర్వాత శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 హోదా ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, శాప్ ఎండీ భరణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ డి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపీలో ముస్లింలకు శుభవార్త చెప్పిన కూటమి ప్రభుత్వం



విజయవాడ, డిసెంబర్ 17: ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు కూటమి ప్రభుత్వ శుభవార్త చెప్పింది. వచ్చే ఏడాది (హజ్ 2026) హజ్ యాత్రకు విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి వెళ్లే హాజీలకు ఏపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించనుంది. ఈ ప్రోత్సాహకానికి సంబంధించిన జీవోను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. గతంలో హజ్ యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు వంటి ఇతర మెట్రో నగరాల నుంచి మక్కాకు తరలివెళ్లేవారు. ఇప్పుడు విజయవాడలో ఎంబార్కేషన్ సెంటర్ ఏర్పాటుతో భక్తులకు భారీ ఉపశమనం కలిగింది. ఈ సెంటర్ నుంచి వెళ్లేందుకు అదనపు ఖర్చు (రూ.68 వేల వరకు) భరించకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల సబ్సిడీ ఇస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 347 మంది అభ్యర్థులు విజయవాడ హజ్ ఎంబార్కేషన్ సెంటర్ ద్వారా నమోదు చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నారని హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విజయవాడను అధికారిక ఎంబార్కేషన్ పాయింట్‌గా ఆమోదించడంతో ఈ సౌకర్యం సాధ్యమైంది. గత హజ్‌లో విజయవాడను ఎంచుకున్న 72 మంది హాజీలకు కూడా లక్ష రూపాయలు అందజేశారు. ఈ నిర్ణయం ముస్లిం సోదరుల్లో ఆనందాన్ని నింపుతోంది. హజ్ యాత్రికులు విజయవాడ సెంటర్‌ను ఎక్కువగా ఎంచుకోవాలని హజ్ కమిటీ కోరుతోంది. ఇది రాష్ట్ర మైనారిటీ సంక్షేమంలో కీలక మైలురాయని బాషా చెప్పుకొచ్చారు.

# అమరావతిలోనే రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్..



అమరావతి, డిసెంబర్ 17: గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి రిపబ్లిక్ డే వేడుకలను రాష్ట్ర రాజధాని అయిన అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ప్రతి ఏటా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే, ఈసారి మాత్రం రాజధాని అమరావతిలోనే రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రాయపూడి సీఆర్డీఏ ఆఫీసు సమీపంలో 20 ఎకరాల్లో రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సీఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

చురకలు

## సంపాదకీయం

### భారత్ పై పడి ఏడ్చినంత సేపు పట్టలేదుగా పాక్!

ఇటీవల అఫ్గనిస్థాన్–పాకిస్థాన్ మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే... టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంతో కొన్ని రోజులు కాల్పుల విరమణ జరిగింది. అయితే టర్కీ వేదికగా జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయని కథనాలొచ్చాయి. దీంతో... భారత్ పై పాక్ తన అక్కసు వెళ్లగక్కుకుంది. కట్ చేస్తే.. రిజల్ట్ రివర్స్ అయ్యింది! దీంతో పాక్ పై విమర్శలు మొదలయ్యాయి. అవును... విషయం ఏదైనా, సందర్భం మరేదైనా, వేదిక ఇంకేదైనా.. నిత్యం భారత్ పై పడి ఏడ్వడం పాకిస్థాన్ కి బాగా అలవాటుగా మారిపోయిందనే చెప్పాలి. పైగా ఆఫ్గన్ తో భారత్ సంబంధాలు ఇటీవల మరింత బలంగా మారుతున్న విషయాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్న ఇస్లామాబాద్.. ఢిల్లీపై తన అక్కసు వెల్లగక్కుతుంది. ఈ సమయంలో టర్కీలో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది.

**ఫెయిల్ అయిన చర్చలు!:** సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం, మొదలైన అంశాలపై ఈ రెండు దేశాల మధ్య టర్కీ వేదికగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇవి విఫలమైనట్లు బుధవారం పాకిస్థాన్ ప్రకటించింది! ఈ సందర్భంగా స్పందించిన పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్.. చర్చల్లో ఎలాంటి పరిష్కారమూ కనుగొనలేక పోయామని, అవి విఫలమయ్యాయని తెలిపారు.

**వెంటనే భారత్ పై పడి ఏడుపు!:** అలా ఆఫ్గన్ తో చర్చలు విఫలమవ్వగానే భారత్ పై పడి ఏడ్వడం మొదలుపెట్టింది పాక్. ఇందులో భాగంగా... కాబూల్ లో తీగలను లాగుతూ, తోలుబొమ్మ ప్రదర్శన నిర్వహిస్తున్న వారిని ఢిల్లీ నియంత్రిస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. కాబుల్ తో ఒప్పందానికి దగ్గరవుతున్నప్పుడల్లా, కొందరు జోక్యం కారణంగా చర్చలు విఫలమవుతున్నాయని పరోక్షంగా భారత్ పై విమర్శలు చేశారు.

**తాజాగా సక్సెస్ అయిన శాంతి చర్చలు!:** అయితే.. టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్ లో జరిగిన తీవ్రమైన శాంతి చర్చల తర్వాత పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా అక్టోబర్ 18 – 19 మధ్య జరిగిన సీజ్ ఫైర్ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని టర్కీ ప్రకటించింది. తదుపరి చర్చలు నవంబర్ 6న జరగనున్నాయి. ఇవి ఈ ఒప్పందం అమలును ఖరారు చేయనున్నాయని అంటున్నారు.

**ఇప్పుడు ఏమంటావ్ ఆసిఫ్..?:** పాకిస్థాన్ తో ఆఫ్గనిస్థాన్ శాంతి చర్చలు విఫలమవ్వడానికి భారత్ కారణమని చెబుతోన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ కు ఇప్పుడు భారత్ నుంచి కీలక ప్రశ్న ఎదురవుతోంది. ఇందులో భాగంగా... కాబూల్, ఇస్లామాబాద్ మధ్య చర్చలు ఫెయిల్ అవ్వడానికి ఢిల్లీ కారణమైతే... ఇప్పుడు చర్చలు సక్సెస్ అవ్వడానికి కూడా ఢిల్లీనే కారణం అని చెబుతారా అని ప్రశ్నిస్తున్నారు.

దేవుడు నోరిచ్చాడు కదా అని భారత్ పై నిత్యం అవాకులు చెవాకులు పేలడం మాని.. దేశాన్ని ఆర్థికంగా, పరిపాలనా పరంగా గాడిలో పెట్టడం.. సరిహద్దుల్లో శాంతి వాతావరణాన్ని నెలకొల్పడంపైనే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

**పాక్ కు ఆఫ్గాన్ మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్!:** కాల్పుల విరమణ ఏర్పాటు చేయబడినప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్ అంతర్గత మంత్రి సిరాజుద్దీన్ హక్కానీ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇందులో భాగంగా... 'మా సహనాన్ని మళ్ళీ పరీక్షిస్తే.. మా ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుంది' అని హక్కానీ పేర్కొన్నారు. ఇదే సమయంలో.. తెహ్రిక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ)పై చర్య తీసుకోవాలన్న పాకిస్తాన్ డిమాండ్ పై స్పందించిన ఆయన... ఇది పాకిస్తాన్ అంతర్గత విషయం అని నొక్కి చెప్పారని తెలుస్తోంది.

# వలసదారుల హక్కులను పరిరక్షించాలి - డిసెంబర్ 18...అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వివిధ కారణాల వల్ల వలస వెళ్తుంటారు. ఈ వలసలు వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి గానీ, జీవితాన్ని కాపాడు కోవడానికి గానీ జరుగుతుంటాయి. ఇలాంటి వలసదారుల హక్కులను గుర్తించడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం, వారికి సహాయం చేయడం కోసం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న జరుపుకుంటారు.

**ఈ దినోత్సవం ఉద్దేశ్యం...** డిసెంబర్ 18ను అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా 2000లో ఐక్యరాజ్యసమితి ప్రధాన అసెంబ్లీ ప్రకటించింది. 1990లో ఇదే తేదీన అంతర్జాతీయ వలసదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన కన్వెన్షన్ ఆమోదించబడింది. ఈ నేపథ్యంతో వలసదారుల హక్కులను, వారితో ఉన్న సమస్యలను చర్చించేందుకు ఈ రోజు గుర్తింపును పొందింది.

**వలసదారుల పెరుగుదల వెనుక కారణాలు...** ఆర్థిక అసమానతలు: తక్కువ ఉపాధి అవకాశాలు, దారిద్ర్యం వలన వేలాది మంది మెరుగైన జీవనోపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తుంది. పర్యావరణ విపత్తులు: వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు (ఎడతెరిపి లేని వరదలు, కరువులు, అగ్నిపాతాలు) ప్రజలను వలసలకు బలవంతం చేస్తాయి. యుద్ధాలు, రాజకీయ అస్థిరత: కొంతమంది జీవితం కోసం శరణార్థులుగా వలస వెళ్తే, మరికొందరు భద్రత కోసం కొత్త ప్రాంతాలను ఆశ్రయిస్తారు. శిక్షణా మరియు విద్యావకాశాలు: అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం యువత వలసలు చెయ్యటం సర్వసాధారణం.

**వలసదారుల పాత్ర...** ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు: వలసదారులు వారి కృషితో అతిథి దేశాలకు ఆర్థికంగా విశేష ప్రయోజనం కలిగిస్తారు. రెమిటెన్సుల రూపంలో స్వదేశాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక మద్దతును అందిస్తారు.

సాంస్కృతిక మార్పిడి: వారి సాంస్కృతిక సంపదతో కొత్త ప్రాంతాలను సుసంపన్నం చేస్తారు. సంగీతం, భాష, ఆహారపు అలవాట్లు వంటి అంశాల్లో కొత్త మార్పులను తీసుకు రావడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు.


సామాజిక శక్తుల అనుసంధానం: వలస దారులు వారి మేధస్సు, సాంకేతిక నైపుణ్యాలను అతిథి దేశాలకు అందించడంతో పాటు స్థానిక సమాజ అభివృద్ధికి తోడ్పడతారు.

**వలసదారుల ఎదుర్కొనే సవాళ్లు...** మానవ హక్కుల ఉల్లంఘన: వలస దారులు తరచూ వివక్షకు గురవుతుంటారు. తక్కువ వేతనాలు, నిస్సహాయ పరిస్థితులు, చట్టపరమైన రక్షణల లోపం కారణంగా వారు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు. సాంస్కృతిక, సామాజిక ఒంటరితనం: భాషా, ధార్మిక భిన్నత్వాలు వలసదారులను ఒంటరితనానికి గురిచేస్తాయి. రాజకీయ అసమర్థత: అనేక దేశాలు వలసదారుల హక్కులను పరిగణలోకి తీసుకోవడం లేదా వారి అవసరాలను సరైన విధంగా సమర్థించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక అస్థిరత: కొన్నిసార్లు వలస దారులు స్థిరమైన ఉపాధి లేకుండా ఆర్థిక అనిశ్చితిలో చిక్కుకు పోతున్నారు.

**భారతదేశంలో వలసదారుల స్థితి...** భారతదేశం ప్రాచీన కాలం నుండి వలసదారులను స్వీకరించే సంప్రదాయాన్ని కలిగి ఉంది. అంతర్గత వలసలు: గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలసలు. ఉపాధి కోసం కార్మిక వలస ఎక్కువగా కనిపిస్తుంది. అంతర్జాతీయ వలసలు: ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలస పోయే భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. వీరు భారతీయ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్నారు. శరణార్థుల సమస్యలు: తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అరుణాచల ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శరణార్థులు భారత ప్రభుత్వం ద్వారా మద్దతు పొందుతున్నారు.


**వలసదారుల దినోత్సవం ప్రాముఖ్యత...** అవగాహన పెంపుదల: వలసదారుల కష్టాలను సమాజం గుర్తించడం, వారిపై ఉన్న అపనమ్మకాల్ని తొలగించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. వలస విధానాలు రూపకల్పన: వలస దారుల రక్షణ, హక్కుల కోసం అంతర్జాతీయ స్థాయిలో పటిష్ఠమైన విధానాలను రూపొందించేందుకు ఇది ప్రేరణగా పనిచేస్తుంది. సమాజ అనుసంధానం: వలసదారులు స్థానిక సమాజంలో సమగ్ర పరచబడేందుకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడానికి ఈ రోజు దోహద పడుతుంది. వలసదారులు ప్రపంచ ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. వారి కృషిని గౌరవించడం మన కర్తవ్యం. అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ఈ అంశంపై మరింత అవగాహన కలిగించి, వారి హక్కులకు శ్రద్ధ వహించే దిశగా సమాజాన్ని ప్రోత్సహిస్తుంది. వలసదారులను అర్థం చేసుకుని, వారికి సహకరించడం ప్రపంచ సమాజంగా మన సామూహిక బాధ్యత. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# నాటక రంగంలో నిత్య పరిశోధకులు చాట్ల శ్రీరాములు - డిసెంబర్ 18.. చాట్ల శ్రీరాములు వర్ధంతి



ఆరున్నర దశాబ్దాల పాటు రంగ స్థలమే జీవితంగా బతికిన వ్యక్తి. నాటక రంగంలో కొత్త ప్రక్రియలు ప్రవేశ పెట్టిన నిత్య సాధకుడు, శోధకుడు, బోధకుడు, దర్శకుడు. థియేటర్ నటుడిగా ప్రాచుర్యం పొందాడు. 150 రేడియో నాటికల లోనూ నటించారు. థియేటర్ ఆర్ట్స్ రంగానికి అంకితమైన ప్రసిద్ధ సాహిత్య మరియు సాంస్కృతిక సంస్థ రసరంజని స్థాపనలో కీలక పాత్ర పోషించారు. దేశ, విదేశాలలో అనేక నాటకాలను ప్రదర్శిం చాడు. ఆంధ్రప్రదేశ్ నుండి మానవ వనరుల విభాగం నుండి ఎమెరిటస్ ఫెలోషిప్ అందుకున్న మొదటి కళాకారుడు. ఆయనే చాట్ల శ్రీరాములు. ఆంధ్ర విశ్వ విద్యాలయ రంగస్థల కళల శాఖలో దర్శకుడిగా బాధ్య తలు చేపట్టారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనూ బోధించారు. హైదరాబాదు విశ్వ విద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయాల్లో గౌరవ అధ్యాపకులుగా పనిచేశారు. మధు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో, అక్కినేని నట శిక్షణాలయంలో అతిథి అధ్యా పకులుగా బోధించారు నాగార్జున, వెంకటేశ్ లు ఆయన శిష్య బృందం లోని వారే కావడం విశేషం. చాట్ల శ్రీరాములు (డిసెంబరు 5, 1931 – డిసెంబర్ 18, 2015) తెలుగు నాటక రంగ నిపుణుడు, ప్రయోక్త, సినిమా నటుడు. శ్రీరాములు గడ్డి అచ్చయ్య, అచ్చమ్మ దంపతులకు 1931 డిసెంబరు 5 తేదీన బెజవాడలో జన్మించిన చాట్ల 12 సంవత్సరాల వయసులో విజయవాడలో దేశిరాజు రామారావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'మేవాడు పతనం' అనే హిందీ నాటకంలో ఓ బాలుని పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. బి.కాం. చదువుతున్న రోజుల్లో నటుడు కావాలన్న కాంక్ష, నాటకం పట్ల ఉత్సాహాన్ని పెంచుకొన్నారు. చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు నిర్వహించే అభ్యుదయ నాటక ఉత్సవాల్లో ఎస్.ఆర్.ఆర్. కళాశాల పక్షాన 'మాస్టర్జీ' నాటకాన్ని ప్రదర్శించగా, శ్రీరాములు ఉత్తమ నటుడిగా బంగారు పతకాన్ని కైవసం చేసు కున్నారు. 1956లో భారతీయ రైల్వే శాఖలో టిక్కెట్ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. పబ్లిక్ ఎడ్రసింగ్ సిస్టములో బొంబాయి ఆకాశ వాణి లో శిక్షణ పొందారు. లండన్ లోని బ్రిటీష్ డ్రామా లీగ్ లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యునిగా శిక్షణ పొందారు. చాట్ల 1976లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి వైస్ ఛాన్సలర్ ఎం.ఆర్. అప్పారావు కోరికపై స్టేజీ డైరెక్టర్ ఉద్యోగంలోకి ప్రవేశించారు. నాటక రంగంలో ఎన్నో ప్రయో గాలకు అదే నాంది అయింది. మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు ప్రధానాచార్యుడుగా, వివిధ కళాసంస్థల్లో సభ్యుడుగా వ్యవహరించాడు. ఆయన నాటక రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ నాటకం మరో మొహెంజోదారో . తెలుగు రాష్ట్రాలే కాదు దేశమం తటా సంచలనం సృష్టించిన నాటకం ఇది. రచయిత యన్.ఆర్.నంది. దీనికి చాట్ల దర్శకత్వంతో పాటు శాస్త్రవేత్త పాత్ర పోషించారు. ఇది కమలాదేవి ఛటోపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. గొల్లపూడి మారుతీ రావు వ్రాసిన 'లావాలో ఎర్రగులాబీ' నాటకాన్ని చాట్ల దర్శకత్వం బంగారానికి తావి అబ్బడం లాంటిదని ఎందరో విమర్శకులు ప్రశంసించారు. చాట్ల ఆనాటి ప్రముఖ నటుడు కె. వెంకటేశ్వర రావుతో కలిసి 'కాళరాత్రి' అనే నాటకానికి దర్శకత్వం వహించారు. కొర్రపాటి గంగాధరరావు రచించిన 'విష కుంభాలు', 'డిటెక్టివ్', 'భవ బంధాలు', 'తెలుగు కోసం' మొదలైన నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నుండి రెండు సార్లు ఉత్తమ నటుడి అవార్డు పొందారు. 1954 ప్రాంతంలో రససమాఖ్య ప్రదర్శించిన 'దొంగవీరుడు', 'మాస్టర్జీ' మొదలైన నాటకాలకు పన్నెండు బహుమతులు అందుకున్నారు. గొల్లపూడి 'లావాలో ఎర్రగులాబీ', ఆత్రేయ 'మనసు వయసు', భమిడి పాటి రాధాకృష్ణ 'దైవశాసనం', 'సత్య కామేష్ఠి' నాటకాలు శ్రీరాములుకు బాగా పేరు తెచ్చాయి. న్యాయం కావాలి, స్వప్న, నుడి గుండాలు,సంగీత, విక్రం, అగ్నిపుత్రుడు, శిశర, అగ్నిప్రవేశం తదితర చిత్రాలలో చాట్ల నటించారు. చాట్లలోని దర్శకుడు నిరంతర అన్వేషిగా, ప్రతీ నాటకం నాటికలో వైవిధ్యం ఉండాలని ఆశించారు. ఆయన ప్రతిభ ఇంటనే కాదు రచ్చలోనూ గెలిచింది. ఇంగ్లాండు, అమెరికా, పోలాండ్ తదితర దేశాల్లో పర్యటించి, అక్కడ వాళ్లకు శిక్షణ ఇచ్చారు. అనేక విశ్వ విద్యాలయాలు తమ రంగస్థల శాఖకు అధిపతిగా నియమించాయి. ఉమ్మడి రాష్ట్రం లోని తెలుగు విశ్వ విద్యాలయం, ఆంధ్రా విశ్వ విద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయం వంటి కళాశాలలో సుమారు 26 సంవత్సరాల పాటు నాటకరంగ ప్రొఫెసర్ గా విధులు నిర్వహించారు. ఆధునిక తెలుగు నాటకరంగ చరిత్రలో కృత్తివెంటి నాగేశ్వరరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ, అబ్బూరి రామకృష్ణారావు, డాక్టర్ గరికపాటి రాజారావు, ఎ.ఆర్. కృష్ణ, కె. వెంకటేశ్వర రావు వంటి హేమా హేమీల జాబితాలో చాట్ల శ్రీరాములు పేరు కూడా కలిసిం దంటే ఆయన నటనలో, దర్శకత్వం లో చేసిన అజరామరమైన కృషి, మేదస్సు రంగస్థలానికి నిలువెత్తు దర్పణం. దర్శకత్వంలో ఆయన చాలా ప్రయోగాలు చేశారు. 1970 లో లండన్లోని బ్రిటిష్ డ్రామా లీగ్ చేత ఆయనకు 'నిర్మాత మరియు ఉపాధ్యాయుడు' సర్టిఫికేట్ లభించింది. శ్రీరాములుకు1982 లో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు, రెండుసార్లు ఉత్తమ నటుడిగా ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డు లభించింది. 2003లో తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు ఎన్టీఆర్ పుర స్కారం, నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సత్కారం, రాష్ట్ర నాటక అకాడమీ నుంచి ఉత్తమ దర్శకుడి పురస్కారాలు ఆయనకు లభించిన గౌరవాల్లో కొన్ని మాత్రమే. 2009లో తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. శ్రీరాములు సికింద్రాబాద్ రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015, డిసెంబర్ 18 శుక్రవారం మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి - డిసెంబర్ 18: మైనారిటీ హక్కుల దినోత్సవం




ఐక్యరాజ్య సమితి, ప్రపంచ దేశాలు ఆయా ప్రాంతాల్లోని జాతీయ, సంప్రదాయ, మతాల మరియు భాషాపరమ్కైన మ్కైనారిటీ ప్రజల హక్కులను పరిరక్షించాలని తెలుపుతూ, వారి గుర్తింపునకు అవసరమైన పరిస్థితులను కల్పించి వారిని ప్రోత్సహించ డానికి మైనారిటీ హక్కుల దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. మ్కైనారిటీలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి 18 డిసెంబర్ 1992న జాతీయ, సంప్రదాయ, మతాల మరియు భాషాపరమ్కైన మ్కైనారిటీలకు చెందిన ప్రజల హక్కుల ప్కై డిక్లరేషన్ ను ప్రతిపాదించింది. 1993 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 18వ తేదీని మైనారిటీ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. భారత దేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్ (ఎన్.సి.ఎం) ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. భారత ప్రభుత్వం అల్ప సంఖ్యాక వర్గాల కోసం జాతీయ మైనారిటీ కమిషన్ చట్టం – 1992 ను రూపొందించింది. ఈ చట్టంలోని సెక్షన్ 2(సి) కింద భారత దేశంలో 6 మతాలను మైనారిటీలుగా గుర్తించారు.... ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్లు (పార్సీలు), అలాగే జైనులు (2014 జనవరి 17న కేంద్ర ప్రభుత్వం జైనులను మైనారిటీలుగా గుర్తించింది). భారతీయ రాజ్యాంగం మైనారిటీ అనే పదాన్ని నిర్వచించనప్పటికీ, అది రాజ్యాంగ భద్రతలను మరియు మైనారిటీలకు ప్రాథమిక హక్కులను అందించింది. ఈ హక్కుల ప్రకారం...ఆర్టికల్ 29(1): భారత దేశంలో నివసిస్తున్న పౌరుల్లో ఏ వర్గం వారైనా తమ విశిష్ట భాష, సంస్కృతి, లిపిని కాపాడుకునే హక్కు కలిగి ఉంటారు. ఆర్టికల్ 29(2): రాజ్యం నిర్వహిస్తున్న లేదా రాజ్య ఆర్థిక సహాయం పొందుతున్న విద్యా సంస్థల్లో ప్రవేశాలను మత, జాతి, కుల, భాష ప్రాతిపదికన ఏ పౌరుడికి నిరాకరించ కూడదు. ఆర్టికల్ 30(2): అల్ప సంఖ్యాక వర్గాల నిర్వహణలోని విద్యా సంస్థలకు ఆర్థిక సహాయం మంజూరు చేసే విషయంలో రాజ్యం ఎలాంటి వివక్ష చూపకూడదు. ఆర్టికల్ 347: ఏదైనా ఒక రాష్ట్రంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న జనాభా తాము మాట్లాడే భాషను ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాల్సిందిగా రాష్ట్రపతిని కోరవచ్చు. రాష్ట్రపతి ఈ సమయంలో తగు చర్యలు తీసుకోవచ్చు. ఆర్టికల్ 350: ఏ వ్యక్తి అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించే ఏ భాషలోనైనా తన సమస్యను సంబంధిత అధికారికి విన్నవించుకోవచ్చు. ఆర్టికల్ 350(ఎ): భాషా పరమైన అల్పసంఖ్యాక వర్గాల వారికి ప్రాథమిక స్థాయిలో వారి మాతృభాష లోనే విద్యా బోధన చేసేందుకు సదుపాయాలు కల్పించాలి.

ఆర్టికల్ 350(బి): భాషాపరమైన మైనారిటీల కోసం రాష్ట్రపతి ప్రత్యేకాధికారిని నియమించాలి. 1978లో పార్లమెంట్. ఆమోదం ద్వారా జాతీయ మైనారిటీల కమిషన్ ను ఏర్పాటు చేసింది. 1985 లో దీనిని హోం మంత్రిత్వ శాఖ నుంచి సంక్షేమ శాఖకు బదిలీ చేశారు. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం – 1992 ఆధారంగా 1993లో జాతీయ మైనార్టీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించారు. ఇది 1993 మే 17 నుంచి అమల్లోకి వచ్చింది. 2006 జనవరి 29 న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నుంచి మైనారిటీలను వేరుచేసి వారికి ప్రభుత్వ విధానాలు మరింత చేరువయ్యేలా ప్రత్యేకంగా మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. అలాగే వివిధ రాష్ట్రాలు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖల ను ఏర్పాటు చేసుకొని, మైనార్టీల అభివృద్ధికి ఆయా ప్రభుత్వాలు తోడ్పడు తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలలో అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలు అధిక సంఖ్యాకులుగా ఉండడం మన దేశంలో విశేషం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## ట్రాక్టర్ల కొనుగోళ్లలో చేతివాటం

ఆదిలాబాద్ : వాహనాన్ని ఎవరైనా షో రూం ధరకే కొనుగోలు చేస్తారు.. కంపెనీ ఆఫర్ చేస్తే.. కాస్త తక్కువే చెల్లిస్తారు. కానీ, బల్దియా అధికారులు మాత్రం షోరూం ధర కన్నా అధికంగా చెల్లించి మరీ ట్రాక్టర్లను గుత్తేదారు కొనుగోలు చేశారు. అందుకు అనుగుణంగానే వాహనాల కొనుగోళ్లకు సంబంధించిన టెండరు తయారీ, ఆమోదం, సాంకేతిక అనుమతులతో గుత్తేదారుకు అనుకూలంగా ఎంబీ రికార్డులు నమోదు చేయడం బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బల్దియాలో ట్రాక్టర్ల కొనుగోళ్లలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఈ ఏడాది ప్రారంభంలోనే కొనుగోలు చేయగా అప్పట్లో అనుమానం వచ్చిన పలువురు కౌన్సిలర్లు అవే కంపెనీకి చెందిన ట్రాక్టర్ కొటేషన్లను ప్రైవేటుగా అడిగి తీసుకున్నారు. బల్దియా కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ధరకు, ప్రైవేటుగా తీసుకున్న కొటేషన్లకు ధరలో వ్యత్యాసం రావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశంతో బల్దియా ఈఈ పేరి రాజు విచారణ చేపట్టగా మొత్తం రూ.2.76 లక్షలు తేడా



వచ్చినట్లు నిర్ధారించారు. తాజాగా ట్రాక్టర్లను సరఫరా చేసిన గుత్తేదారును రూ.2.76 లక్షలు తిరిగి బల్దియాకు చెల్లించాల్సిందిగా ఆదేశించారు.

**గుత్తేదారుతో కుమ్మక్కు**

బల్దియాలో పారిశుద్ధ్య పనులకోసం మూడు ట్రాక్టర్లు అవసరమవగా.. గతేడాది డిసెంబరులో అధికారులు టెండరు ప్రకటన జారీ చేశారు. ఓ కంపెనీకి చెందిన డీఐ35 హెచ్‌పీ 39 సామర్థ్యం గల మూడు ట్రాక్టర్లను గుత్తేదారు కొనుగోలు చేసి బల్దియాకు అందజేశారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.8.70 లక్షల చొప్పున మూడు ట్రాక్టర్లకు మొత్తం రూ.26.10లక్షలు వ్యయమైనట్లు బల్దియా అధికారులు ఎంబీ రికార్డులు చేసి గుత్తేదారుకు చెల్లించారు. కంపెనీకి చెందిన ఒక ట్రాక్టర్ వాస్తవ షోరూం ధర అన్ని రకాల పన్నులు, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు కలుపుకుని రూ.7.78 లక్షలు మాత్రమే ఉంది. అంటే ఒక్కో ట్రాక్టరుకు రూ.92 వేలు చొప్పున మూడు ట్రాక్టర్లకు కలిపి మొత్తం రూ.2.76 లక్షలు గుత్తేదారుకు అధికంగా చెల్లించారు. ఈ వ్యవహారమంతా అప్పట్లో పనిచేసిన ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో జరిగింది.

## గొంతు తడపాల్సిన నీరు.. మురుగుపాలు

బెల్లంపల్లి : బెల్లంపల్లిలో ఇంటింటికి శుద్ధజలం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల తీరుతో నీరుగారుతోంది. లీకేజీలతోపాటు ఇంటింటికి ఏర్పాటు చేసిన కుళాయిలకు ఫ్లో కంట్రోల్ వాల్వులు లేక తాగునీరు మురుగు కాలువల్లోకి చేరుతోంది. వారానికి రెండుసార్లు నీరు సరఫరా చేస్తున్నారు. గంటల తరబడి వేల లీటర్లు శుద్ధజలం రహదారులపై పారుతుంది.

**లీకేజీలే అంతటా..**

బెల్లంపల్లి పట్టణంలో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినా.. ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లు బిగించలేదు. సరఫరా సమయంలో చాలామంది రోడ్లపైనే పడేయడంతో పెద్ద మొత్తంలో నీరు నేలపాలవుతోంది. వేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తుతోంది. పట్టణంలోని 34 వార్డుల్లో 15,000 వేల వరకు నివాసాలున్నాయి. తాగునీరు సరఫరాకు 20 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ జనాభా సుమారుగా 42 వేల వరకు ఉంటుంది. పోస్ట్ ఆఫీస్ బస్తీ(29వ వార్డు), కాల్‌టెక్స్(12, 13),



రాంనగర్, హనుమాన్‌బస్తీ(33), శిశుమందిర్‌రోడ్డు, రైల్వేస్టేషన్, కన్నాలబస్తీ, బూడిదగడ్డబస్తీ, షంషీర్‌నగర్, రడగంబాలబస్తీ, శాంతిఖని, టేకులబస్తీ ప్రాంతాల్లో లీకేజీల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో 1,500 కుళాయిలకు ఆన్ ఆఫ్‌లు లేక నీరంతా వృథాగా పోతోంది. బెల్లంపల్లి పట్టణంలో నీరు సరఫరా చేసే రోజు లక్షకుపైగా లీటర్ల శుద్ధజలం మురుగుపాలవుతోంది.

**ఒక్కో ఇంటికి రెండు మూడు కనెక్షన్లు**

కాల్‌టెక్స్ ప్రాంతంలో నివాసాలతోపాటు దుకాణ సముదాయాలకు రెండు, మూడు చొప్పున కనెక్షన్లను ఏర్పాటు చేసుకున్నారు. గోదావరి నుంచి, అడ ప్రాజెక్టునుంచి వచ్చే విధంగా ఇళ్ల యజమానులు అవసరానికి మించి వీటిని ఏర్పాటు చేయించుకున్నారు. వారంలో రెండురోజులు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అనవసరంగా ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కాల్‌టెక్స్ ప్రాంతంలోని పైవంతెన సమీపంలో నీరంతా బయటకు ప్రవహించి మురుగు కూపంగా మారింది. ఏ ఇంటి ముందు చూసినా మురుగు కాలువలో పడేసిన పైపులే కనిపిస్తున్నాయి.

## గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా.. పంచాయతీలు

ఆదిలాబాద్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1952లో మొదటి పంచవర్ష ప్రణాళిక మొదలైంది. అప్పట్లో ప్రణాళికతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా గ్రామీణుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలని సంకల్పించారు. ప్రొ. ఎస్కే డే నేతృత్వంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. దీని అమలుపై శాస్త్రీయ అధ్యయనానికి సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్త డా.బల్వంత్‌రాయ్ మెహతా నేతృత్వంలో బృందాన్ని నియమించారు.

ప్రజా భాగస్వామ్యానికి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం, ప్రణాళిక వికేంద్రీకరణ ద్వారా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వనరుల వినియోగం, శాశ్వతమైన పరిపాలన, అమలు యంత్రాంగం ఏర్పాటు చేయాలని సదరు బృందం నివేదించింది. దీని ఆధారంగా ప్రభుత్వం 1959లో జిల్లా, బ్లాక్, గ్రామ 'పంచాయత్' అనే మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. తొలిసారిగా రాజస్థాన్‌లో అక్టోబరు 2న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో అదే ఏడాది అక్టోబరు 11న అప్పటి ప్రధాని నెహ్రూ ప్రారంభించారు. ఈ వ్యవస్థ దశలవారీగా దేశమంతటా అమలైంది.

# ఇసుక రవాణా.. రక్షణ చర్యలు సున్నా



సుల్తానాబాద్ : మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. వాగులో ఇసుక లోడింగ్ చేసిన తర్వాత ట్రాక్టర్‌పై పరదాలు కప్పాలనే నిబంధన ఉంది. దీని ద్వారా ఇసుక రవాణా చేసే క్రమంలో ట్రాక్టర్ వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడి కళ్లకు ఎలాంటి హాని కలగదని అధికారులు భావించి గతంలో గట్టి నిబంధన విధించారు. కానీ ట్రాక్టర్ల యజమానులు అలాంటి రక్షణ చర్యలేవీ పాటించడం లేదు.

ఇసుక తరలింపులో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇసుకపై పరదాలు కప్పడం లేదు. దీనికితోడు వాగులోంచి నీటితో కూడిన ఇసుకను లోడింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పొడి ఇసుకను తరలించే క్రమంలో పరదాలు కప్పకపోవడంతో ట్రాక్టర్ వెనుక వస్తున్న వాహనదారుల కళ్లలో ఇసుక పడుతోందని పేర్కొంటున్నారు. తడి ఇసుకను తరలించే సమయంలో అందులోంచి నీరు కారుతుండగా ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

**అంతటా ఇదే నిర్లక్ష్యం..**

సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల, గట్టెపల్లి, కదాంబాపూర్, గర్రెపల్లి, గొల్లపల్లి, మంచరామి, తొగర్రాయి మానేరు పరీవాహక ప్రాంతాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుంటారు. ప్రస్తుతం ఉచిత ఇసుక రవాణా పాలసీ అమలవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇసుక రవాణాపై పెద్దగా దృష్టిసారించడం లేదు. దీన్ని అదునుగా భావించిన ట్రాక్టర్ల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరలింపులో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలించే క్రమంలో ట్రాక్టర్ల అధిక వేగంతోనూ భయాందోళనకు గురవుతున్నామని పేర్కొంటున్నారు.

వాగుకు సమీపంలోని గ్రామాల్లో ఒక్కసారిగా ట్రాక్టర్లు రోడ్డుపైకిరాగా ఇసుకలోని నీరంతా గ్రామ రహదారులపై వరదగా పారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధిక ధరలనూ నియంత్రించాల్సిందే..

వినియోగదారులకు ఇసుక అందించాలనే సంకల్పంతో ఏడాదిన్నర కిందట ఉచిత ఇసుక అమల్లోకి తెచ్చారు. మానేరు నుంచి సుల్తానాబాద్‌కు రూ.వెయ్యిలోపే ఇసుక అమ్ముకోవాల్సి ఉండగా రూ.1,500 నుంచి రూ.1,800 వరకు అమ్ముతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు.

# ముక్క లేనిదే.. ముద్ద దిగట్లే!



సిరిసిల్ల : స్థానిక సంస్థల ఎన్నికలు చికెన్, మటన్ విక్రయాలపై ప్రభావం చూపాయి. ధరలతోపాటు మాంసం విక్రయాలు విపరీతంగా పెరిగాయి. ప్రాంతాన్ని బట్టి వ్యాపారులు సైతం ధరలను పెంచేశారు. చిన్న చిన్న గ్రామాల్లో సాయంత్రానికే దుకాణాలు కట్టేస్తుండటం ప్రలోభాలకు అద్దం పడుతోంది.

**ఖర్చుకు తగ్గేదేలే!**

జిల్లాలో ప్రస్తుతం రెండు విడతల్లో ఎన్నికలు పూర్తికాగా మలి దశ మిగిలి ఉంది. గ్రామాల్లో సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎక్కడా ఖర్చుకు వెనకాడటంలేదు. ఎక్కడా పది మంది కనిపించినా విందు ఇస్తానని హామీ ఇస్తున్నారు. కోడి కూరతో భోజనం, ఆల్కహాల్ సర్దుతున్నారు. ఫలితంగా చికెన్‌కు డిమాండ్ పెరగడంతోపాటు ధరలు సైతం అదే స్థాయిలో పెరిగాయి. సుమారు రోజు 50 టన్నులకు పైగా విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**కిలో రూ.320**

ముఖ్యంగా చికెన్ విక్రయదారులు అభ్యర్థుల అవసరాలను పసిగట్టి గతంలో కంటే ఎక్కువగా కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. తీరిక లేకుండా మాంసం విక్రయిస్తూ సాయంత్రం వరకు అన్నింటిని విక్రయించి కొట్టు కట్టేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చికెన్ రూ.320 వరకు ధర పలుకుతోంది. గిరాకీతో అలసిపోతున్నామని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. చికెన్ వండి ఇచ్చేవారికి సైతం ఎన్నికలతో ఆదాయం సమకూరుతుంది.

# అక్రమ బొగ్గు.. నిగ్గు తేల్చాల్సిందే

భైంసా : ఇక్కడి ఇటుక బట్టీలకు మహారాష్ట్రలోని వణి, చంద్రపూర్, బల్లార్ష, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్ ప్రాంతాల నుంచి భారీగా బొగ్గు సరఫరా అవుతోంది. జీరో బిల్లులతో వస్తున్న బొగ్గుతో ప్రభుత్వానికి రూ.కోట్లాది జీఎస్టీ నష్టం వాటిల్లుతోంది. అక్రమ బొగ్గు వ్యాపార వ్యవస్థ రోజు రోజుకూ విస్తరిస్తోంది.

జిల్లాలో 70కిపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటిలో ఏడాదికి 12 కోట్లకుపైనే ఇటుకలు తయారీ చేసి కాలుస్తున్నారు. వీటిని కాల్చేందుకు 15వేల నుంచి 20వేల టన్నుల బొగ్గు అవసరం అవుతుంది. సింగరేణి బొగ్గు టన్ను నాణ్యతను బట్టి రూ.7,000 నుంచి రూ.8,000 కాగా మహారాష్ట్ర నుంచి జీరోలో వచ్చే టన్ను బొగ్గు సగటు ధర రూ.6,500 వరకు లభిస్తున్నట్లు సమాచారం. టన్నుకు రూ.1,500 ఆదా కావడంతో ఇటుక బట్టీల నిర్వాహకులు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ బొగ్గు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లాకు ఇతర ప్రాంతం నుంచి సరఫరా అవుతున్న 20 వేల టన్నుల బొగ్గుకు రూ.150 కోట్లు అవుతోంది. దీనిపై రావాల్సిన కనీసం 1 శాతం జీఎస్టీ రూ.1.5 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఖజానాకు గండి**

బొగ్గుపై ప్రభుత్వానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. జీరో బిల్లులతో రవాణా చేయడంతో ఖజానాకు గండి పడుతోంది. కొన్ని సార్లు జీఎస్టీ బిల్లులతో బొగ్గు సరఫరా చేయగా లారీలు ఖాళీ చేసిన వెంటనే జీఎస్టీ బిల్లును రద్దు చేస్తున్నట్లు సమాచారం. కొందరు జీఎస్టీ బిల్లు లేకుండానే లారీ ట్రాన్స్‌పోర్టు బిల్లు మాత్రమే ఇచ్చి పన్ను ఎగవేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటుక వ్యాపారులు సైతం ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదు. రూ.50 లక్షల వరకు లావాదేవీలు జరిపితే ఒక శాతం, ఆపై మించితే 12 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

# ఐదేళ్లలో 9 లక్షలు.. పౌరసత్వం వదులుకున్న భారతీయులు

14 ఏళ్లలో 20 లక్షలు.. ఇదీ భారత పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య. వీరిలో గత ఐదేళ్లలోనే 9 లక్షల మంది ఉన్నారు. అంటే, 2011 నుంచి 2020 వరకు 9 సంవత్సరాలలో 11 లక్షల మంది భారతీయులు తమకు ఈ దేశ పౌరసత్వం వద్దు అని అంటే... గత ఐదేళ్లలోనే అందులో 80 శాతం మంది పౌరసత్వం త్యజించారు. ఈ గణాంకాలను తాజాగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంటుకు వెల్లడించారు. దేశ పౌరసత్వం విషయంలో పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వం వదులుకుంటున్న వారి రికార్డులను ఏటా భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ఈ లెక్కన 2011-19 మధ్య 11.89 లక్షల మంది పైగా పౌరసత్వం వద్దని చెప్పినట్లు పేర్కొన్నారు.

**విదేశీ పౌరసత్వం ఎంచుకుని..** పద్నాలుగేళ్లలో 20 లక్షలమంది పౌరసత్వం త్యజించారంటే.. వీరంతా విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకున్నట్లే. ఇక 5 ఏళ్లలో 9 లక్షల మంది భారత పౌరసత్వ కాదని విదేశీ పౌరసత్వం ఎంచుకున్నట్లు స్పష్టమవుతోంది. వీరంతా ఏ దేశంలో స్థిరపడింది? అనేది వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా 3.5 కోట్ల మంది భారతీయులు వివిధ దేశాల్లో ఉన్నారు.

**అత్యధికం పశ్చిమాసియాలోనే...** భారతీయులు సహజంగా ఎంచుకునేది అమెరికానే. ఈ లెక్కనే ఆ దేశంలోనే మనవారు అధికంగా ఉంటారని భావిస్తే అది సరికాదు. భారతీయులు ఎక్కువగా పశ్చిమాసియాలో కావడం గమనార్హం. అదికూడా యూఏఈ, సౌదీ అరేబియాల్లోనే అత్యధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో అమెరికా, కెనడాలో స్థిరపడ్డారు. ఆగ్నేయాసియా దేశాలు మలేసియా, సింగపూర్, యూకే దేశాలు భారతీయులకు గమ్యస్థానంగా ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేయాలనే భారత యువత ఆశలను ఆసరాగా చేసుకుని నకిలీ ఆఫర్లతో మోసాలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. చాలావరకు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయినవారేనని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ తెలిపారు.

**ఆర్థికంగా స్థిరపడాలని...** విదేశాల్లో స్థిరపడాలని భావిస్తున్న భారతీయులు తమ పౌరసత్వాలను వదులుకుంటున్న వైనం గత కొన్నేళ్లుగా పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆర్థిక అవకాశాలు, విద్యా సౌకర్యాలు, మెరుగైన జీవనం కోరుకుంటున్నవారు విదేశాలకు వెళ్లిపోయి అక్కడే స్థిరపడుతున్నట్లు స్పష్టం అవుతోంది.

# అక్రమ నిర్మాణాలు.. అడ్డగోలు వ్యాపారాలు

రాంనగర్ : పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలను లీజుకు తీసుకున్న బడాబాబులు..అందులో అక్రమంగా షెడ్‌లను వేసి అద్దెకు ఇచ్చి రూ.లక్షలు సంపాదిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. లీజు నిబంధనలు తుంగలో తొక్కుతూ కాలుష్య నియంత్రణ చర్యలు పాటించకుండా, జీహెచ్‌ఎంసీ ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను, నిర్మాణ అనుమతులు, ఫైర్, ఫుడ్ లైసెన్స్ వంటి అనుమతులు లేకుండానే చాలా వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

**అనుమతులు లేకుండానే...** ఆజామాబాద్ పరిశ్రమల వాడలోని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణాలు, అడ్డగోలు వ్యాపార కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు కాలక్రమేణా మూతపడగా వాటి స్థానంలో అనుమతి లేని పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. పరిశ్రమలకు బదులు, లీజు, సబ్ లీజుల పేరిట కొత్త సంస్థలు వెలుస్తున్నాయి. పరిశ్రమల శాఖ, జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని వ్యాపారాలు, భవనాలు, గోదాములు, షెడ్‌ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు నోటీసులతో సరిపెడుతు ంటే, టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశ్రమల శాఖ వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ కాలయాపన చేస్తున్నారు.

**నోటీసులు ఇస్తున్నాం పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం**

నిజాం కాలంలో 99 ఏళ్లకు లీజు ఇచ్చిన స్థలాలకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. సర్కారుధర ప్రకారం క్రమబద్ధీక రిస్తామనడంతోకొంతమంది ముందుకొచ్చారు. అగ్రిమెంట్ ప్రకారం పరిశ్రమలు నడిపించకుండా లీజుకు, గోదాములకు ఇచ్చిన వారికి నోటీసులిస్తున్నాం. వారంతా ప్రభుత్వధరకంటే రెండింతలు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

## విత్తన పంట.. కన్నీరే రైతు ఇంట!

మెదక్ :విత్తనోత్పత్తి పంటలు సాగుచేసిన రైతులు ఆర్థికంగా నష్టపోయిన ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభం అవుతుండడంతో ఏజెంట్లు మండలాల్లో పర్యటిస్తూ వివిధ కంపెనీల పేర్లు చెప్పి మొక్కజొన్న, వరి విత్తనాలు అంటగట్టి సాగు చేయించేలా రైతులతో అనధికార ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే ఉత్పత్తులు చేతికి వచ్చాక, పలు కంపెనీలు వాటిని తీసుకునే సమయంలో ధర తగ్గించి రైతులను ముంచుతున్నాయి.

**నిబంధనలు ఇలా**

కంపెనీల మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం 2017లో ప్రత్యేక జీవో జారీచేసింది. ఆ ప్రకారం ప్రభుత్వ మద్దతు ధరకన్నా కంపెనీలు తక్కువకు కొనకూడదు. ఉత్పత్తులు తరలించిన మరుసటి రోజే రైతుల ఖాతాలో డబ్బులు జమచేయాలి.

విత్తనోత్పత్తి సాగుచేసే రైతులు వ్యవసాయాధికారుల సమక్షంలో కంపెనీలతో నిబంధనలకు అనుగుణంగా బాండ్‌పేపర్‌పై ఒప్పందం రాసుకోవాలని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ 'ఈనాడు'తో



చెప్పారు. **కొన్ని ఘటనలు**మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లిలో ఏటా 500 ఎకరాల నుంచి 800 ఎకరాల మేర వివిధ కంపెనీలకు చెందిన విత్తనోత్పత్తి వరి సాగు చేస్తున్నారు. గత యాసంగిలో సాగుచేసిన రైతులకు విత్తన కంపెనీలు డబ్బులు చెల్లించకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలయ్యారు.ప్రస్తుత వానాకాలంలో రుక్మాపూర్‌లో పేరొందిన కంపెనీకి చెందిన బ్రీడర్ మగ విత్తనాలను ఆర్గనైజర్ సాగు చేయించారు. దిగుబడులు రాకపోవడంతో, ఎకరాకు రూ.40 వేల పరిహారం చెల్లిస్తానని రైతులతో ఒప్పందం చేసుకున్నా, దిగుబడి తగ్గడంతో ఆర్గనైజర్ చేతులెత్తేశారు.కొల్చారం మండలం చిన్నఘనపూ ర్‌లో 300 ఎకరాల్లో ఓ కంపెనీ విత్తనోత్పత్తి వరి సాగు చేయించింది. ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మించారు. ఎనిమిదికి మించి రాలేదు.జిల్లాలో పదివేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

## గాలి నాణ్యత..మనందరి బాధ్యత!

సిద్దిపేట: వాయు కాలుష్యం.. అనారోగ్యానికి కారణమవుతోంది. రోజురోజుకు పడిపోతున్న గాలి నాణ్యత.. అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్న తీరు మనల్ని హెచ్చరిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం.. ఉమ్మడి మెదక్ జిల్లాలో సూక్ష్మధూళి కణాల తీవ్రత పటాన్‌చెరులో 84, సంగారెడ్డిలో 79 (ఘనపు మీటరు గాలిలో మైక్రోగ్రాములు) నమోదవడం గమనార్హం. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం, పర్యావరణ హితులు, సామాజిక సేవకులు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. నేడు కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితి, మార్పు వైపు అడుగేయాల్సిన తీరుపై కథనం.ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పట్టణాల్లో ఒకప్పటితో పోలిస్తే జనాభా పెరిగింది. వివిధ రకాల ప్రగతి పనులు కొనసాగుతున్నాయి. పరిశ్రమల సంఖ్య పెరుగుతోంది. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇదే క్రమంలో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో 19, సిద్దిపేటలో 7, మెదక్‌లో 4 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. కాలుష్యానికి ఇదో ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

**దుమ్ము లేస్తోంది..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అధ్వాన రహదారులు గాలి కాలుష్యానికి మరో కారణం. ప్రధాన కూడళ్లలో పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. మట్టి, అసంపూర్తి దారులు.. దుమ్ము లేపుతున్నాయి. పట్టణాల్లో వాహనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవమూ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. తీవ్రతను వివరిస్తూ అప్రమత్తం చేసే వ్యవస్థ కరవవుతోంది. ః వ్యర్థాల నిర్వహణ విస్మరించి, ఇష్టానుసారంగా కాల్చేస్తున్నారు. ః పెరుగుతున్న వాహనాలు, కాలం చెల్లినవి అధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వాహన ఉద్గారాల్లో నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్ వంటివి కాలుష్య కారకాలు.

**ర్యావరణాన్ని సంరక్షిస్తేనే..**

పర్యావరణ సమతుల్యం, జీవుల మనుగడలో పచ్చదనం ముఖ్యం. కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ అందిస్తాయి. ఆరోగ్య పరిరక్షణకు, గాలిని శుద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాల్లో ఏటా భారీగా నాటుతున్నా పరిరక్షణ ఆశించిన మేర కొరవడుతోంది. సిద్దిపేటలో జరిమానా విధిస్తున్నా.. తిరిగి నాటించాల్సిన అంశాన్ని విస్మరిస్తున్నారు.

ఒక్క రోజయినా ఇలా చేద్దాం..

వారంలో ఒక్కరోజైనా వాహనాలు ఇంటికే పరిమితం చేద్దాం

సైకిల్, ఇతర ప్రత్యామ్నాయాలు వాడదాం.

పర్యావరణహిత ఈ-వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఎన్నాళ్లీ అండర్‌పాస్ వెతలు..!

తూప్రాన్: దేశంలోనే అతిపెద్దదైన 44వ జాతీయ రహదారిలో నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గం జిల్లాలో 55 కి.మీ. మేర విస్తరించి ఉంది. మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్ద 44వ జాతీయ రహదారి అండర్‌పాస్‌లో ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థల మధ్య ప్రయాణం సాగిస్తుండటం గమనార్హం. ఐదేళ్ల కిందట..రామాయపల్లి మీదుగా మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే మార్గం వెళ్తుంది. రైలు వెళ్లినప్పుడల్లా ఇక్కడ వాహనాలు భారీగా నిలిచిపోతుండటంతో పై వంతెన నిర్మించాలని తలపెట్టారు. ఐదేళ్ల కిందట రూ.100 కోట్లకు పైగా నిధులతో దీని నిర్మాణ పనులను షురూ చేశారు. అంతకుముందే రెండు అండర్‌పాస్‌లు ఉన్నాయి.

ఒక వైపే పూర్తవగా..వంతెన నిర్మాణంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు పనులు పూర్తవడంతో వాహనదారులను ఆ మార్గంలో అనుమతించారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో పూర్తికాలేదు. దీంతో అండర్‌పాస్‌లోనే వెళ్లాల్సిన పరిస్థితి. కి.మీ.కు పైగా ఉండే ఈ అండర్‌పాస్‌లో అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో చోదకులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

# 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16-18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.

వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

# టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గానూ 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ఫారం ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.

కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# భక్తులు మెచ్చాలంటే.. ముందస్తుగా మేల్కోవాల్సిందే!



భద్రాచలం : భద్రాచలం రామాలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు తరలిరావాలని భక్త మహాశయులను అధికారులు ఆహ్వానిస్తున్నారు. రెండు రోజుల క్రితం ప్రచార గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలను కొత్తగూడెంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆవిష్కరించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చినప్పుడు కనువిందు కలిగించేలా ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించాలని సిబ్బందికి ఈఓ దామోదర్‌రావు దిశానిర్దేశం చేశారు. పచ్చదనం ఉట్టిపడే విధంగా కోవెల పరిసరాలను మొక్కలతో తీర్చిదిద్దుతున్నారు. పుష్పాలంకరణ, విద్యుద్దీపాల అలంకరణ, బాణసంచాతో ఆధ్యాత్మికతను చాటనున్నారు.

**మరుగుదొడ్ల సంఖ్య పెంచాలి**

సరిపడా మరుగుదొడ్లు లేకపోవటంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముక్కోటి ఉత్సవాల నేపథ్యంలో తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలి. పడమర మెట్ల మార్గంలోని రెండు మరుగుదొడ్లు, చిత్రకూట మండపం దారిలో మెట్ల వద్ద మరో రెండు మరుగుదొడ్లు సక్రమంగా పనిచేయవు. అన్నదాన సత్రం సమీపంలో స్టేడియం వద్ద ఉన్న మరుగుదొడ్లు ఉత్సవాల సమయంలో సరిపోవు. అసలే చలికాలం. వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యేవారు మూత్ర విసర్జన చేయాలంటే ఇబ్బందే. గోదావరి ఘాట్‌లోనూ తాత్కాలిక సదుపాయాలు కల్పించాలి.

**అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

అలంకార వేడుకలు శనివారం ప్రారంభమవుతాయి. ఈనెల 29న గోదావరిలో తెప్పోత్సవం ఉంటుంది. 30న ఉత్తర ద్వార దర్శన పూజలు చేస్తారు. ఈ రెండు వేడుకలకు రద్దీ అధికంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉన్నందున అదే స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి.

ఉత్తర ద్వార దర్శన టికెట్లు మిగలకుండా చూడాలి. టికెట్లను కొన్న భక్తులు రాకముందే ఆయా సెక్టార్లలోకి ప్రముఖుల పేరిట కొంతమంది వచ్చి కూర్చోవటం వల్ల స్థలం కొరత ఏర్పడుతుంది. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఈ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలి.రామాలయం ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు, మిగతా దేవాలయాల్లోనూ అన్నదానం పెంచే విధంగా చొరవ తీసుకోవాలి. హోటళ్లలో ఆహార పదార్థాల ధరల పట్టికను ప్రదర్శించాలి. నాణ్యతను తనిఖీ చేయాలి. తూనికలు, కొలతల శాఖ అధికారులు రంగంలోకి దిగాలి.

ట్రాఫిక్, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు, ఆర్టీసీ సేవలు, ప్రసాదాల కౌంటర్ల వంటి వాటిపై ప్రచారం కల్పించాలి. అన్నింటికీ మించి గోదావరి వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు అవసరం. గజ ఈతగాళ్లు, పడవలను అందుబాటులో ఉంచాలి.

# ఉత్తుత్తి బెదిరింపు.. ఉలికిపాటు




హైదరాబాద్ :బాంబు బెదిరింపులతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఉలిక్కిపడుతోంది. గతంలో అరుదుగా వచ్చేవి. ఇప్పుడు నిత్యకృత్యమవుతున్నాయి. మానసిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతోనూ దుండగులు బెదిరింపులకు దిగుతున్నారు. గంటల తరబడి తనిఖీలు చేశాక బూటకమని తేలడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విమానయాన సంస్థలు రూ.కోట్లలో నష్ట పోతున్నాయి. ఈ ఏడాది శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 100కుపైగా బెదిరింపులు వచ్చాయి.

**క్షుణ్ణంగా తనిఖీ చేశాకే..**

దేశంలో విమానాశ్రయాలు, విమానాలకు బాంబు బెదిరింపుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) కొన్ని ప్రమాణాలతో బీటీసీపీ(బాంబ్ థ్రెట్ కంటిన్జెన్సీ ప్లాన్)ను సూచించింది.

ప్రతి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్, పోలీసులు, ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రతినిధులతో బాంబు ముప్పు అంచనా కమిటీ ఉంటుంది. ఇది బెదిరింపులను విశ్లేషించి.. తదనుగుణంగా చర్యలు తీసుకుంటుంది.

బెదిరింపులను రెండు భాగాలుగా విభజిస్తారు. దుండగులు విమానం నంబరుతో సహా చెప్పి బెదిరించడాన్ని ఒక కేటగిరీగా.. అస్పష్టంగా ఉంటే ఇంకో కేటగిరీ కింద పరిగణిస్తారు.

**ప్రయాణికులకు నరకం**

కొన్నిసార్లు ఒక ప్రాంతానికి వెళ్లాల్సిన విమానం.. ఇంకో ప్రాంతానికి తీసుకెళ్తుంటారు. ప్రయాణికులు నిర్దేశిత సమయానికి గమ్యస్థానాలకు చేరలేని పరిస్థితి. డిసెంబరు 2న కువైట్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాన్ని ముంబయిలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించారు.

ఈ తనిఖీల సమయంలో ప్రయాణికుల్ని ఎక్కడికి వెళ్లనివ్వరు. చిన్న పిల్లలున్న తల్లిదండ్రులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు.


**వ్యక్తిగత కారణాలతో..**

మానసిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతో పలువురు నకిలీ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడుతోంది.విమానాశ్రయ సిబ్బంది తమతో సరిగా ప్రవర్తించలేదనే కారణంతోనూ ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నారు. ఇతరుల్ని ఇబ్బంది పెట్టేందుకు వారి ఫోన్ నంబర్లు, మెయిల్స్ ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. గాల్లో ఉన్నప్పుడు బెదిరింపు వస్తే.. సమీప ఎయిర్‌పోర్టుకు విమానాన్ని మళ్లించి తనిఖీలు చేస్తారు.

# నీటివృథా అరికట్టి.. గట్టిమేలు తలపెట్టి

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో శుద్ధి చేసిన మురుగుజలాల పునర్వినియోగంపై జలమండలి పటిష్ఠ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఇతర అవసరాలకు వినియోగించుకునేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించడంతోపాటు ఏర్పాట్లు చేస్తోంది. భూగర్భజలాల వినియోగాన్ని తగ్గించడంతోపాటు జలమండలి తాగునీటి కోసం సరఫరా చేస్తున్న నీటిని నిర్మాణాలకు వినియోగించకుండా చేయడం వంటి కీలక అంశాలపై దృష్టి సారించింది. నగరంలో పెరుగుతున్న నీటి అవసరాలు, డిమాండ్, సరఫరా మధ్య అంతరం, మరో రెండేళ్ల వరకు అదనపు జలాలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని శుద్ధి చేస్తున్న మురుగు జలాలను తాగునీటేతర అవసరాలకు ఉపయోగించుకునేలా చేయనుంది.

1500 ఎంఎల్‌డీలకుపైగా శుద్ధి.. నగరంలో ఏర్పడుతున్న మురుగు నీటిని వందశాతం శుద్ధి చేయడమే లక్ష్యంగా మురుగు నీటి శుద్ధి ప్రాజెక్ట్ (ఎస్టీపీ)లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే ఏర్పాటైన ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తున్న మురుగు నీటిని మూసీలోకి వదులుతున్నారు. ప్రస్తుతం నగరంలో గతంలో ఏర్పాటు చేసిన 25 మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా 772 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి అవుతోంది. ఇవికాక మరో 21 ఎస్టీపీల ద్వారా 1134 ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేయడం లక్ష్యంగా ప్రాజెక్టులు చేపట్టారు. వీటిలో ఏడు మినహా అన్ని ఇప్పటికే పూర్తికాగా సగానికిపైగా వినియోగంలోకి వచ్చాయి. ఇవికాక అమృత్ 2.0లో భాగంగా 972 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మరో 39 ఎస్టీపీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



**భారీ నిర్మాణాలకు నేరుగా సరఫరా చేసేలా..**

గ్రేటర్ పరిధిలో భారీ సంఖ్యలో నిర్మాణాలు వస్తున్నాయి. ఈ నిర్మాణాలకు భారీ పరిమాణంలో నీటి వినియోగం జరుగుతోంది. శుద్ధి చేసిన మురుగునీటి వాడకంతో భూగర్భజలాలు వినియోగం తగ్గుతుంది. జలమండలి సరఫరా చేసే తాగునీటిని నిర్మాణాలకు ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా హైరైజ్ భవనాల నిర్మాణానికి భారీ పరిమాణంలో నీటిని వినియోగిస్తున్నారు. ఈ నిర్మాణాలకు అతి సమీపంలోని ఎస్టీపీల నుంచి శుద్ధి చేసిన నీటిని నేరుగా తాత్కాలిక పైపులైన్లతోకానీ, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గార్డెన్‌లు, పార్కులు వంటి వాటికి శుద్ధి చేసిన మురుగు నీటిని వినియోగించేలా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతో చర్చిస్తోంది. త్వరలో ధరలు నిర్ణయించనుంది.

# ఉద్యానంపై కన్ను.. అధికారుల దన్ను

హైదరాబాద్ : నగరంలో ఉద్యానవనాలకు రక్షణ కల్పించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులే వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రధాన రహదారికి, రోడ్డు నం.66కు ఆనుకుని 30 గుంటల్లో ఉండాల్సిన పార్కు విషయంలో అదే జరిగింది. ఎలాంటి సర్వే చేయకుండా.. దశాబ్దాల నాటి ఉద్యానవనం ఆక్రమణకు బల్దియా అధికారులు దన్నుగా నిలిచారు. ఇది పార్కు కాదు.. రోడ్డు అని అధికారులు నిర్ణయించడంతో స్థానికులు రెచ్చిపోయారు. ఉద్యానవనం ప్రహరీని కూల్చి లోపల చెట్లను తొలగించి 10 అడుగుల మట్టితో పూడ్చి రోడ్డును నిర్మించారు. ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్



వెంకటేశ్, స్థానికులు కోరుతున్నారు.

**రూ.50కోట్ల భూమి**

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ ప్రకారం రోడ్డు నం.66 నుంచి పక్కనున్న కాలనీకి రోడ్డు ఉంది. ఆ లేఅవుట్ ఎప్పటిది.. సవరణకు గురైన లేఅవుటా.. కాదా అన్నది జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు విచారించలేదు. సర్కిల్ ఉన్నతాధికారిని వివరణ కోరగా విచారించి చెబుతానని సమాధానమిచ్చారు. అంటే.. గుడ్డిగా పార్కు గోడను కూల్చి.. రోడ్డు నిర్మాణానికి అధికారులు అంగీకరించారని అర్థమవుతోంది. దాదాపు 600 గజాల్లో రోడ్డు నిర్మించారని, దాని విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని జోనల్ కమిషనర్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు.

# పోకిరీలు!

"అతడో ప్రభుత్వ ఉద్యోగి..తననెవరూ గమనింట్లేదనే ధీమాతో ఆడపిల్లతో అనుచితంగా ప్రవర్తించాడు. అదుపులోకి తీసుకున్న పోలీసులతో వాదనకు దిగాడు. తాము రికార్డ్ చేసిన వీడియోను చూపితే తప్పయిందని.. కాళ్లావేళ్లా పడ్డాడు."

"ఆరు పదుల వయసు.. మనుమరాలి వయసున్న బాలికను తాకాడు. మరో మహిళకు దగ్గరగా వెళ్లి వికృతబుద్ధి చూపే ప్రయత్నంలో షీటీమ్స్ చిక్కాడు. కౌన్సెలింగ్ సమయంలో కుటుంబసభ్యుల ఎదుట ముఖం చూపలేక విలవిల్లాడిపోయాడు. మరోసారి ఇటువంటి చేష్టలకు పాల్పడితే జైలు ఖాయమని పోలీసులు హెచ్చరించారు."

ఈనాడు, హైదరాబాద్ : నగరంలో నిత్యం ఆడపిల్లలు వేధింపులు చవిచూస్తున్నారు. గడప దాటినప్పటి నుంచి ఇల్లు చేరేవరకూ కొందరి వికృతచేష్టలకు మనోవేదన అనుభవిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిల వేధింపులపై నెలకు 500కుపైగా ఫిర్యాదులు వస్తుయి. షీటీమ్స్ నిఘాతో రోజూ 10-15 మంది పట్టుబడుతున్నారు. వేధింపులకు గురైన బాధితురాలు దాన్నుంచి బయటపడేందుకు 3-4 నెలల సమయం పడుతుందని మనస్తత్వ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సున్నిత మనస్కులైతే 1-2 ఏళ్ల పాటు కుంగుబాటుకు గురవుతుంటారు. వరుస ఫిర్యాదులతో సీపీ సజ్జనార్ పోకిరీలపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఆడపిల్లల జోలికొస్తే హిస్టరీ షీట్ ఓపెన్ చేయమని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు.

అమ్మాయిలను వేధిస్తే కొలువు మాయం

ఆకతాయిలకు అడ్డుకట్ట వేసే క్రమంలో పోలీసులు కేసులు, కౌన్సెలింగ్‌కే పరిమితంగాకుండా ఆ ప్రబుద్ధులు పనిచేసే కంపెనీలకు సమాచారమిస్తున్నారు. వినాయక ఉత్సవాలు, బోనాలు, ఊరేగింపుల్లో యువతులతో అనుచితంగా ప్రవర్తించిన 1000 మందిని పట్టుకున్నారు. వీరిలో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు, మైనర్లున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నతాధికారులు మెమోలు జారీచేశారు. ప్రైవేటు ఉద్యోగుల్లో 20 మందిని కొలువుల నుంచి తొలగించినట్టు సమాచారం. మెట్రోరైళ్లు, బస్టాప్‌లు, విద్యాసంస్థల సమీపంలో పోకిరీలపై షీటీమ్స్ నిఘా ఉందని.. మహిళా భద్రతా విభాగం డీసీపీ డా.లావణ్య నాయక్ జాదవ్ హెచ్చరించారు. బాధితులు డయల్ 100, 112 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

# ఎనిమిదేళ్లయినా ఎదురుదెబ్బలేనా?

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోరైలు సేవలు ప్రారంభమై ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికీ బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. కనుచూపు మేరలో కష్టాలు గట్టెక్కె పరిస్థితి కన్పించకపోవడంతో సర్కారు కు అప్పగించేందుకు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ సిద్ధమైంది. మెట్రోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించారు. కేటాయించిన భూముల నుంచి 45 శాతం ఆదాయం రాబట్టుకోవాలి. రియల్ ఎస్టేట్, ప్రకటనలు, ప్రయాణికుల ఛార్జీల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.1112.66 కోట్లు వచ్చింది. ఖర్చేమో రూ.1738.57 కోట్లు. ఇందులో రూ.940 కోట్లు అప్పులపై వడ్డీలకు చెల్లిస్తున్నారు. 2024-25లో రూ.625.88 కోట్ల నష్టం వచ్చింది. ఏటే పెరుగుతోంది.

**సమస్యలు అధిగమించలేక...**



రద్దీకి అనుగుణంగా రైళ్లను మెట్రో నడపలేపోతుంది. సర్కారు చేతికి వచ్చాక కొనుగోలుకు ఆర్డర్ ఇస్తే కొత్త కోచ్‌లు వచ్చేందుకు 18 నెలలు పడుతుందని మెట్రో ఎండీ అంటున్నారు.

మెట్రోరైలు స్టేషన్ల నుంచి ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ సమస్యగా ఉంది. కొన్ని స్టేషన్లకు మినహా గుమ్మం నుంచి గమ్యం దాకా సేవలు లేవు. దీంతో వ్యక్తిగత వాహనాల్లో వెళ్లేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. మెట్రో విస్తరణ ముందుకు సాగకపోవడం కూడా ప్రయాణికుల సంఖ్య పెరగకపోవడానికి ఒక కారణంగా కనబడుతోంది.

మెట్రో రైలు స్టేషన్లలో మాల్స్ ఉన్నాయి. వీటిని లీజు ఇవ్వడంలో సదరు సంస్థ పూర్తిగా విఫలమైంది.

మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్, క్యాబ్‌లు అన్నింటికి చెల్లుబాటు అయ్యేలా కామన్ కార్డు ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

# సీటు పదిలమా.. స్థాన చలనమా?

హైదరాబాద్: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమైంది. సీపీ సజ్జనార్ ఏడు జోన్ల స్థాయిలో పోలీస్‌స్టేషన్ల పనితీరు, సిబ్బంది వ్యవహారశైలిపై ఆరా తీస్తున్నారు. ఏళ్లుగా ఒకే జోన్‌లో పాతుకుపోయిన ఎస్సైలు, కానిస్టేబుళ్ల వివరాలు సేకరిస్తున్నారు. సుమారు 150 మంది మినిస్ట్రీరియల్ సిబ్బంది ఎటువంటి పనిలేకుండా ఖాళీగా ఉన్నట్టు నిర్ధారించి ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసినట్టు సమాచారం.

లెక్కలు తేలాక వేటు.. కీలకమైన టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయనున్నట్టు సమాచారం. ఇటీవల డీసీపీల బదిలీల్లో ఐపీఎస్ అధికారిని టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. టాస్క్‌ఫోర్స్‌లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లపై వచ్చిన అవినీతి ఆరోపణలతో వేటుపడే అవకాశం ఉన్నట్టు తెలిసింది. శాంతిభద్రతల విభాగంలో 15 మంది



ఎస్‌హెచ్‌వోల పనితీరు సరిగాలేదని సీపీ మందలించినట్టు సమాచారం. హవాలా, సట్టా ముఠాల నుంచి నెలవారీ వాటాలు వసూలు చేస్తున్న ఇద్దరు ఎస్‌హెచ్‌వోలు, ప్రైవేటు వివాదాల్లో తలదూర్చుతున్న ఇద్దరు ఏసీపీలకు స్థానచలనం తప్పదనే చర్చ సాగుతోంది. ఉత్తర మండలంలోని కీలకమైన డివిజన్‌లో ఏసీపీ పోస్టు ఖాళీ కావటంతో అక్కడ పోస్టింగ్ కోసం ఆరుగురు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. నగర పరిధిలోని ఏడు జోన్లలో పశ్చిమ మండలంలో పోస్టింగ్‌లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

# అటు వైద్యం ఇటు పరిశోధనలు

హైదరాబాద్ : ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్‌కు ప్రభుత్వం జవసత్వాలు కల్పిస్తోంది. పెరుగుతున్న రోగుల తాకిడికి తగ్గట్లు సేవలను విస్తరిస్తోంది. తాజాగా అదనంగా 90 మంది వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టారు. వచ్చేనెలలో వీరంతా విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం నిమ్స్‌లో అధికారికంగా, అనధికారికంగా కలిపి 1200 పడకలపైనే ఉన్నాయి. దాదాపు 30 విభాగాలకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతున్నాయి. ఏటా 20–30 శాతం అదనంగా రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని విభాగాలు కలిపి 250 వరకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు సేవలందిస్తున్నారు. నిత్యం వెయ్యికిపైగా ఓపీ ఉంటోంది. ముఖ్యంగా కార్డియాలజీ, కార్డియో థోరాసిక్, యూరాలజీ, అంకాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్,




న్యూరాలజీ, న్యూరోసర్జన్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు రోగుల తాకిడి ఉండటంతో వైద్యులపై అధిక భారం పడుతోంది. ఇటీవల యూరాలజీ, అంకాలజీ విభాగాల్లో రోబోతో సర్జరీలు చేస్తున్నారు. బయట ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే మూడోవంతు తక్కువకే సేవ లందుతుండటంతో ఎక్కువ మంది నిమ్స్ బాట పడుతున్నారు. కొన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు నిమ్స్‌ను వీడటంతో రోగుల చికిత్సలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరికొన్ని విభాగాల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత వల్ల రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కొత్త వైద్యుల రాకతో రోగులకు ఉపశమనం కలగనుందని చెబుతున్నారు.

**పరిశోధనలకు కేంద్రంగా...**

రోగులకు చికిత్సలే కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా చేసేందుకు అప్పట్లో నిమ్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం పరిశోధనలకు తక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. రోగుల తాకిడి పెరగడం, ఫ్యాకల్టీపై ఒత్తిడి కారణంగా ఆ దిశగా చొరవ లేదు. ఈ క్రమంలో నిమ్స్‌ను ఆధునిక వైద్య సేవలకు పరిశోధన కేంద్రంగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. స్టెమ్ సెల్ పరిశోధన కేంద్రం, రోబో చికిత్సలపై కొత్త వైద్యులకు శిక్షణ, జన్యు వ్యాధులపై పరిశోధన, గుండె ఇతర వ్యాధులపై మరింత లోతుగా సాగేందుకు అవసరమయ్యే హంగులను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్నాయి. కొత్తగా రానున్న భవనాల్లో ఆధునిక సెంట్రల్ ల్యాబ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.

# అక్రమ నిర్మాణాలు.. అడ్డగోలు వ్యాపారాలు

రాంనగర్ : పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలను లీజుకు తీసుకున్న బడాబాబులు..అందులో అక్రమంగా షెడ్లను వేసి అద్దెకు ఇచ్చి రూ.లక్షలు సంపాదిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. లీజు నిబంధనలు తుంగలో తొక్కుతూ కాలుష్య నియంత్రణ చర్యలు పాటించకుండా, జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను, నిర్మాణ అనుమతులు, ఫైర్, ఫుడ్ లైసెన్స్ వంటి అనుమతులు లేకుండానే చాలా వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

**అనుమతులు లేకుండానే...** ఆజామాబాద్ పరిశ్రమల వాడలోని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణాలు, అడ్డగోలు వ్యాపార కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు కాలక్రమేణా మూతపడగా వాటి స్థానంలో అనుమతి లేని పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. పరిశ్రమలకు బదులు, లీజు, సబ్ లీజుల పేరిట కొత్త సంస్థలు వెలుస్తున్నాయి. పరిశ్రమల శాఖ, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని వ్యాపారాలు, భవనాలు, గోదాములు, షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు నోటీసులతో సరిపెడుతు ంటే, టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశ్రమల శాఖ వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ కాలయాపన చేస్తున్నారు.

నోటీసులు ఇస్తున్నాం పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం

నిజాం కాలంలో 99 ఏళ్లకు లీజు ఇచ్చిన స్థలాలకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. సర్కారుధర ప్రకారం క్రమబద్ధీక రిస్తామనడంతోకొంతమంది ముందుకొచ్చారు. అగ్రిమెంట్ ప్రకారం పరిశ్రమలు నడిపించకుండా లీజుకు, గోదాములకు ఇచ్చిన వారికి నోటీసులిస్తున్నాం. వారంతా ప్రభుత్వధరకంటే రెండింతలు కట్టి రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలి.

# ఆమె తల్లడిల్లుతోంది..!



బోధన్ : జిల్లాలోని పురపాలికలు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నాయి. వాణిజ్య కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తుంటారు. వీరి కోసం మున్సిపాలిటీల్లో నిర్మించిన ప్రజా శౌచాలయాలు నిరుపయోగంగా ఉన్నాయి. నీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఎవరూ ఉపయోగించడం లేదు. దీంతో ప్రజలు ఒంటికి.. రెంటికీ ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల ఇబ్బందులు చెప్పలేనివి. ఉదయం వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు ఉగ్గపడుతున్నారు. వివిధ మున్సిపాలిటీల్లోని శౌచాలయాలపై పరిశీలన కథనం.

**కార్మికుల కొరత..**

బోధన్‌కు రోజూ సుమారు 5 వేల మంది వస్తుంటారు. ఇక్కడ 2020లో ఐదు ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. అందులో మూడు నిరుపయోగంగా ఉన్నాయి. నీటి వసతి లేకపోవడం, కార్మికుల కొరత కారణంగా వినియోగంలో లేవు. ఈ విషయమై బల్దియా కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**నీటి వసతి లేకపోవడంతో..**

భీమ్‌గల్ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడింది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికిపైగా వచ్చిపోతుంటారు. ప్రజల సౌకర్యార్థం మూడు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించగా.. ఒకటే వినియోగంలో ఉంది. ఎంపీడీవో కార్యాలయం వద్ద తాళం వేసి ఉంది. ముచ్కూర్ చౌరస్తా వద్ద నీటి సదుపాయం లేక వినియోగంలో లేదు. నీటి వసతి కల్పిస్తే వినియోగంలోకి వస్తాయి. ఈ విషయమై కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. అవసరమైన మరమ్మతులు చేయించి, నీటి వసతి కల్పించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

**నాలుగూ నిరుపయోగంగా..**

వివిధ పనుల నిమిత్తం రోజూ బాన్సువాడకు సుమారు 5వేల మంది వస్తుంటారు. పట్టణంలో 2020లో నాలుగు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించగా.. అవన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. నాలుగు మూత్రశాలల్లో నీటి సౌకర్యం, కుళాయిలు లేకపోవడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయమై కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ.. మూత్రశాలలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. **శుభ్రత కరవు!** ఆర్మూర్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4,500 మందికిపైగా వస్తుంటారు. వీరి కోసం నాలుగు ప్రజా శౌచాలయాలను 2019లో నిర్మించారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసింది నిరుపయోగంగా ఉంది. మిగతావి ఉపయోగంలో ఉన్నా.. అంతగా శుభ్రంగా లేవని పలువురు చెబుతున్నారు. పెర్కిట్, మామిడిపల్లిలో ఏర్పాటు చేయలేదు. 'నూతనంగా ప్రజా మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లు సైతం పూర్తి చేశాం. వారంలో పనులు ప్రారంభం అవుతాయి' అని బల్దియా కమిషనర్ రాజు తెలిపారు.

# చెక్‘ఢాం’లు.. నీరుగారిన లక్ష్యం



ఓదెల: వరద నీరు వృథా కాకుండా ఉండేందుకు ఓదెలలోని మానేరు వాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెరిగేందుకు అవి ఎంతగానో దోహదం చేశాయి. సమృద్ధిగా జలాల లభ్యత ఉండి ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్మించిన కొన్నాళ్లకే అవి పేకమేడల్లా కూలడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారినట్లైంది. దీంతో కూలినవాటి స్థానంలో పునర్నిర్మాణం జరిగితే సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు మేలు చేకూరనుంది.

**రెండేళ్లకే కూలిపోయి..** ఓదెలలోని మడక-కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామాల మధ్యన మానేరులో 2017లో అప్పటి పాలకులు మానేరు సమీప గ్రామాల ప్రజలకు, రైతులకు.. సాగు, తాగునీటి కొరత తీర్చేందుకు రూ. 22 కోట్ల వ్యయంతో దాదాపు 900 మీటర్ల పొడవునా చెక్‌డ్యామ్ నిర్మించారు. 2019లో వచ్చిన వరద నీటి ప్రవాహానికి అది నిట్ట నిలువునా కూలిపోయింది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించకపోవడంతోనే చెక్‌డ్యామ్ కూలిందనే ఆరోపణలున్నాయి.

**నిర్మాణ సమయంలోనూ లీకేజీలు**

ఓదెలలోని రూపునారాయణపేట-కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య 2017లో రూ. 12.8 కోట్లతో మరో చెక్‌డ్యామ్ నిర్మించారు. కాగా నిర్మాణ సమయంలో సిమెంట్ దిమ్మెల కింద నుంచి నీరు లీకేజీలైన సందర్భాలున్నాయి. దీంతో ఐదేళ్లకే వరదనీటి ప్రవాహానికి చెక్‌డ్యామ్ పలుచోట్ల కూలిపోయింది. అప్పటినుంచి తిరిగి పునర్నిర్మాణానికి నోచుకోలేదు.

**ప్రతిపాదనలు తెప్పిస్తాం- విజయరమణారావు, ఎమ్మెల్యే పెద్దపల్లి**

ఓదెలలోని మడక, రూపునారాయణపేట మానేరు వాగుల్లో అప్పటి ప్రభుత్వం నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతోనే రెండు చెక్‌డ్యామ్‌లు కూలిపోయాయి. రైతాంగానికి, మానేరు సమీప గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అధికారులతో చర్చించి పునర్నిర్మాణానికి నూతనంగా ప్రతిపాదనలు తెప్పిస్తాం. తప్పకుండా చెక్‌డ్యామ్‌ల పునర్నిర్మాణానికి కృషి చేస్తాం.

# కొనుగోళ్ల పరిమితి పెంచిండ్రు



బోధన్ : వానాకాలంలో సాగైన మొక్కజొన్న, సోయాబీన్ ఉత్పత్తుల విక్రయాల్లో పరిమితి పెంచుతూ రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ రెండు పంటల ఉత్పత్తుల పరిమితి తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. ప్రైవేటులో ధర తక్కువగా ఉంది. దీంతో పరిమితిని పెంచి కొనుగోళ్లు చేపట్టాలని సాగుదారులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

**ఒకటి, రెండు రోజుల్లో రానున్న అనుమతులు..!**

జిల్లాలో ఈ వానాకాలంలో సోయాబీన్ 33,603 ఎకరాలు, మొక్కజొన్న 52,093 ఎకరాల్లో సాగైంది. ఆర్మూర్ ప్రాంతంలో మొక్కజొన్న, బోధన్ డివిజన్‌లో సోయా అధికంగా ఉంటుంది. సోయా ఎకరానికి 7.62 క్వింటాళ్లు, మొక్కజొన్న 18.30 క్వింటాళ్లు కొనేందుకు నాఫెడ్ తొలుత అనుమతి ఇచ్చింది. దీంతో అధిక దిగుబడులు సాధించిన రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అయితే ప్రభుత్వం తాజాగా సోయాకు 10 క్వింటాళ్లు, మొక్కజొన్నకు 25 క్వింటాళ్ల మేర పరిమితి పెంచింది. ఇదిలా ఉండగా.. ఉత్పత్తుల విక్రయాల్లో పట్టాదారు వేలిముద్రలను నాఫెడ్ తప్పనిసరి చేయడంతో కౌలురైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు పట్టాదారులు దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారు వేలిముద్రలు వేసేందుకు స్వగ్రామాలకు రావడానికి నిరాకరించారు. ఇదే విషయాన్ని బోధన్ మండలంలో సోయా కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ దృష్టికి కౌలు రైతులు తీసుకెళ్లారు. ఈ సమస్యను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ధాన్యం కొనుగోళ్లలానే సోయా, మొక్కజొన్న సేకరణకు ఒకటి, రెండు రోజుల్లో అనుమతులు రానున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ మహేశ్ తెలిపారు. కౌలు పత్రంతో స్థానిక ఏఈవో అనుమతిస్తే ఓటీపీ విధానంలో ఉత్పత్తులు సేకరించనున్నట్లు ఆయన చెప్పారు. మొక్కజొన్న సేకరణ చివరి దశలో ఉండగా.. సోయా ప్రారంభ దశలోనే ఉంది. బోధన్ ప్రాంతంలో కౌలురైతులు ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లు ఆలస్యం అవుతోంది. బయోమెట్రిక్ కాకుండా ఓటీపీ విధానానికి అనుమతిస్తే వారం, పది రోజుల్లో సోయా కొనుగోళ్లు పూర్తవుతాయని కౌలుదారులు చెబుతున్నారు.

# ఇసుక అనుమతుల్లో అక్రమాల జాతర

వేములవాడ : ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు ఇచ్చే ఇసుక అనుమతుల్లో పారదర్శకత లోపించి అక్రమాల జాతర కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక లభించక కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి లబ్ధిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

**ప్రభుత్వ పనుల పేర పక్కదారి..**

ప్రభుత్వ పనులకు మూలవాగు నుంచి రెవెన్యూ అధికారులు ఇసుకకు అనుమతులిస్తున్నారు. వారంలో ఓసారి ప్రైవేటు పనులకు అనుమతిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు ప్రభుత్వ పనుల పేర ఇసుకను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే అనుమతి ఉన్నప్పటికీ సమయం దాటినా యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ విజయప్రకాష్‌రావును వివరణ కోరగా పారదర్శకంగా అనుమతులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.

**జరుగుతోంది ఇది..**

వేములవాడ పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులతో పాటు వందల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పనులకు ఆయా ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ వార్డు అధికారుల అనుమతులు పొంది ట్రిప్పునకు రూ. 480తో డీడీలు తీసి రెవెన్యూ కార్యాలయంలో అందజేస్తున్నారు.



డీడీలకు సీరియల్ ప్రకారం అనుమతులివ్వాల్సిన రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో దాదాపు రెండువందల వరకు ట్రాక్టర్లుండగా మామూళ్లు ఇచ్చిన వారి ట్రాక్టర్లకు ఇసుక అనుమతులు పదేపదే ఇస్తూ.. ఇవ్వనివారి డీడీలు పక్కన పెడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఇసుక అనుమతి కోసం తీసిన 72 డీడీలలో కొన్ని డీడీలు మాయమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవి ఎవరి అకౌంట్లకు వెళ్లాయనేది చర్చనీయాంశంగా మారగా.. దీనంతటిపై పూర్తి స్థాయి విచారణ జరపడమే కాకుండా అనుమతుల్లో ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పలువురు ట్రాక్టర్ల యజమానులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు రెండు ట్రిప్పులే ఇచ్చారు..

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు రెండు ట్రిప్పుల ఇసుకకు మాత్రమే అనుమతిచ్చారు. ఇంకా ఇసుక కావాలని పదో తేదీ నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఇసుకకు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో ఇంటి పని ఆగిపోయింది.

మహ్మద్ మెహరాజ్, స్థానికుడు

# అమ్మో గేటు.. జీవితకాలం లేటు

పెద్దపల్లి : జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు రైల్వే గేటు కష్టాలు తప్పడం లేదు. ఏళ్లుగా అంతర్గాం, పాలకుర్తి, పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజలు గేటు కష్టాలు అనుభవిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గం లేక పోవడంతో ప్రాణాల మీదికొస్తుంది.

**ముందుకుసాగని ఆర్వోబీ**

కన్నాల, అందుగుపల్లి, పెద్దపల్లిలోని కూనారం రోడ్డు, కొలనూరు వద్ద గతంలో ఆర్వోబీలు మంజూరయ్యాయి. వీటిలో కూనారం రోడ్డులో రూ. 199.5 కోట్ల అంచనా వ్యయంతో ఆర్వోబీ పనులను 2022లో చేపట్టారు. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజలకు రెండువైపులా గేటు కష్టాలు తప్పడం లేదు. హుస్సేన్‌మియా వాగుకు అవతలివైపు ఉన్న గ్రామాలకు కొలనూర్ సమీపంలోని గేటు అవరోధంగా మారగా



ఇవతలి వైపు గ్రామాలకు పెద్దపల్లిలోని కూనారం రోడ్డులోని గేటు ప్రధాన సమస్యగా మారింది.

జిల్లాలో పెద్దంపేట నుంచి పొత్కపల్లి వరకు 44 కిలోమీటర్లు విస్తరించిన ఈ రైలు మార్గంలో 16 లెవల్ క్రాసింగ్ గేట్లు, మూడు ఆర్వోబీలు, 4 అండర్‌పాసులున్నాయి. మరో నాలుగు చోట్ల ఆర్వోబీలు మంజూరైనప్పటికీ జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డులో మాత్రమే నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

అంతర్గాం మండల ప్రజలు రామగుండం, గోదావరిఖని వెళ్లేందుకు పెద్దంపేట గేటు దాటాల్సిందే. పెద్దపల్లి వైపు వచ్చేందుకు రవాణా సౌకర్యం లేకపోవడం ప్రధాన అవరోధంగా మారింది.

కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల రద్దీ అధికంగా ఉండగా ప్రతి పది నిమిషాలకు ఒకసారి గేటు పడుతూనే ఉంటుంది. ముఖ్యంగా ఓదెల, పొత్కపల్లి, కన్నాల, కొలనూర్ గేట్ల వద్ద కూనారం రోడ్డు మాదిరిగా భారీ సంఖ్యలో వాహనాలు నిరీక్షిస్తుంటాయి.

## 'జీవీఎంసీ'లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లపువాని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది.

ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గాజువాకతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

## కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, ఆవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంఠారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నిబిల్లి, రొంగలపాలెం, ములకాపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి..ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

## గుట్టలనూ వదలడం లేదు..




పుత్తూరు : భూముల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది.. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు.. సెలవు రోజులైతే చాలా జేసీబీలు పెట్టి చదును చేస్తున్నారు.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది.

పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలోని చిన్నరాజుకుప్పం దళితవాడకు చెందిన వైకాపా నాయకులు, ఓ కూటమి కార్యకర్తతో కలిసి 15 రోజుల క్రితం గ్రామ సమీప పుత్తూరు–చిత్తూరు రోడ్డుకు కూతవేటు దూరంలోని గుట్టను జేసీబీతో చదును చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బందితో వెళ్లి పనులు నిలిపివేయించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మళ్లీ ఆ భూమిని అక్రమార్కులు దర్జాగా చదును చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గతంలో పనులు చేసిన సమయంలోనే వారిపై కేసులు పెట్టి ఉంటే మళ్లీ ఆక్రమణకు పాల్పడేవారు కాదు. చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెర్లోపల్లి రెవెన్యూలో ఇప్పటికే ఐదెకరాల మేర చదును చేశారు. పశువులు మేపుకోవడానికి గుట్ట లేకుండా చదును చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆ భూమిలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు..**

గుట్టభూమిని చదును చేసిన వారిని ఇప్పటికే పిలిచి హెచ్చరించాం. ఆదివారం కావడంతో జేసీబీతో చదును చేశారని తెలిసింది. తనకు తెలియగానే పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటికే జేసీబీతో పాటు వెళ్లిపోయారు. చదును చేసిన భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటా వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

## గుదిబండలా.. 'యూజీడీ'..!



గాజువాక : మహా విశాఖ నగరపాలక సంస్థ జీవీఎస్‌సీసీఎల్ (గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా పెందుర్తి, గాజువాకలో చేపట్టిన యూజీడీ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. గుత్తేదారు సంస్థ చేతులెత్తేయడంతో ఇప్పటి వరకు చేసిన పనులకు జీవీఎంసీ నిధులు చెల్లించేలా చర్యలు చేపట్టింది. మిగతా పనులకు తిరిగి ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తప్పని ఇక్కట్లు: రెండు ప్రాంతాల్లో యూజీడీ పనులకు టెండర్లు పూర్తయి, పనులు పూర్తయ్యే సరికి మరో ఐదేళ్లు పట్టే అవకాశాలున్నాయి. అప్పటి వరకు అసంపూర్తి పనులతో ప్రజలకు ఇక్కట్లు తప్పేలా లేవు

రెండుసార్లు గడువు పెంపు: తొమ్మిదేళ్ల క్రితం నగర పరిధిలోని పెందుర్తి, గాజువాక ప్రాంతాలలో యూజీడీ (భూగర్భ మురుగు వ్యవస్థ) ప్రాజెక్టు చేపట్టడానికి రూ.720 కోట్లతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్మార్ట్ సిటీ నిధులు రూ.100 కోట్లు, మిగతా జీవీఎంసీ సాధారణ నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. సకాలంలో నిధులు సమకూరకపోవడంతోపాటు కొవిడ్ కారణంగా గుత్త సంస్థ ఆయా పనులను సకాలంలో పూర్తి చేయలేకపోయింది. దీంతో ఇప్పటి వరకు రెండుసార్లు గడువు పొడిగించారు.

**జరిగిన పనులు ఇలా..**

పెందుర్తిలో పైపులైన్లు 226 కి.మీ.గాను 210 కి.మీ., మ్యాన్‌హోళ్లు 8048గాను 7328, రహదారి పునరుద్ధరణ 226 కి.మీ. గాను 190 కి.మీ. పూర్తి చేశారు.

గాజువాకలో పైపులైన్లు 429 కి.మీ. గాను 170 కి.మీ., 19,638 మ్యాన్‌హోళ్లకు గాను 5289, రహదారి పునరుద్ధరణ 129 కి.మీ.గాను 88కి.మీ. పూర్తి చేశారు.

ఆ ధరలతో చేయలేం: పెందుర్తిలో రూ.309.94 కోట్లు, గాజువాకలో రూ.411 కోట్లు వ్యయం చేయడానికి ప్రారంభంలో నిర్ణయించగా, పెరిగిన ధరలతో ప్రస్తుతం పనులు చేయలేమని గుత్తేదారు లేఖ సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాగా పెందుర్తిలో పనులు పూర్తి చేయడానికి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గాజవాక ప్రాంతానికి ఇంకా ప్రతిపాదనలు తయారు చేస్తున్నామ'ని ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీరు ఏడుకొండలు తెలిపారు.

## ఉందిగా.. పురమిత్ర

ఎలమంచిలి :నా వయస్సు 80 సంవత్సరాలు.. ఇంటి ముందు కాలువలు శుభ్రం చేయక భరించరాని దుర్గంధం. దోమల మోత, నడవలేని స్థితిలో ఉన్నా! విశ్రాంత ఉద్యోగినైన నేను మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయలేని పరిస్థితి. పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కాలువ సమస్యపై ఫిర్యాదు చేశా. మరుసటి రోజే మున్సిపల్ సిబ్బంది వచ్చి కాలువ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి వెళ్లారు.

వి.లక్ష్మి, ఎలమంచిలి

ప్రజలు ఇంటి నుంచే వారి సమస్యలు పరిష్కరించుకోవడం కోసం ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో గత నెలరోజులుగా ఈ యాప్‌పై ప్రచారం చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకోవడం తెలియని వారికి సచివాయం సిబ్బంది స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. పురప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. ఫోన్ చేసి సిబ్బందిని బతిమలాడుకోవాల్సిన పనిలేదు.

ప్లేస్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఓపెన్ చేస్తే ఫోన్ నంబర్ అడుగుతుంది. ఎంటర్ చేసి సబ్మిట్ చేయగానే ఓటీపీ వస్తుంది.

మన చుట్టూ ఉన్న సమస్యలను ఫొటో తీసి యాప్‌లో పంపించవచ్చు. వాయిస్ రికార్డింగ్ ద్వారా సమస్యను చెప్పుకోవచ్చు. ఫిర్యాదుపై పురోగతిని ట్రాక్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఇందులో 8 విభాగాలకు చెందిన 119 నుంచి 150 వరకూ పౌరసేవలు అందుబాటులో ఉన్నాయి. రెండు మున్సిపాల్టీల్లో కలిపి ఇప్పటివరకూ 14,767 మంది ఈయాప్ వాడుతున్నారు.

**3 నుంచి 30 రోజుల్లో..**

సమస్య తీవ్రతను బట్టి 3 నుంచి 30 రోజుల్లోగా పరిష్కరిస్తారు. సమస్య నేరుగా సంబంధిత శాఖకు చేరుతుంది. ఆ అధికారి స్పందించకపోతే ఉన్నతాధికారికి ఫిర్యాదు వెళ్లి స్పందించని అధికారిని బాధ్యుడిని చేస్తుంది. తెలుగు భాషలోనూ యాప్ అందుబాటులో ఉంది.

అందేసేవలు : ప్రజారోగ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, అకౌంట్స్, జనన మరణ, వివాహ ధ్రువపత్రాలు, తాగునీటి సమస్య, చెత్తసేకరణ, కాలువలు, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి సేవలను అందిస్తుంది.

**కార్యాలయానికి వచ్చే పనిలేదు**

సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే పనిలేదు. యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల జవాబుదారీతనం పెరిగి సిబ్బంది తొందరగా పరిష్కరిస్తారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి మున్సిపాలిటీ

## దస్తూరి.. భవితకు దారి

నర్సీపట్నం : పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంపైనే ఇప్పుడు అందరి దృష్టి. పరీక్షల్లో విద్యార్థుల చేతిరాత కీలక పాత్ర పోషించనుంది. విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉపాధ్యాయులు దస్తూరి మెరుగుపడేలా విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. 'రాత బాగుంటే.. గీత బాగుంటుంది' అన్నది నానుడి. అక్షరాలను ముత్యాల్లా రాస్తే టాపర్లుగా నిలవవచ్చు. పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యార్థులకు ఇప్పటికే వంద రోజుల విద్యా ప్రణాళిక అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా 405 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 18,500 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా చక్కని దస్తూరితో సమాధానాలు రాయడంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతోపాటు సాధన చేయిస్తున్నారు.

ఇలా చేయండి..ఇటుకలు పేర్చినట్లు అక్షరాలు అందంగా ఉండేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నర్సీపట్నం ఎంఈవో తలుపులు సూచిస్తున్నారు. చూడగానే ఆకట్టుకునేలా, ఒక క్రమపద్ధతిలో గుండ్రని అక్షరాలతో సమాధానాలు రాయాలి. గీతలు లేని కాగితంలోనూ వరుస తప్పకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ఒకదానికొకటి అంటుకోకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో ఉండాలి. రెండు పదాల మధ్య '0' పట్టేంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ సాధన చేస్తే చక్కని దస్తూరి సొంతమవుతుంది.

## స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32–సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్–పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్–2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

## గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ–పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ.523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ–పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ–పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్–2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్–1, ఫేజ్–2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్‌అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్‌అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ–పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

## తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

# దారి దోపిడీ

కర్నూలు: కర్నూలు నగర శివారులో గత నెల 16వ తేదీన నిర్వహించిన ప్రధాని సభకు వెచ్చించి నిధుల్లో భారీగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. 450 ఎకరాల్లో సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అవసరం లేకపోయినా రోడ్లు వేశారు. వాటిలో ఎక్కడా నాణ్యత పాటించలేదు. ఆర్అండ్‌బీ అధికారులే రూ.18.17 కోట్లు వెచ్చించారు.

**తరలిపోతున్న వెట్‌మిక్స్**

రహదారుల నిర్మాణానికి వినియోగించిన వెట్‌మిక్స్ తవ్వేస్తున్నారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ పరిమాణం ధర రూ.3వేల వరకు పలుకుతున్నట్లు సమాచారం. నన్నూరు టోల్‌గేటు సమీపంలో ఉన్న కొన్ని వెట్‌మిక్స్ రహదారులను తవ్వేసి కంకర మొత్తాన్ని పక్కనే కుప్పలుగా పోశారు.



**మొక్కలు మాయం...**

ఏపుగా పెరిగిన మొక్కలను తీసుకొచ్చి వందలాది మంది సిబ్బందితో నాటించారు. ఆయా మొక్కల్లో ప్రస్తుతం పదిశాతం మొక్కలు కూడా అక్కడ లేవు.

**కుంగిన మార్గం**

జాతీయ రహదారి నుంచి సభా వేదిక సమీపం వరకు నిర్మించిన నాలుగు వరుసల రహదారి కుంగింది. రహదారుల నిర్మాణంతో 'మార్గం' సుగమం అవుతుందని భావించాం.. నెలరోజులకే చెదిరిపోయాయని" స్థానికులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల చిప్స్ పోసి వదిలేశారు.. కింద వెట్‌మిక్స్ పోయకపోవడం, తారు పోసి రోడ్డు రోలర్‌తో తొక్కించక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. లేఅవుట్‌కు చెందిన కొందరితో కుమ్మక్కై కొన్నిచోట్ల మాత్రం మంచిగా రహదారులు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలను వదిలేశారు.

# సుంకేసులకు గండం

కర్నూలు : రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకమైన సుంకేసుల జలాశయం గేట్ల లీకేజీలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం 300- 400 క్యూసెక్కుల మేర వృథా అవుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం జలాశయాల నిర్వహణకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దెబ్బతిన్న గేట్ల ఇనుపతాళ్లు, రబ్బరు సీళ్లను మార్చలేకపోయారు. గ్రీజు పూసేందుకు కూడా కాసుల కొరత వేధించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా లీకేజీలను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు చేపట్టారు.

**ఆగమేఘాలపై పనులు**

గేట్ల లీకేజీలను అరికట్టకపోతే 3 నెలల్లో సుంకేసుల జలాశయం ఖాళీ అయ్యే ప్రమాదముందని నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఆగమేఘాల మీద మరమ్మతులు ప్రారంభించారు. 9 గేట్ల నుంచి నిత్యం 400 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతున్నట్లు తేల్చారు. ప్రస్తుతం సుంకేసులకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో లీకేజీల ద్వారా నీరుపోతున్నా జలాశయంలో 1.230 టీఎంసీల నిల్వ కొనసాగుతోంది.
కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ఈ



జలాశయం కీలకపాత్ర పోషిస్తోంది. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టారు.
**రూ.65 లక్షలతో..**సుంకేసుల ఆనకట్టకు 30 గేట్లు ఏర్పాటు చేశారు. దాదాపు అన్నింటినుంచి నీరు లీకవుతోంది. 1, 11, 13, 14, 16, 18, 19, 26, 28 గేట్ల నుంచి భారీగా వృథా అవుతోంది. అన్ని గేట్లకు పూర్తిస్థాయిలో రబ్బర్ సీళ్లు అమర్చి ఆధునికీకరించేందుకు రూ.65 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులు వెచ్చిస్తున్నారు. తుంగభద్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేసుకుని, గేట్లకు మరమ్మతులు ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తిచేసి లీకేజీలను అరికడతామని కేసీ కాలువ ఈఈ ప్రతాప్ తెలిపారు.

# పల్లె ప్రగతికి బాటలు

కర్నూలు : గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు రోడ్ల పునర్నిర్మాణానికి నాబార్డు నిధులు విడుదల చేసింది. 2025- 26కుగాను కర్నూలు జిల్లాలో రూ.17.13 కోట్ల వ్యయంతో 13 రహదారులను 43 కి.మీ మేర పునర్నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇప్పటికే పలుచోట్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

**జనవరికి పూర్తి చేయాలని..**

నాబార్డు నిధులతో చేపట్టిన రహదారుల పనుల్లో ఇప్పటికే రెండు పూర్తయ్యాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు ఎస్సీకాలనీలో రూ.40 లక్షల విలువతో కి.మీ మేర ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండల పరిధిలోని వెల్దుర్తి- కోడుమూరు రోడ్డును టి.గోకులపాడు వరకు 3 కి.మీ మేర రూ.150 లక్షల వ్యయంతో నిర్మించారు.మరో 11 రహదారుల పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి నాణ్యత విభాగం తనిఖీలు నిర్వహిస్తోంది.ఎమ్మిగనూరు నుంచి సోగనూరు వరకు రూ.2 కోట్ల వ్యయంతో 4.80 కి.మీ రహదారిని సిద్ధం చేస్తున్నారు.
కోడుమూరు నియోజకవర్గం సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి వరకు రూ.180 లక్షల వ్యయంతో 2.80 కి.మీ రహదారి నిర్మిస్తున్నారు.
ఆదోని పట్టణం నుంచి బసాపురం వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

# ఆటలో అరటి 'పండేనా'!



అనంతపురం : జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల్లో ముఖ్యమైంది అరటి. రైతు కష్టపడి అధిక దిగుబడులు సాధిస్తున్నా.. నాణ్యత లేక ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం 'ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్' (ఎంఐడీహెచ్)లో భాగంగా జిల్లాలోని అరటి ఫల సంరక్షణకు 2025-26 ఆర్థిక ఏడాదికి రూ.3.80 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నాణ్యత పెంచేందుకు జిల్లా ఉద్యానవన శాఖ వెచ్చించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వారి పరిస్థితి, సమస్యలు ఆటలో అరటిపండు చందంగా మారాయి. ఇప్పటివరకు ఒక్క పైసా ఖర్చు చేయలేదనంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది.పంట నాణ్యత లేక వ్యాపారులు కొనడం లేదు. కర్షకులు పంటను తొలగించడం లేదా పశువులు, గొర్రెలకు మేతకు వదిలేసే పరిస్థితి నెలకొంది.

**పట్టించుకోని మార్కెటింగ్ శాఖ**

విపణిలో పంట ఉత్పత్తులు కిలో రూ.8లకు పడిపోతే మార్కెటింగ్ శాఖ జోక్యం చేసుకోవాలి. గతంలో దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. అధికారులు రంగంలో దిగి రైతుల నుంచి గెలలు కొనాలి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి విక్రయించాలి. ఇదేం జరగలేదు. ధరలు పతనమైన తర్వాత కలెక్టర్ ప్రశ్నిస్తే మార్కెటింగ్, ఉద్యానవన శాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం గమనార్హం.

**ఏం జరిగింది**

ఉద్యానవన శాఖ అధికారులు ఫ్రూట్‌కేర్ కార్యక్రమంపై రైతులకు అవగాహనతో సరిపెడుతున్నారు. కనీసం ఒక్క హెక్టారులోనూ ఫల సంరక్షణ చేయలేదు.

**చేయాల్సింది ఇలా..**

ఫల సంరక్షణ కార్యక్రమం కింద 1,500 హెక్టార్లలో అరటి నాణ్యత పెంచాలనేది లక్ష్యం. రూ.3.80 కోట్ల నిధులను మొక్క నాటిన నాటి నుంచి కోత వరకు వెచ్చించాలి. ఒక్కోరైతుకు హెక్టారుకు రూ.25,500 ఇవ్వాలి. మొగ్గ తొడిగిన తర్వాత బడ్ ఇంజక్షన్ వేయాలి. 45 రోజుల తర్వాత వివిధ రకాల మందులు పిచికారీ చేయాలి. గెలలకు కవర్లు కట్టాలి. ఇవన్నీ సకాలంలో పాటిస్తే అరటి దిగుబడి పెరగడంతో పాటు గెలలు నాణ్యతగా కాస్తాయి. వ్యాపారులు కొనేందుకు పోటీ పడతారు. రైతులకు మంచి ధర దక్కుతుంది.

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో..**

సాగు విస్తీర్ణం: 30,000 హెక్టార్లు (అంచనా)
హెక్టారుకు పెట్టుబడి వ్యయం: రూ.2.72 లక్షలు
దిగుబడి అంచనా: హెక్టార్‌కు 160.55 టన్నులు
ఫ్రూట్‌కేర్ అమలు చేస్తున్నాం: ఉమాదేవి, ఉప సంచాలకురాలు, ఉద్యాన శాఖ జిల్లాలో అరటి నాణ్యత పెంచేందుకు ఫ్రూట్‌కేర్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. రూ.3.80 కోట్ల నిధులతో ఈ ఆర్థిక ఏడాదిలో 1500 హెక్టార్లలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొంత అమలు చేశాం. పూర్తిస్థాయిలో నిధులు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

# వందకే వారసత్వ హక్కులు




చిత్తూరు : వారసత్వ వ్యవసాయ భూములకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. భాగ పరిష్కారం ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుముల విషయంలో సమూల మార్పులు తెచ్చింది. రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షల పైన ఉంటే రూ.వెయ్యి చెల్లించాలి. దీంతో గత ప్రభుత్వ బాదుడు నుంచి వేలమందికి విముక్తి ఉపశమనం లభించనుంది.

**గతంలో ఇలా..**

రూ.15 లక్షల విలువచేసే ఆస్తిలో పెద్ద కుమారుడి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు, రెండో కుమారుడికి రూ.3 లక్షలు, మూడో కుమారుడికి రూ.2 లక్షల చొప్పున ఉందనుకుందాం. మిగిలిన ఇద్దరితో పోలిస్తే పెద్ద కుమారుడి ఆస్తి విలువ రూ.5 లక్షలు అధికం. దీనిపై 3 శాతం చొప్పున రూ.15 వేల స్టాంపు రుసుం, రిజిస్ట్రేషన్ రుసుం 0.5 శాతం చొప్పున రూ.2,500 కట్టాలి. మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.5 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.5 వేలు కట్టాలి. రిజిస్ట్రేషన్ రుసుముగా రూ.వెయ్యి చెల్లించాలి. గతంలో రెండింటికీ కలిపి రూ.23,500 వరకూ ఖర్చయ్యేది.

**ప్రభుత్వ చొరవతో..**

భూమి కలిగిన పట్టాదారుల్లో చాలామంది జీవించి లేరు. అయినా ఇప్పటికీ వారి పేర్లే వెబ్‌ల్యాండ్‌లో ఉన్నాయి. వారు కాలం చేసి ఏళ్లు గడచిపోతున్నా.. ఆ భూములు ఇప్పటికీ వారసుల పేర్లతో బదిలీ కాలేదు. దీంతో వారసులకు పాసుపుస్తకాలు, బ్యాంకు రుణాలు అందడం లేదు. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. స్పందించిన ప్రభుత్వం వాటి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేసింది.
**మృతుల పేర్లతో పట్టాలు..**భాగ పరిష్కారం ఆస్తులకు రిజిస్ట్రేషన్ బాదుడుతో చిన్న, సన్నకారు రైతులపై అధిక భారం పడేది. దీంతో చాలామంది రిజిస్ట్రేషన్లకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మ్యూటేషన్ కావడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు రావడం లేదు. వివాదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా రుసుముల తగ్గింపుపై ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు రైతన్నకు ఊరటనివ్వనున్నాయి.

**ఇప్పటికే మరణించి ఉంటేనే..**

తమ ఆస్తులకు వీలునామా రాయకుండా (ఇంటస్టేట్) కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగ పరిష్కారం చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే. జిల్లాకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో మృతుల పేరున ఉన్న రికార్డులు: 22,800

# బరి తెగించారు.. చిన్నా!



చిత్తూరు: రాష్ట్రంలో అధికారం మారినా వైకాపా నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది.. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు డేగల్లా వాలిపోతున్నారు.. దీనికి కొందరు కూటమి నాయకులు సహకారం అందిస్తుండటం గమనార్హం..
పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు ఆనుకుని పుత్తూరు పురపాలిక పరిధిలోని చెర్లోపల్లి రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 126/7, 126/10లో కుంట పొరంబోకు భూమి 82 సెంట్లు ఉంది. పక్కనే చిన్నరాజుకుప్పం ముస్లిం, ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ స్థలం వెనక చిన్నరాజుకుప్పానికి చెందిన ఓ వైకాపా నాయకుడి కుటుంబ భూములు ఉన్నాయి. రూ.కోట్ల విలువజేసే సదరు భూములను తిరుపతి, పుత్తూరు చెందిన ఇద్దరు రియల్టర్లకు ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు.

**అడ్డం తిరిగిన కథ..**

భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంపై సదరు రియల్టర్లు ప్రశ్నించడంతో వైకాపా నేత ముందున్న కుంట పోరంబోకు మీదుగా దారి వేసేందుకు యత్నించగా అక్కడి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో రియల్టర్లు వైకాపా నాయకుడికి ఇవ్వాల్సిన భారీ నగదును నిలిపేశారు.

**సర్దుబాటు చేశారిలా..!**

భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు నియోజకవర్గంలోని 'చిన్న' నేతను ఆశ్రయించగా ఆయన వైకాపా నేతలతో కలిసి ముస్లింకాలనీ వాసుల్లో కొందరిని పిలిచి మాట్లాడారు. వారిని నయానా భయానా ఒప్పించి వెంటనే కొంత మొత్తాన్ని వారికి, సమస్య పరిష్కరించినందుకు సదరు 'చిన్న' నేతకు పెద్ద మొత్తంలో ఆ రియల్టర్లు నగదు ముట్టజెప్పినట్లు సమాచారం. తదనంతరం పనులు చకచకా మొదలై కుంట భూమిలో రోడ్డు నిర్మాణం పూర్తయింది. కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటి పైమాటే. పుత్తూరు-చిత్తూరు ప్రధాన రహదారిలో విలువైన కుంట పోరంబోకు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. 'చిన్న' నేత హుకుం జారీచేయడంతోనే వారు 'మౌనం' దాల్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్తర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్తర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ-కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావల్సినవారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి.
ఈ-కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశారు. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ-కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

# చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు.అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.
జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.
అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేశ్

# అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరంన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.
**ఎటూ ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

చురకలు



## కనిగిరి రాయి.. విభిన్నమోయి!

కనిగిరి : చూసేందుకు గ్రానైట్‌లా కనిపిస్తుంది. కానీ... అంత కాఠిన్యం ఉండదు. అలాగని సాధారణ రాయంత సున్నితమూ కాదు. ఈ రెండింటి మేళవింపులా ఉంటుంది. కనిగిరి దుర్గం చుట్టూ విస్తరించిన కొండ రాయి ప్రత్యేకత ఇది. హద్దురాళ్లు, నిర్మాణ పనులకు అత్యంత అనుకూలం కావడంతో గుంటూరు, నెల్లూరు, కడప జిల్లాలకు సైతం ఇక్కడి నుంచి ఎగుమతవుతోంది. వందలాది మందికి ఉపాధి చూపుతోంది.

**పేల్చరు... కాల్చుతారు**

సాధారణంగా పేలుళ్లు జరిపి కొండ రాయి తవ్వుతుంటారు. ఇక్కడ మాత్రం... తవ్వాలనుకునే రాయిని ముందుగా కట్టెలతో కాల్చి వేడి చేస్తారు. తద్వారా పగుళ్లు వస్తాయి. వాటి ఆధారంగా కావాల్సిన సైజులో రాయిని బయటకు తీస్తారు.

**అయిదు రకాలుగా వినియోగం**



ఇక్కడి రాయిని ప్రధానంగా.. పునాదుల నిర్మాణం (కట్టుబడి రాయి), హద్దుల ఏర్పాటు, రాతి పందిరి, రక్షణ కంచె, గుంజ రాయిగా ఎక్కువగా వినియోగిస్తున్నారు. విభాగాన్ని బట్టి ఒక్కో రాయి రూ. 15 నుంచి రూ. 140 వరకు ధర పలుకుతుంది. కనిగిరి నుంచి రోజూ ఇరవై ట్రాక్టర్లకు పైగా ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి.

**వెయ్యి కుటుంబాలకు ఉపాధి**

కనిగిరి పట్టణం సమీపంలోని దేవాంగ్‌నగర్, టకారిపాలెం, కాశీపురం, కాశిరెడ్డి నగర్, బొగ్గులగొందికాలనీ, పాతూరుబీ మండలంలోని దిరిశవంచ, కమ్మవారిపల్లెలో ఈ రాయి లభ్యత ఎక్కువ. వీటి తవ్వకాల ద్వారా వెయ్యికి పైగా కుటుంబాలకు నిత్యం ఉపాధి లభిస్తోంది. రుసుము, లైసెన్సుల రూపంలో ప్రభుత్వానికీ ఆదాయం సమకూరుతోంది.

## నల్లమలను జల్లెడ పడుతున్నారు!

ఒంగోలు : అల్లూరి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్లు జరగడం... ఏలూరు, విజయవాడ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చిక్కిన నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోలకు కీలక స్థావరంగా ఉన్న నల్లమలలో వారి కదలికలేమైనా ఉన్నాయా అన్న కోణంలో ప్రత్యేక దళంతో గాలింపు చేపడుతున్నారు. గత అనుభవాల నేపథ్యంలో అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

**గతంలో ముఖ్య స్థావరం...**

2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలకు పిలిచినప్పుడు శ్రీశైలం ఘాట్‌లోని చిన్నారుట్ల నుంచే మావోయిస్టులు బయటకు వచ్చారు. పెద్దదోర్నాల స్టేషన్‌లో ఆయుధాలు అప్పగించి... గుత్తికొండ బిలం వద్ద ఏర్పాటు చేసిన చర్చల శిబిరానికి చేరుకున్నారు. నల్లమల కీలక స్థావరం కావడం, పశ్చిమ ప్రకాశంలో కార్యకలాపాలు ఎక్కువగా ఉండడంతో... మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక అధికారి సైతం ఉండేవారు. యర్రగొండపాలెం, త్రిపురాంతకం స్టేషన్ల పేల్చివేత,



పలువురు రాజకీయ నాయకులను హతమార్చడం వంటి ఘటనలూ జిల్లాలో చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలోనూ పలువురు మావోయిస్టులు హతమయ్యారు. పాతికేళ్లకు ముందు వరకు ఎప్పుడు ఏం జరుగుతుందో అన్నట్లు పరిస్థితి ఉండేది.

**కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా...**

ఆపరేషన్ కగార్, వివిధ రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్లు తీవ్రం కావడం... ఇక్కడా గాలింపు చర్యలు ముమ్మరం కావడంతో ఈ ప్రాంతంలో మావోల కార్యకలాపాలు తగ్గాయి. తాజాగా హిడ్మాతో పాటు కీలక నేతలు హతమైన నేపథ్యంలో స్థావరాలు మార్చుతున్నారన్న అంచనాతో... నల్లమలలోకి వెళ్లే కీలక మార్గాల్లో బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. డ్రోన్ల సాయంతో అటవీ ప్రాంతంలో శోధిస్తున్నారు. కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీసి వారి వివరాలు సేకరిస్తున్నారు. అటవీ పరిసర గ్రామాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. 'ప్రస్తుతం జిల్లాలో మావోయిస్టుల సంచారం లేదు. నల్లమలలోనూ సంచరిస్తున్న ఆనవాళ్లు లేవు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తనిఖీలు చేపడుతున్నార'ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు.

## సరకు తరిగి.. ధర పెరిగి

పత్తికొండ : పత్తికొండ మార్కెట్‌లో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. విపణిలో శనివారం క్వింటా గరిష్ఠ ధర రూ. 5 వేలు దాటింది. కనిష్ఠ ధర రూ. 3 వేలు, మధ్యస్థ ధర రూ. 4 వేలు పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 162.65 క్వింటాళ్ల సరకును రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. వారం కిందట టమాటా క్వింటా రూ. 3 వేలు పలకగా.. గత ఐదారు రోజులుగా



ధరలో మార్పు వస్తూనే ఉంది. వర్షాల నేపథ్యంలో చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో తెగుళ్లు సోకడంతో నష్టం వాటిల్లింది. విపణికి టమాటా సరకు రావడం తగ్గిపోయింది. ఫలితంగా ధర పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనేకాక వివిధ ప్రాంతాల్లో టమాటాలకు మంచి గిరాకీ ఉండటంతో డిమాండ్ పెరిగింది. ఫలితంగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నోలీస్ తెలిపారు.

# అన్నదాత ఇంట.. సిరులు పండాలని



చిత్తూరు : వ్యవసాయం లాభసాటి కావాలి.. రైతన్న ఇంట సిరులు పండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఈ నెల 29 వరకు 'రైతన్నా–మీకోసం' వారోత్సవాల్లో భాగంగా ఇంటింటా సందర్శన, ఈ నెల 30 నుంచి డిసెంబరు 3వరకు సేకరించిన వివరాలు విశ్లేషణ చేస్తారు.. ఇందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.. వారం పాటు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఇంటింటికీ వెళ్లి రైతులను కలిసి మాట్లాడతారు..

సాగు పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్ నీటి భద్రత, డిమాండ్, ప్రభుత్వ మద్దతు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఆర్ఎస్‌కే సహాయకులు, పశుసంవర్ధక, మత్స్య సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో చేస్తారు.క్లస్టర్‌గా.. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి. .ఒక్కొక్క బృందం రోజుకు 30 క్లస్టర్లు(90గృహాలు) సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధి అంశాలపై అధికారులు వివరించి..సాగులో ప్రయోజనాలు, చేకూరే పంచసూత్రాలను తెలియజేస్తారు. సాగు ప్రోత్సాహకాలు చేరుతున్నాయా..? వ్యవసాయానికి ఎలాంటి రాయితీలు అమలు చేయాలి.., యాంత్రీకరణ పరికరాలు కావాలా.., తదితర అంశాలతో పాటు సాగులో ఎదురయ్యే సమస్యలు, రెవెన్యూ పరమైన సమస్యలను తెలియజేయవచ్చు. రైతులు చెప్పిన అంశాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి.

**3న రైతులతో సమావేశాలు..**

ఆర్ఎస్‌కేల వద్ద డిసెంబరు 3న స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి ప్రస్తుత రబీ, రానున్న ఖరీఫ్, రబీ సీజన్లకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో సాగు వివరాలిలా..(హెక్టార్లలో)

ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు: 71 వేలు

రబీ సాధారణ సాగు: 29 వేలు

ఉద్యాన పంటల సాగు: 72 వేలు

రైతుల సంఖ్య: 3.45 లక్షల మంది

# 35 వేల బోగస్‌కార్డులు



చిత్తూరు : ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేతనదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో బోగస్ కార్డులు బయట పడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొందరు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండటంతో మరిన్ని బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

**92 శాతం పూర్తి..**

ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు జాబ్ కార్డులున్న 92 శాతం మందికి ఈకేవైసీ పూర్తయింది. వాటిని పరిశీలించిన అధికారులు 35 వేలు బోగస్ కార్డులను గుర్తించి రద్దు చేశారు. రద్దయిన వారిలో ఎవరైనా అర్హులు ఉంటే మరోసారి అప్పీలు చేసుకోవచ్చని సూచించారు.

**ఎన్నో అవకతవకలు..**

గత ప్రభుత్వ పాలనలో చాలా వరకు అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు పనులకు రాకుండానే ఇళ్ల వద్ద ఉంటూ వేతనాలు పొందినట్లు గుర్తించారు. రోజూ వచ్చే కూలి సొమ్ములో కొంత స్థానిక నాయకుల ఖాతాల్లోకి చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. మస్టర్లలో తప్పులు, వేతనాల చెల్లింపులో అక్రమాలు, జాబ్‌కార్డులో ఉన్న చిరునామాలో వేతనదారు ఉండక పోవడం, ఉద్యాన పంటల కోసం ఉపాధి కార్డులు తీసుకోవడం మొదలైన అవకతవకలు జరిగాయి. ఈ లెక్కన రూ.కోట్లలో సొమ్ము పక్కదారి పట్టినట్లు అధికారులు భావిస్తున్నారు.

**జిల్లాలో వివరాలు..**

ఉపాధి వేతనదారులు: 4,06,682 మంది

ఈకేవైసీ జరిగింది: 3,74,148

చేయించుకోవాల్సింది: 32,534

తిరుపతిలో.. 46 వేల బోగస్‌కార్డులు

**ఉపాధి హామీలో అంతులేని అక్రమాలు**

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేతనదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో బోగస్ కార్డులు బయట పడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొందరు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండటంతో మరిన్ని బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

**90 శాతం పూర్తి..**

ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు జాబ్ కార్డులున్న 90 శాతం మందికి ఈకేవైసీ పూర్తయింది. వాటిని పరిశీలించిన అధికారులు 46 వేల బోగస్ కార్డులను గుర్తించి రద్దు చేశారు. రద్దయిన వారిలో ఎవరైనా అర్హులు ఉంటే మరోసారి అప్పీలు చేసుకోవచ్చని సూచించారు.

**ఎన్నో అవకతవకలు..**

గత ప్రభుత్వ పాలనలో చాలా వరకు అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు పనులకు రాకుండానే ఇళ్ల వద్ద ఉంటూ వేతనాలు పొందినట్లు గుర్తించారు. రోజూ వచ్చే కూలి సొమ్ములో కొంత స్థానిక నాయకుల ఖాతాల్లోకి చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. మస్టర్లలో తప్పులు, వేతనాల చెల్లింపులో అక్రమాలు, జాబ్‌కార్డులో ఉన్న చిరునామాలో వేతనదారు ఉండక పోవడం, ఉద్యాన పంటల కోసం ఉపాధి కార్డులు తీసుకోవడం మొదలైన అవకతవకలు జరిగాయి. ఈ లెక్కన రూ.కోట్లలో సొమ్ము పక్కదారి పట్టినట్లు అధికారులు భావిస్తున్నారు.

**జిల్లాలో వివరాలు..**

ఉపాధి వేతనదారులు: 3,16,373 మంది

ఈకేవైసీ జరిగింది: 2,85,833

చేయించుకోవాల్సింది: 30,540

# మేనకూరు.. ఉద్యోగాల మణిహారం



నాయుడుపేట : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీలు, సులభతర వాణిజ్యం, సింగిల్ డెస్క్ పాలసీ విధానంతో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

**అయిదు నెలల కాలంలో..**నాయుడుపేట పట్టణంలోని పారిశ్రామిక వాడల్లో అయిదు నెలల కాలంలోనే రూ10,393.93 కోట్ల పెట్టుబడులతో 9 భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కలిగింది. మేనకూరు పారిశ్రామిక వాడలోనే 2026 నాటికి 7 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఏర్పడింది.

**భూముల కేటాయింపు పూర్తి..**

ప్రీమియర్ ఎనర్జీకి చెందిన సౌరఫలకాలు, సోలార్ మాడ్యూల్స్ సెల్ తయారీ, బిర్లా కార్బన్, ఫిల్పిస్ కార్బన్‌తో పాటు తాజాగా పీసీబీల ఎలక్ట్రానిక్స్, వాల్బ్రా ల్యాబ్స్, గ్రీన్ ల్యామ్ సౌత్ లిమిటెడ్ కంపెనీలు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాయి. ఇప్పటికే ప్రీమియర్ ఎనర్జీ, కార్బన్ పరిశ్రమల భవన నిర్మాణాలు కొలిక్కి వచ్చాయి. మిగిలిన వాటికి భూముల కేటాయింపు పూర్తయింది.

## నీళ్లున్నా.. కన్నీళ్లే

కర్నూలు : కర్నూలు పశ్చిమ ప్రాంతానికి కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటైన ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) కుడి ప్రధాన కాలువ పనులు ఎప్పుడు మొదలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగించేందుకు జులైలోనే ఉత్తర్వులిచ్చినా నేటివరకు నిధులు విడుదల కాలేదు. 40 వేల ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాలకు తాగునీరు అందించేలా దీనిని రూపొందించారు. 2019లో తెదేపా ప్రభుత్వం ఆయా పనులకు సంబంధించి రూ. 1985 .42 కోట్లతో పరిపాలనపరమైన ఆమోదం తెలిపింది. టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు ఆపేయడంతో కీలక ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది.

**భూసేకరణ ఎప్పుడో..**

ఆర్డీఎస్ ప్రాజెక్టుకు 5,884.70 ఎకరాలు అవసరమని తేల్చారు. అందులో 1,172.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన 4,712.70 ఎకరాలు పట్టా భూములే. ఆయా భూముల్లో ప్రస్తుతానికి 1,475.70 ఎకరాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసినా పరిహారం చెల్లించాల్సి ఉంది. సుమారు రూ. 150 కోట్లు విడుదల చేస్తే ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమవుతుంది.

**బకాయిలు చెల్లించక..**



గుత్తేదారు సంస్థ ఎన్‌సీసీ ఇప్పటివరకు రూ. 12 కోట్ల విలువైన పనులు పూర్తి చేసింది. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు కదలలేదు. ప్రస్తుత ప్రభుత్వం పాత బకాయిలు ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుత బడ్జెట్లో రూ. 15 కోట్లు కేటాయించింది. ఆ మేరకు అధికారులు రూ. 5 కోట్ల విలువైన బిల్లులు చెల్లించాలని సిఫార్సు చేశారు. ప్రాజెక్టు పనుల్లో ఇప్పటివరకు 0.74 శాతం మాత్రమే పూర్తయ్యాయి. హెచ్.ఎన్.ఎస్.ఎస్. తరహాలో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తే తక్కువ వ్యవధిలోనే 40 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

**ఏటా నాలుగు టీఎంసీలు వృథా..**

ఆర్డీఎస్ ప్రాజెక్టుకు నాలుగు టీఎంసీల నీటి కేటాయింపు ఉంది. కానీ చుక్క నీటిని కూడా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో భాగంగా 160 కి.మీ.ల మేర కుడి కాలువ తవ్వాలి. దీనికింద 12,500 ఎకరాలు సాగులోకి వస్తుంది. కోసిగి, పెద్దకడబూరు, కొటేకల్లు, చిన్నమర్రివీడుల్లో నాలుగు జలాశయాలను నిర్మించాల్సి ఉంటుంది. ఫలితంగా కోసిగి పరిధిలో 5 వేలు, పెద్దకడబూరు పరిధిలో 5 వేలు, కోటేకల్లు పరిధిలో 15 వేలు, చిన్నమర్రివీడు జలాశయం పరిధిలో 2,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

## అవినీతి గుట్టు.. కంప్యూటరీకరణతో రట్టు

కర్నూలు : అన్నదాతల ఆర్థికాభివృద్ధికి బాటలేయాల్సిన ప్రాథమిక సహకార సంఘాలు గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు వేదికగా మారాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు రైతుల ముసుగులో సొసైటీల సొమ్ము దోచుకున్నారు. అధికారులు సహకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంప్యూటరీకరణను వేగవంతం చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తైంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీనాటికి ఆడిట్ సైతం పూర్తి చేశారు. ఈ క్రమంలో పలు అక్రమాలు వెలుగుచూశాయి.

**24 వేల మంది ఏమయ్యారు?**

1.14 లక్షల మంది రైతుల వివరాలతో ఈకేవైసీ చేపట్టారు. 90 వేల మంది ఈకేవైసీ పూర్తి చేశారు. 24 వేల మంది సభ్యుల ఆచూకీ కానరావడం లేదు. వారు ఎక్కడున్నారు? రుణాలు తీసుకుని డీఫాల్టర్ అయ్యారా అన్న కోణంలో డీసీసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

**నిధుల స్వాహా**

కొత్తపల్లి మండలం నాగంపల్లి సొసైటీ సీఈవో కోటేశ్వరరావు రైతుల నుంచి రికవరీ చేసిన రూ. 40 లక్షలు స్వాహా చేశారు. డీసీసీబీ



అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. రూ. 10 లక్షలు రికవరీ చేశారు. చిప్పగిరి మండలం రామదుర్గం సొసైటీ సీఈవో ఏకంగా రూ. 95 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసు నమోదుకు సహకార శాఖ అధికారులు సిఫార్సు చేశారు. ఆయన నుంచి రూ. 25 లక్షలు రికవరీ చేశారు.

**యంత్రసేవ పేరుతో ముంచారు**

2021–22 నుంచి వైఎస్సార్ యంత్ర సేవ కేంద్రాలు (సీహెచ్‌సీ) పథకం కింద 1,100 రైతు సమూహాలకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు ఇచ్చేందుకు సహకార బ్యాంకు ద్వారా రూ. 44 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇందులో గత నాలుగేళ్లలో సగం సంఘాలు మాత్రమే రూ. 24 కోట్ల రుణ చెల్లింపులు చేశాయి. సగానికి పైగా సీహెచ్‌సీలకు సంబంధించి రైతు బృందాలు రుణ చెల్లింపులు చేయలేదు. మరోవైపు 500 రైతు సమూహాలు (సీహెచ్‌సీలు) డీఫాల్ట్ అయ్యాయి. దీంతో రూ. 6 కోట్ల నుంచి రూ. 7 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. మొత్తం సీహెచ్‌సీల నుంచి రూ. 20 కోట్ల రుణాలు.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు సమూహాలను ఏర్పాటు చేయించిన వ్యవసాయ శాఖ ప్రస్తుతం రుణ బకాయిలపై నోరు మెదపడటం లేదు. దీంతో సహకార బ్యాంకుకు అప్పులు గుదిబండలా మారాయి.

చరకలు



# రబీ.. లేదిక వరి

శ్రీకాళహస్తి : రైతు సేవకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) దూరం అవుతోంది. తాజాగా రబీ సీజన్ దృష్ట్యా విత్తన లక్ష్యం 15 వేలు క్వింటాళ్లు చేయాలని తలచినా ఇప్పటి వరకు ఒక్క గింజా అందుబాటులో ఉంచక పోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**తెస్తారు.. ఇస్తారంటూ**

నిరీక్షిస్తూ రోజులు లెక్కబెట్టుకుంటూ వచ్చిన రైతుల ఆశలను నిలువునా ముంచేసింది. ఏటా రైతులను ఆదుకుంటూ వస్తున్న ఏపీసీడ్స్ విత్తన లక్ష్యంగా ఈ రబీ సీజన్‌కు ఒక్క గింజా ఇవ్వక పోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సీజన్ ముగియడంతో రైతులందరూ ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. ఇదే కొనసాగితే రైతు సేవలో ఏళ్ల చరిత్ర కలిగిన ఏపీసీడ్స్‌ను శాశ్వతంగా మూతవేసుకోవాల్సిందే మరి. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు, పాలకులు దీనిపై మరింత శ్రద్ధ చూపాల్సి ఉంది.

**ఎందుకిలా..:** ఏటా 50 వేల క్వింటాళ్లు విత్తనోత్పత్తి కింద లక్ష్యం నిర్దేశం చేస్తూ వస్తున్న ఏపీసీడ్స్ ఈ దఫా లక్ష్యం దిశగా అడుగులు వేయలేక పోయింది. దాదాపు మూడు దశాబ్దాలుగా వరి రకాలకు సంబంధించి ఫౌండేషన్ విత్తనాలను వాటాదారులైన రైతులకు బైబ్యాక్ పద్ధతిన ఇవ్వడం, వాళ్లు పంటలు పండించాక ఆ ధాన్యాన్ని తిరిగి




కొనుగోలు చేస్తూ వస్తోంది. కరోనా తరువాత మిగులు ధాన్యంతో అప్పుల ఊబిలోకి చేరుతోంది. ప్రధానంగా ప్రైవేటు వ్యాపారుల బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశించడం, తక్కువ ధరలకు రైతులకు అవసరమైన అన్ని రకాలను అందుబాటులో ఉంచుతూ వస్తోంది. తాజాగా గత ఏడాది రబీలో మిగిలిపోయిన 1010 ధాన్యం రకాన్ని రూ.2 కోట్లు నష్టంతో ప్రస్తుతం మిల్లర్లకు అమ్ముకుంటోంది. అలాగే ఖరీఫ్‌లో సిద్ధం చేసిన కేఎన్ఎం 1638 రకం అదే తరహాలో మిగిలిపోవడం గమనార్హం.

**పచ్చిరొట్ట విత్తనాల సాగుకు శ్రీకారం** వరి విత్తనాలు ఏటా మిగిలి పోతున్నాయి. వాటిని నష్టాలకు అమ్ముకోవా ల్సిన పరిస్థితి తప్పడం లేదు. రెండేళ్లలో దాదాపు రూ.3 కోట్ల వరకు నష్టాలు తప్పలేదు. ఆ కారణంగానే విత్తనోత్పత్తి కింద వరి వంగడాలు పంపిణీ చేయలేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పచ్చిరొట్ట విత్తనాల సాగుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించాం. వీటి సాగుకు మరింత సమయముంది. వాటాదారులైన రైతులను ఒప్పించి వీటి సాగుకు శ్రీకారం చుట్టేలా అవగాహన తెస్తున్నాం.జగదీష్, జిల్లా మేనేజరు, ఏపీసీడ్స్

# రాళ్లు పాతి.. రూ.కోట్లు దోచి

కర్నూలు : వక్ఫ్ భూములకు రక్షణకు కరవైంది.. అక్రమార్కులు ఈ స్థలాల్లో ప్లాట్లు వేసి బేరం పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 32 వేల ఎకరాల మేర వక్ఫ్ భూములున్నట్లు అంచనా. కర్నూలు జిల్లా పరిధిలో 4,588 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గతేడాది డిసెంబరులో కలెక్టర్‌కు నివేదించారు. అందులో కల్లూరులో 1,666 ఎకరాలు, ఓర్వకల్లు 1,152, కర్నూలు పరిధిలో 580 ఎకరాలు ఉంది. స్థలాలకు రక్షణ కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం వక్ఫ్ స్థలాలంటూ బోర్డులు కూడా పెట్టలేదు. కలెక్టర్ అధ్యక్షతన వక్ఫ్ కమిటీ ప్రతి మూడు నెలలకుగానీ.. లేదా ఆరు నెలలకోసారి సమావేశమవ్వాలి. ఏడాదికి ఒకసారి కూడా సమీక్షించడం లేదు.

**సబ్ డివిజన్‌గా మార్చేసి..**

కల్లూరులో సర్వే నంబరు 258/బిలోని 5.45 ఎకరాల భూమి కర్నూలు పెద్దమార్కెట్ సమీపంలోని బుడ్డాబుడ్డీ మసీదుకు చెందింది. ఆరు దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వ హయాంలో గెజిట్ చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని చింతలముని నగర్ వద్ద కల్లూరు వక్కెర వాగు సమీపంలో ఉన్న ఈ భూములపై ఓ నేత కన్నుపడింది. ఇంకేముంది ఆ సర్వే నంబరును 258/బి1ఏగా సబ్ డివిజన్‌గా మార్చేశారు. మూడెకరాల విస్తీర్ణంతో పాటు వక్కెర వాగు స్థలాన్ని ఆక్రమించేసి



లేఅవుట్ వేసి అమ్మేశారు. వక్ఫ్ భూమిని రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ చేయలేదు. కానీ గత వైకాపా ప్రభుత్వ హయాంలో సదరు వ్యాపారి మార్చేశారు.వక్ఫ్ భూమికి సమీపంలో వక్కెర వాగు ఉండటంతో ఆయనకు కొంత భూమి కలిసొచ్చింది.

**తక్కువ ధరకు వస్తోందని..**

హైదరాబాదు–బెంగళూరు జాతీయ రహదారికి అతి సమీపంలో, కల్లూరు చెన్నమ్మ కూడలికి కూతవేటు దూరంలో ఈ వెంచర్ ఉండటంతో మొదట మూడెకరాల వక్ఫ్ భూమిలో సుమారు 98 ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. సెంటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు అమ్మారు. అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేయించేశారు.

సదరు సర్వే నంబరులో మొదట 3 ఎకరాల్లో వెంచర్ వేశారు. రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌వోసీ తీసుకున్న తర్వాత మిగిలిన 2.45 ఎకరాలు కలిపి.. మొత్తం 5.54 ఎకరాల వక్ఫ్ భూమిని ఆక్రమించి అమ్మేసుకున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో చాలామంది స్థలాలను కొనుగోలు చేశారు.

# మిరపకు విల్ట్



ఉరవకొండ : మిరప పంట సాగు ఆశాజనకంగా ఉన్నా గత వారం నుంచి విల్ట్ తెగులు వ్యాప్తితో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అనంత జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ, జీబీస్మీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోర్లు కింద ఈ ఏడాది 30వేల ఎకరాల్లో మిరప సాగయింది. అందులో 5531, తేజ, 2043, 273, డబ్బీ అనే మిరప రకాలు ఉన్నాయి. అత్యధికంగా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెళుగుప్ప, బొమ్మనహాళ్, కణేకల్లు..మండలాల్లో అత్యధికంగా సాగులో ఉంది. పంట పూత, కాయ పడే కాలం. మందుల పిచికారీ, ఎరువులు, ఇతరత్రా యాజమాన్య చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు ఎకరాకు రూ.1.20 లక్షల ప్రకారం రైతులు పెట్టుబడి పెట్టారు.

**మందులు పిచికారీ చేస్తున్నా..**

పంటలో వేర్లు కుళ్లిపోవడం ద్వారా విల్ట్ తెగులు ఆశించడం ప్రారంభం అయ్యింది. ఉరవకొండ ప్రాంతంతో వ్యాప్తి అధికంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తెగులు సోకిన తరువాత మొక్కలు క్రమంగా ఎక్కడికక్కడ ఎండి పోతున్నాయి. రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మొక్కలను తొలగించడం తప్ప ప్రత్యామ్నాయం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా ఎర్రనేలల్లో సాగయిన మిరపకు ఎక్కువగా ఆశిస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. పంట సాగు సమయంలో రైతులకు కనీస జాగ్రత్తలను ఉద్యాన అధికారులు తెలియచేసిన సందర్భాలు లేవు. ఇప్పటికైనా ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**పొలాలను పరిశీలిస్తాం..: యామిని, ఉద్యాన అధికారి, ఉరవకొండ**

రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగులు నివారించవచ్చు. 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక లీటరు నీటికి కలిపి మొక్కల మొదల్లో పిచికారీ చేయాలి. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. నీటి తడులను తగ్గించుకుంటే మంచిది. కొమ్మ ఎండు, కాయ కుళ్లుకు ఒక ఎంఎల్ ప్రొపికోనజోల్, 0.5 ఎంఎల్ డైఫెన్కోనజోల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి తగిన చర్యలు చేపడుతాం.

# కరిగించేసి.. దోచేసి!




కదిరి : అక్రమార్కుల ధనదాహానికి పచ్చనిచెట్లతో కూడిన కొండలు కరిగిపోతున్నాయి.ఎర్రమట్టి కోసం యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. కుటాగుళ్ల నుంచి కదిరి మండలం పందులకుంటకు వెళ్లే మార్గంలోని కొండలను మట్టివ్యాపారులు భారీ యంత్రాలతో కరిగించేస్తూ ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో తరలించి జేబులు నింపుకొంటున్నారు. గతంలో పనికి ఆహార పథకం కింద వేప, సీతాఫలం విత్తనాలను కొండలపై చల్లడంతో వృక్షాలుగా ఎదిగాయి. పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న కొండలో అక్రమార్కుల ఆగడాలకు నేలకొరిగాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కొండను తవ్వేస్తున్న విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని గ్రామీణులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కడప రాతికొండను 150 అడుగులలోతు తవ్వేస్తున్నారు. దీంతో కుటాగుళ్ల, బోయరామన్నపల్లి, కదిరికుంట్లపల్లి, హనుమంతరావుపల్లి, జౌకల, చలమకుంట్లపల్లి గ్రామాల్లో పశువులకు గ్రాసం లేకుండా పోతోందని కాపరులు వాపోతున్నారు.

సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప రాతికొండను లక్ష్యంగా చేసుకున్న అక్రమార్కులు మట్టిని తవ్వి.. రాత్రివేళల్లో తరలిస్తున్నారు. బిల్డర్లతో ఒప్పందం చేసుకుని రవాణా సాగిస్తున్నారు. టిప్పర్ మట్టికి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.1000లకు విక్రయిస్తున్నారు. తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరికొండను తవ్వేసి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారంగా అడవులు రూపుకోల్పోయేలా చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతాం.

# తీగల మార్పు.. తొలగనున్న ముప్పు

హిందూపురం : హిందూపురంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మీదనే 33కేవీ విద్యుత్తు తీగలు వెళ్లడంతో అదనపు నిర్మాణాల మాట దేవుడెరుగు.. పైకెక్కి దుస్తులు ఆరేసుకోవాలన్నా ప్రమాదమే. ఆయా ప్రాంతాల్లో గత 20 ఏళ్లలో విద్యుత్తు తీగలు తగలి 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడి.. ఆసుపత్రి పాలయ్యారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూశారు.

**ఎక్కడెక్కడంటే..**గురునాథ్ సర్కిల్ నుంచి రహమత్‌పురం వరకు బైపాస్ రోడ్డులో పలుచోట్ల అడుగులు మాత్రమే ఉండటం, అక్కడే స్తంభాలు వేయడంతో రద్దీ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

రహమత్‌పురంలోని బైపాస్ రోడ్‌లో ఇళ్ల పక్కన భారీ స్తంభాలు వేసి, ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే రోడ్ అభివృద్ధికి దాదాపు రూ.10 కోట్లు వెచ్చించి రహదారిని విస్తరిస్తున్నారు. విస్తరణకు స్తంభాలు అడ్డుగా నిలిచాయి. దీంతో నిర్మాణ పనులను ప్రారంభించలేని పరిస్థితి తలెత్తింది.

**రూ.8.5కోట్లు కేటాయింపు**

రైల్వే రోడ్‌లో విద్యుత్తు స్తంభాలు, లైన్ల తొలగింపునకు రూ.2.8 కోట్లు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి రహమత్‌పురం వరకు రూ.2.45 కోట్లు, హస్నాబాద్‌లో ఇళ్ల మీద ఉన్న లైన్ల తొలగింపునకు రూ.1.65 కోట్లు, ఇతర పనులకు రూ.1.6 కోట్లు కేటాయించారు.

త్వరలో టెండర్లు..: మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

పట్టణాభివృద్ధికి తాజాగా మంజూరు చేసిన ప్రత్యేక నిధులకు సంబంధించి, సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్‌ను సిద్ధం చేసి టెండర్లు పిలుస్తాం. తరువాత పనులు చేయిస్తాం.


# పుంగనూరు.. పశుజాతి మాణిక్యం

పుంగనూరు : కేంద్రం తపాలా కవరుపై పుంగనూరు జాతి పశువుల ఫొటోలు ముద్రించి 2022 ఫిబ్రవరిలో విడుదల చేసింది. తిరుమల క్షేత్రంలోని తితిదే గోశాలలో పుంగనూరు ఆవులు పెంచుతూ వాటి పాలు స్వామివారి అభిషేకానికి వాడుతున్నారు.

చిట్టి.. పొట్టి కాళ్లు.. అందమైన ఆకృతి.. ఆకర్షించే అమాయకత్వం.. చూపరులను కట్టిపడేసే సొగసు పుంగనూరు గోవుల సొంతం. కరవు పరిస్థితులను సైతం తట్టుకొని మనుగడ సాగించడం వీటి ప్రత్యేకత. ఒకప్పుడు ఇంటింటికీ ఒకటి చొప్పున కనిపించే ఆవులు క్రమేపీ అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. కొందరు రైతులు మాత్రం వీటి సంరక్షణలో తమ పాత్ర పోషిస్తున్నారు.

**రూ.100 కోట్లతో పరిశోధన..:** పుంగనూరు జాతి పశు ఉత్పత్తికి ప్రభుత్వం మిషన్ పుంగనూరు చేపట్టింది. ఆరోగ్యవంతమైన జాతి ఎద్దుల నుంచి వీర్యం సేకరించి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తారు. ఎండిలో ట్రాన్స్‌ఫర్, ఇన్‌బిట్రో ఇన్‌వైలో కృత్రిమ విధానాలతో మనుగడ కాపాడేలా చూస్తున్నారు. రూ.100 కోట్లతో పలమనేరు, పులివెందులలో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**లీటరు పాలు రూ.100 పైనే..**దేశీయ ఆవు జీవిత కాలంలో 7 నుంచి 8



దూడలకు జన్మనిస్తుంది. కానీ పుంగనూరు ఆవులు 13 వరకు పిల్లలకు జన్మనిస్తాయి. ఈ ఆవు 70 నుంచి 90 సెం.మీ ఎత్తు, 115 నుంచి 200 కిలోల బరువు కలిగి ఉంటుంది. రోజుకు 2 నుంచి 3 లీటర్ల పాలు మాత్రమే ఇస్తాయి. సాధారణ ఆవు పాలల్లో 3 నుంచి 4 శాతం వెన్న ఉంటే, వీటలో 8 శాతం ఉంటుంది. అందుకే ఈ పాల ధర లీటరు రూ.100పైనే. జిల్లా వ్యాప్తంగా వీటి సంఖ్య వెయ్యి లోపు ఉంటుంది.

# ‘నాసి’వనం

కర్నూలు : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన నగర వనంలో నేతలు నిధులు మేశారు. డోన్ వాసులకు ఉపయుక్తంగా ఉండేలా గత వైకాపా హయాంలో ఏకంగా 165 ఎకరాల్లో నగర వనాన్ని పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. సుమారు రూ.2.15 కోట్లతో అభివృద్ధి చేసినా ఆ నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరైన చందంగా మారింది. ఆదాయం లేక దాన్ని నిర్వహించడం కూడా అటవీశాఖకు భారంగా మారింది. ఉన్నతాధికారులు దృష్టికి రావడంతో ఎక్కడెక్కడ అవినీతి జరిగిందన్న అంశాలపై విచారణ చేయించారు.

**నిర్మాణాల కూల్చివేత**

నగరవనం ప్రాజెక్టుకు ఆనుకొని 340బి జాతీయ రహదారి నిర్మాణ ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ అధికారులను ఏమాత్రం సంప్రదించకుండా రూ.లక్షలు వెచ్చించి.. భారీ ఆర్చిని, భవనాన్ని, పెద్దఎత్తున పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు ఆ భూమిని సేకరించడంతో రెండేళ్ల



వ్యవధిలోనే ఆర్చిని, భవనాన్ని కూల్చివేయాల్సిన దుస్థితి తలెత్తింది.

**పనులన్నీ అధ్వానమే**

నగరవనంలో పలు పనులు అత్యంత నాసిరకంగా చేశారు. అందులో నిర్మించిన పర్యావరణ శిక్షణ కేంద్రం(ఎకో ట్రైనింగ్ సెంటర్) సీలింగ్ రెండేళ్లు కాకుండానే దెబ్బతిని కొన్ని చోట్ల ఊడిపోయింది.

కొన్ని ఫ్యాన్ల రెక్కలు వంకరపోయాయి. విద్యుత్తు వైరింగులు దెబ్బతిని బయటకు వేలాడుతున్నాయి.

రాళ్ల ముక్కలతో నిర్మించిన గోడలకు సిమెంటు సరిగా పూయలేదు. కొన్ని భవనాల గోడలు చమ్మ వచ్చి సున్నం పెచ్చులూడిపోతోంది. రెండేళ్లలోనే గోడలు దెబ్బతిన్నాయి.

**ఎందుకోసం నిర్మించారో**పరిసరాలన్నీ నిర్జనంగా ఉండడం, దానికి ఆనుకొని దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో ప్రజలకు అక్కడికి వెళ్లడానికే హడలిపోతున్నారు. ఏకో టూరిజం ప్రాజెక్టు లక్ష్యం నెరవేరడం లేదు. జనసంచారం తక్కువ గా ఉండడం, ప్రత్యేకించి మహిళల భద్రతకు ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో వెళ్లడానికి భయపడుతున్నారు. నగరవనం ప్రాజెక్టులో విద్యార్థులకు, ఉద్యోగులకు, పర్యావరణంపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 2024 ఫిబ్రవరిలో దాన్ని ప్రారంభించిన తరువాత ఇప్పటివ రకు అందులో అటవీశాఖ అధికారులే అరకొరగా కార్యక్రమాలు నిర్వహించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గండాలు

ఆదోని : హాలహర్వి మండలం చింతకుంట–3 అంగన్‌వాడీ కేంద్రంలో 20 మంది చిన్నారులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలు మొత్తం మరో 20 మంది కేంద్రానికి వస్తున్నారు. ఇక్కడ నీటి అవసరాల నిమిత్తం రెండు ట్యాంకులు ఏర్పాటు చేశారు. ట్యాంకు నుంచి వెళుతున్న వృథా నీరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలుస్తోంది. అక్కడి నుంచి వెళ్లేందుకు సరైన మురుగు కాల్వ లేక పారిశుద్ధ్యం లోపించింది. దుర్వాసనతో పాటు దోమలు, ఈగుల, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు రాకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదోని మండలం నాగలాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా గత వారం 11 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా అధికారులు పర్యటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. కేంద్రం చుట్టూ శుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**చిన్నారులకు పోషకహారం అందించి..** ఆరోగ్యంగా, బలంగా తయారు చేయాల్సిన అంగ్‌వాడీ కేంద్రాలు గండాలను తెచ్చిపెడుతున్నాయి. పది రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాల్లో చిన్నారులు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటకు వినియోగించే సరకులు, కూరగాయలు నాణ్యతగా లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణం, పరిసరాలు, గదుల నిర్వహణ సరిగా లేకపోవడంతో చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు.

నంద్యాల జిల్లా పాములపాడు మండలం మట్టకందాల గ్రామంలోని మూడో అంగనవాడీ కేంద్రంలో చిన్నారులు పాలు, గుడ్డు, భోజనం చేసి సాయంత్రానికి ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత 8 మంది చిన్నారులు వాంతులు చేసుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ లీలావతి గ్రామంలో



పర్యటించి పాలు, గుడ్డు, అన్నం బాగానే ఉందని.. చుక్క కూర పప్పులో లోపాలేమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తున్నామని.. నీరు, ఆహార నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు.

**జిల్లా అధికారులు దృష్టి సారిస్తేనే..**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా వరకు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కేంద్రంతో పాటు చుట్టుపక్కల పారిశుద్ధ్యం లోపించడంతో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు కొందరు నాణ్యతలేని ఆకుకూరలు, కూరగాయలతో వండి చిన్నారులకు భోజనం వడ్డిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై జిల్లా అధికారులు స్పందించి ఆయా కేంద్రాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టి చిన్నారులకు శుభ్రమైన.. వాతావరణం.. నాణ్యమైన భోజనం అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా


మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: 3,558

ప్రతి నెలా వెచ్చిస్తున్న నిధులు: రూ.16.35 కోట్లు

నిర్వహణలో లోపాలు: శుభ్రత పాటించకపోవడం, వంట వండే చోట సరిగా లేకపోవడం, నాసిరకం సరకులు వాడటం.

# రకుల్ రెడ్ హాట్ శారీ లుక్ వైరల్

తనకంటే వయసులో చాలా సీనియర్ అయిన అజయ్ దేవగన్ సరసన నటిస్తోంది రకుల్ ప్రీత్ సింగ్. దేదే ప్యార్ దే సీక్వెల్ (దే దే ప్యార్ దే 2) ఇటీవల నిరంతరం చర్చల్లోకి వస్తోంది. ఈ చిత్రంలోని మొదటి పాట జూమ్ పరాబి తాజాగా విడుదలైంది. ఇందులో అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్, యో యో హనీ సింగ్ నటించారు. ఇది రొటీన్ సాంగ్.. కానీ దీనిలో హుక్ స్టెప్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ట్రాక్ లో కవ్వాలి వైబ్స్ ఆకర్షించాయి. ఇక పాటలో నర్తించిన స్టార్లు పాదాలతో వైన్ గ్లాస్ ని ఒలికిపోకుండా కదిలించే సీన్ ఆకట్టుకుంది. విడుదలకు ముందే అభిమానులు ఇలాంటి




వాటిని ఆసక్తిగా చూస్తున్నారు. అయితే ఈ పాటలో రకల్, దేవగన్ ల హుక్ స్టెప్ లను మించి రకుల్ గ్లామర్ ఎలివేషన్ కేంద్రక ఆకర్షణగా మారింది. ఎరుపు రంగు కోక రవికెలో రకుల్ ఎంతో అందంగా కవ్విస్తోంది. నాభి అందాలను, మెడ సొగసును ఆవిష్కరిస్తూ రకుల్ క్లాసీ స్టెప్పులతో అదరగొట్టేసింది. ప్రస్తుతం రకుల్ యూనిక్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో సునామీలా దూసుకుపోతోంది. రకుల్ స్వతహాగా ఫిట్‌నెస్ ఫ్రీక్ గనుక, టోన్డ్ అందాలు గుబులు పుట్టిస్తున్నాయి. జూమ్ షరాబి పాటను టి-సిరీస్ - లవ్ ఫిల్మ్స్ సంయుక్తంగా విడుదల చేశాయి. కొందరు మధ్య వయస్కులు నైట్ క్లబ్ లో చేరాక అక్కడ ఎలాంటి రచ్చ చేసారన్నదే ఈ పాట థీమ్. అశ్విందర్ సింగ్- అజీజ్ నజాన్ రూపొందించిన ఝూమ్ బరాబర్ ఝూమ్ షరాబి అనే కవ్వాలి పాటలో హనీ సింగ్ ప్రదర్శన మరో ఆకర్షణ. దే దే ప్యార్ దే 2 నవంబర్ 14న థియేటర్లలో విడుదల కానుంది.

## శ్రీలీలలో మార్పు.. ఇష్టం లేకపోయినా సరే అలా..!

స్టార్ హీరోయిన్ శ్రీలీల నెక్స్ట్ మాస్ జాతరతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ధమాకా తర్వాత రవితేజ తో కలిసి శ్రీలీల చేసిన సినిమా ఇది. అందుకే ఈ సినిమా మీద చాలా హైప్ ఉంది. ఐతే మాస్ జాతరలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అంటుంది అమ్మడు. మాస్ పాత్రలు చేయాలని ఉంటుంది కానీ తనకు అలాంటి రోల్స్ రావట్లేదని చెబుతుంది శ్రీలీల. ఇక ఈమధ్య తన లుక్ లో మార్పుల వెనక సీక్రెట్ బయట పెట్టింది శ్రీలీల.

**లుక్ మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు..** వరుస స్టార్ సినిమాలతో బిజీ అయిన శ్రీలీల సరైన డైట్ పాటించక కాస్త బొద్దుగా మారింది. అంతేకాదు ఆమెకు అమ్మమ్మ వాళ్లు చేసే అరిసెలు అంటే చాలా ఇష్టమట. ఒంగోలు నుంచి అరిసెలు వస్తే మొత్తం ప్యాకెట్ తినేదాకా లేచేది కాదట శ్రీలీల. ఐతే ఇప్పుడు అలా తినడం మానేసి తన లుక్



మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు చెప్పుకొచ్చింది శ్రీలీల. అందుకే ఈమధ్య అమ్మడు పూర్తిగా స్లిమ్ లుక్ అయ్యింది. ఫుడ్ విషయంలో కండీషన్స్ అప్లై చేసుకుంటున్నా.. ఒక డాక్టర్ గా ఎలాంటి ఫుడ్ తీసుకుంటే బెటర్ అని తెలుసు కాబట్టి అలాంటి ఫుడ్ తోనే మెయింటైన్ చేస్తున్నా అంటుంది శ్రీలీల. తనను చూడటానికి థియేటర్ కి వచ్చే ఆడియన్స్ కి బాగా కనిపించాలి కదా అంటూ తనలో ఈ మార్పు వెనక రీజన్ చెప్పింది శ్రీలీల. రవితేజ మాస్ జాతరలో శ్రీలీల నిజంగానే ప్రేక్షకులను ఇంప్రెస్ చేసేలా ఉంది. తెలుగులోనే కాదు బాలీవుడ్ లో శ్రీలీల తెరంగేట్రం చేసింది. కార్తీక్ ఆర్యన్ తో ఆమె చేస్తున్న సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.

**గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత..** తెలుగులో టాప్ స్టార్స్ తో నటిస్తున్న శ్రీలీల తనకు పోటీగా వస్తున్న భామలకు టఫ్ ఫైట్ ఇచ్చేందుకు ఇక మీదట గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత ఉన్న రోల్స్ కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. ఐతే శ్రీలీల అనగానే ఆడియన్స్ అందరికీ ఆమె డాన్స్ మాత్రమే గుర్తొచ్చేలా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ స్లిం లుక్ తో మరింత సర్ ప్రైజ్ చేస్తుంది. సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన హీరోయిన్స్ చాలా తక్కువ ఉన్నారు. ఐతే శ్రీలీల మాత్రం తనకంటూ ఒక సెపరేట్ మార్క్ ఉండేలా చూస్తుంది. కార్తీక్ ఆర్యన్ తో తొలి సినిమా సైన్ చేసిన అమ్మడు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నట్టు తెలుస్తుంది. శ్రీలీల అటు తమిళ్ లో కూడా పరాశక్తి సినిమాలో ఛాన్స్ అందుకుంది. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమాలో రవి మోహన్, అథర్వ మురళి కూడా నటించారు.




# స్టార్ వారసుడితో సందీప్ కిషన్.. అప్డేట్ ఏంటి..?




టాలెంట్ ఉన్నా కూడా లక్ కలిసి రాని యువ హీరోల్లో సందీప్ కిషన్ ఒకడు. దాదాపు కెరీర్ ప్రారంభించి 15 ఏళ్లు అవుతున్నా కూడా కెరీర్ ని నిలబెట్టే ఒక్క సక్సెస్ రాలేదు. కొన్ని సినిమాలు హిట్లు అనిపించుకుంటున్నా క్రేజ్ తీసుకురావడంలో విఫలమవుతున్నాయి. అయినా సరే సందీప్ కిషన్ పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. సందీప్ కిషన్ మజాకా లాస్ట్ ఇయర్ రిలీజ్ అవ్వగా అంచనాలను అందుకోలేదు. నక్కిన త్రినాథరావు మీద ఉన్న నమ్మకంతో సందీప్ ఆ సినిమా చేయగా ప్రీ రిలీజ్ బజ్ బాగున్నా సినిమా మాత్రం ఆశించిన సక్సెస్ అందుకోలేదు.

**సంజయ్ డైరెక్షన్ లో సందీప్ కిషన్..** సందీప్ కిషన్ తో కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ తనయుడు సంజయ్ ఒక సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. సంజయ్ డైరెక్షన్ లో తెరకెక్కనున్న ఈ సినిమా క్రేజీగా ఉండబోతుంది. ఐతే ఈ సినిమా అనౌన్స్ మెంట్ అయితే ఎప్పుడో వచ్చినా షూటింగ్ మాత్రం మొదలు పెట్టలేదు. ఐతే దళపతి విజయ్ పొలిటికల్ గా బిజీగా ఉండటంతో పాటుగా ఈమధ్యనే విజయ్ పార్టీ మీటింగ్ లో తొక్కిసలాట వల్ల కూడా సంజయ్ తొలి సినిమా లాంచింగ్ లేట్ అయ్యిందని తెలుస్తుంది. కోలీవుడ్ సర్కిల్ ఇన్ఫర్మేషన్ ప్రకారం సంజయ్, సందీప్ కిషన్ సినిమా త్వరలోనే సినిమా ఓపెనింగ్ ఉంటుందట. ఈ సినిమాతో పాటు కృష్ణ చైతన్యతో కూడా సందీప్ కిషన్ ఒక సినిమా చేస్తున్నారు. పవర్ పేట పేట టైటిల్ తో ఆ సినిమా వస్తుందని తెలుస్తుంది. ఈ సినిమా జనవరిలో సెట్స్ మీదకు తీసుకెళ్లే ప్లానింగ్ జరుగుతుంది. మొత్తానికి సందీప్ కిషన్ నెక్స్ట్ రెండు సినిమాలు భారీ ప్లానింగ్ తోనే వస్తున్నాడు.

**తమిళ్ లో మాత్రం కచ్చితంగా క్రేజ్..** సంజయ్ తో సినిమా తెలుగులో ఎలా ఉన్నా తమిళ్ లో మాత్రం కచ్చితంగా క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది. బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఎలా ఐతే హీరోగా కాకుండా డైరెక్టర్ గా డెబ్యూ ఇచ్చాడో ఇప్పుడు దళపతి విజయ్ తనయుడు సంజయ్ కూడా డైరెక్టర్ గా ఎంట్రీ ఇస్తున్నారు. సందీప్ కిషన్ తో తెలుగు, తమిళ్ బైలింగ్వల్ మూవీగా ఈ సినిమా రాబోతుంది. తమిళ్ లో చాలామంది యువ హీరోలు ఉన్నా కూడా సంజయ్ ఏరికోరి తెలుగు యాక్టర్ తో సినిమా చేయడం పట్ల ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తుంది. సంజయ్ తో సందీప్ కిషన్ ఫ్రెండ్ షిప్ ఉన్నట్టు తెలుస్తుంది. సందీప్ తెలుగులో హీరోగా చేస్తూనే తమిళ్ లో సపోర్టింగ్ రోల్స్ కూడా చేస్తూ వచ్చాడు. ధనుష్ సినిమాల్లో సందీప్ కనిపిస్తాడు. ధనుష్ రాయన్ లో కూడా సందీప్ కిషన్ నటించిన విషయం తెలిసిందే.

# రెడ్ డ్రెస్ లో యువత మనసు దోచుకుంటున్న కాత్యాయిని!





'లిటిల్ హార్ట్స్: నో టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్' అనే ట్యాగ్ లైన్ తో 2025 సెప్టెంబర్ 5న థియేటర్లలో చిన్న సినిమాగా విడుదల అయింది. రొమాంటిక్ కామెడీ సినిమాగా వచ్చిన ఈ చిత్రానికి ఈటీవీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఆదిత్య హాసన్ నిర్మించారు. సాయి మార్తాండ్ దర్శకత్వంలో మౌళి తనూజ్, శివాని నాగారం, రాజీవ్ కనకాల, అనిత చౌదరి, ఎస్ ఎస్ కాంచీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. అక్టోబర్ 1 నుండి ఈటీవీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఈ సినిమాలో కాత్యాయిని పాత్ర పోషించి, తన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది శివాని నాగారం. అదృష్టం తలుపు తడితే ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోవచ్చు అనడానికి ఈమె కూడా ఒక చక్కటి ఉదాహరణ అని చెప్పవచ్చు. 2024లో అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ అనే సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈమె మొదటి సినిమాతోనే గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఊహించిన పాపులారిటీ రాలేదనే చెప్పాలి. ఇక ఇప్పుడు లిటిల్ హార్ట్స్ సినిమాతో కాత్యాయిని పాత్ర పోషించి భారీ క్రేజ్ దక్కించుకుంది అని చెప్పవచ్చు.

ఇందులో తన అద్భుతమైన నటనతో అందరి హృదయాలను దోచుకుంది. అంతేకాదు కుర్రకారు క్రష్ గా కూడా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం హే భగవాన్ అనే సినిమాలో అవకాశం అందుకుంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరొకవైపు సోషల్ మీడియాలో తన క్రేజ్ పెంపొందించుకోవడానికి పలు రకాల ఫోటోలు షేర్ చేస్తోంది. అందులో భాగంగానే రెడ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె అందులో ఘాటు మిర్చిలా అందాలతో ఆకట్టుకుంది. తాజాగా ఈ రెడ్ కలర్ ఫ్రాక్ శివాని నాగారం మేని ఛాయను మరింత పెంచేసింది అని చెప్పవచ్చు. ఈమెను ఇలా చూసేసరికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తమ అభిమాన బ్యూటీ రోజుకు మరింత అందంగా మారిపోతుంది అంటూ కామెంట్ చేస్తున్నారు. శివాని నాగారం లిటిల్ హార్ట్స్ సినిమాలోని పాత్ర తనకు మంచి పేరు అందించింది అని తన ఇంస్టాగ్రామ్ ప్రొఫైల్ ని కూడా కాత్యాయినిగా పెట్టుకుంటానంటూ తెలిపింది ..అంతే కాదు ఇకపై స్క్రీన్ నేమ్ కూడా ఇదే అంటూ చెప్పిన ఈమె.. మరి వచ్చే సినిమాకు ఇదే పేరును కొనసాగిస్తుందా లేక శివాని పేరుగా కంటిన్యూ అవుతుందా అన్నది తెలియాల్సి ఉంది. శివాని నాగారం 1998 ఆగస్టు 25వ తేదీన హైదరాబాద్లో జన్మించింది. ఈమె నటి మాత్రమే కాదు గాయని కూడా.. 2024 లో వచ్చిన ఆరంభం అనే సినిమాలో పాట పాడి మంచి పేరు దక్కించుకుంది . ఏది ఏమైనా చేసింది తక్కువ సినిమాలే అయినా ఈ తెలుగమ్మాయికి అవకాశాలు వరుసగా రావాలి అని అభిమానులు కోరుకుంటున్నారు.

# రష్మిక ప్లేస్ కోసం ఆ ఇద్దరి మధ్య ఫైట్..?

రష్మిక మందన్న ప్రస్తుతం టాలీవుడ్ లోనే కాదు పాన్ ఇండియా లెవెల్ లో అదరగొట్టేస్తున్న అమ్మడు ప్రతి సినిమాను చాలా ప్రెస్టీజియస్ గా చేస్తుంది. ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూనే థామా, ది గర్ల్ ఫ్రెండ్ లాంటి డిఫరెంట్ సినిమాలు కూడా చేస్తుంది రష్మిక. నేషనల్ వైడ్ గా టాప్ రేంజ్ లో దూసుకెళ్తున్న రష్మిక ప్లేస్ ని ఆక్యుపై చేయాలని మిగతా హీరోయిన్స్ తెగ ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యంగా టాలీవుడ్ లో రష్మిక ప్లేస్ కి ఇద్దరి భామల మధ్య ఇంట్రెస్టింగ్ ఫైట్ జరగనుంది. ఆ ఇద్దరిలో ఎవరు ఆ ప్లేస్ కు వస్తారన్నది చర్చ నడుస్తుంది.

**పెళ్లిసందడితో ఎంట్రీ ఇచ్చి ధమాకాతో హిట్టు కొట్టి..** రష్మికలానే చలాకీగా ఉంటూ ఆడియన్స్ తో మంచి ఇంటరాక్షన్ కొనసాగిస్తుంది శ్రీలీల. పెళ్లిసందడితో ఎంట్రీ ఇచ్చి ధమాకాతో హిట్టు కొట్టి గుంటూరు కారం, భగవంత్ కేసరి అంటూ తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుంది అమ్మడు. శ్రీలీలకు ఉన్న ప్లస్ పాయింట్ డాన్స్ లు అదరగొట్టేస్తుంది. రష్మిక కూడా అదే రేంజ్ లో డాన్స్ చేస్తుంది. అంతేకాదు క్యూట్ లుక్స్ లో రష్మికకు ఏమాత్రం తీసిపోదు శ్రీలీల. ఐతే తను ఎంచుకున్న రోల్స్ తో ఇంకాస్త బలంగా ఇంపాక్ట్ చూపించాల్సి ఉంది శ్రీలీల. రష్మికకు మరో ఆప్షన్ గా మారాలని చూస్తుంది బాలీవుడ్ భామ



భాగ్య శ్రీ బోర్స్. మిస్టర్ బచ్చన్ తో మొదలైన అమ్మడి టాలీవుడ్ ప్రయాణం ఒక్క హిట్టు లేకపోయినా కూడా అమ్మడి క్రేజ్ సూపర్ గా ఉంది. కింగ్ డం మీద చాలా హోప్స్ పెట్టుకున్న భాగ్య శ్రీ ఆ సినిమా తో ఫ్యాన్స్ ని డిజప్పాయింట్ చేసింది. ఐతే ఆంధ్రా కింగ్ తాలూకాతో తెలుగులో తొలి సక్సెస్ అందుకోవాలని చూస్తుంది. అదే జరిగితే మాత్రం భాగ్య శ్రీకి మంచి బజ్ వచ్చే ఛాన్స్ ఉంటుంది.

**రష్మిక ప్లేస్ పై గురి..** ఐతే శ్రీలీల, భాగ్య శ్రీ ఇద్దరు కూడా రష్మిక ప్లేస్ పై గురి పెట్టారు. రష్మిక సినిమాల ఎంపికను చూసి వాళ్లు కూడా అదే తరహాలో సినిమాలు చేయాలని చూస్తున్నారు. ఐతే ఈ ఇద్దరిలో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేసే క్వాలిటీస్ ఉన్నాయి కాబట్టి ఈ ఇద్దరు రష్మిక ప్లేస్ లో కాదు ఆమె రేంజ్ కి వెళ్తారని చెప్పడంలో సందేహం లేదు. రష్మికకు ఈ ఇద్దరితోనే కాదు కన్నడ భామ రుక్మిణి వసంత్ కూడా మరో థ్రెట్ అయ్యేలా ఉంది.

ఇప్పటికే నేషనల్ క్రష్ ట్యాగ్ రష్మిక నుంచి రుక్మిణికి ఇచ్చేస్తున్నారు. ఇక అమ్మడు మరో రెండు మూడు సినిమాలు చేస్తే రుక్మిణి పూర్తిగా రష్మికని ఓవర్ టేక్ చేసే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఇలా హీరోయిన్స్ కొత్త స్టార్స్ రాగానే పాత వాళ్లు సైడ్ అవ్వడం చూస్తూనే ఉంటాం. ఐతే ఉన్న వారిలో ఎవరికి ఆ ఛాన్స్ దక్కుతుంది ఎవరు టాప్ చెయిర్ అందుకుంటారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది.

## సంచలన ఫ్రాంచైజీలో పండగ చేస్కో బ్యూటీ!

ఆగ్రా బ్యూటీ సోనాల్ చౌహాన్ కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఒకేలా సాగుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళ్ అంటూ నాలుగు భాషల్లోనూ నటించింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెళ్లి పని చేయడం తప్ప! తనకంటూ ఓ భాష ఉందని నిరూపించుకోలేకపోయింది. అవకాశాలు వస్తున్నా? వాటితో పాటు చిన్నా చితకా విజయాలు అందుకుంటున్నా? స్థిరంగా మాత్రం పని చేయలేకపోతుంది. అయితే ఏడాది కాలంగా ఆ చిన్న పాటి అవకాశాలు కూడా లేవు. చివరిగా గత ఏడాది రిలీజ్ అయిన 'డార్డ్' లో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడు ఏకంగా బంపర్ ఆఫర్ అందుకుంది. సంచలన 'మీర్జాపూర్' ఫ్రాంజెజీలో భాగమవుతుంది. 'మీర్జాపూర్ : దిఫిల్మ్' చిత్రంలో భాగమైనట్లు వెల్లడించింది. అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉందంది. ఈ సినిమాలో నటించడానికి



ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో పర్హాన్ అక్తర్, రితేష్ సిద్వానీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'మీర్జాపూర్' కు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఉన్న సిరీస్ ఇది. పంకజ్ త్రిపాఠీ, అలీ జాపర్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠీ నటించిన 'మీర్జాపూర్' ఫ్రాంచైజీ మూడు సీజన్లు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడిదే సిరీస్ ను గుర్మీత్ సింగ్ సినిమా గా తెరపైకి తేవడం విశేషం. మరి ఈ కథను ఒకే సినిమా గా రిలీజ్ చేస్తాడా? రెండు భాగాలుగా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. సినిమాలో వెబ్ సిరీస్ పాత తారగణంతో పాటు, కొత్త నటీనటులు నటిస్తున్నారు. దీనిలో భాగంగా వెబ్ సిరీస్ లో సోనాల్ చౌహాన్ లేకపోయినా? సినిమా లో అవకాశం అందుకో గలిగింది. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ కథ ఉంటుంది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్త యిన వెంటనే పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలయ్యే అవకాశలున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536